thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 176 కరీంనగర్ బుధవారం, 3 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## త్వరలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా యాప్‌లు భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణ ప్రభుత్వాలకు సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మీడియా కౌన్సిల్ అనివార్యమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి ఇటీవలే నివేదించింది. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉన్నాయి. ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ మీడియా కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.



# కాళేశ్వరంపై సీబీఐ విచారణకు బ్రేక్..

## కేసీఆర్, హరీష్ రావులకు బిగ్ రిలీఫ్!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు పై ఏర్పాటుచేసిన జస్టిస్ పిసి ఘోష్ కమీషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో దీనిపైన చర్చ పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు పై విచారణను సీబీఐ అప్పగించనున్నట్టుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతుంది. ఈ వ్యవహారంలో కోర్టు మెట్లెక్కిన కేసీఆర్, హరీష్ రావులకు తాజాగా హైకోర్టు ఆదేశాలతో కాస్త ఊరట దక్కింది. జస్టిస్ పీసీ ఘోష్ కమీషన్ పై బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంలో జస్టిస్ పీసీ ఘోష్ కమీషన్ ఇచ్చిన నివేదిక చిత్తు కాగితంతో సమానమని, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కావాలని బురద చల్లే చర్య అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ టార్గెట్ చేస్తుంది. ఇక దీనిపై కాంగ్రెస్ నాయకులు సైతం గత ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. లక్ష కోట్ల రూపాయలు కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా దండుకోవాలనే ఆలోచనతోనే కాళేశ్వరం నిర్మించారని కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నారు. హైకోర్టులో కేసీఆర్, హరీష్ రావుల పిటీషన్లు అందుకు ఆధారాలు పీసీ ఘోష్ కమీషన్ సేకరించిందని పేర్కొన్నారు. అవినీతి చెయ్యకుంటే సీబీఐ విచారణ అంటే భయం దేనికని ప్రశ్నించారు. సీబీఐ విచారణలో అసలు నిజానిజాల నిగ్గు తేలుతుందని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై పిసి ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా సిబిఐ విచారణ జరిపిస్తామని అసెంబ్లీలో చేసిన ప్రకటనను సవాలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. హైకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించవద్దని ఆదేశం కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా సిబిఐ విచారణ చేపట్టవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. కెసిఆర్, హరీష్ రావు దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు ఆదేశించింది. అయితే కెసిఆర్ హరీష్ రావు దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్లకు విచారణ అర్హత లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినందున ప్రభుత్వం దీనిని విచారణ చేయడానికి సీబీఐకి అప్పగించనున్నట్లు ఆయన కోర్టుకు తెలిపారు.

ఎన్ డి ఎస్ ఏ నివేదిక ఆధారంగా సిబిఐ దర్యాప్తు చేపడు తుందని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. అయితే అక్టోబర్ ఏడో తేదీ తదుపరి విచారణ చేపడతామని, కోర్టు ఆదేశించడంతో కెసిఆర్, హరీష్ రావు లకు బిగ్ రిలీఫ్ దొరికినట్లు అయింది.



## చనిపోయిన నా తల్లిని అవమానించారు..

### అభ్యంతరకర వ్యాఖ్యలపై మోదీ ఆవేదన

బిహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో కొందరు వ్యక్తులు ప్రధాని మోదీ తల్లిని దూషించారంటూ భాజపా ఇటీవల తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా మోదీ స్పందించారు. ఆర్జేడీ- కాంగ్రెస్‌లు నిర్వహించిన పలు సమావేశాల్లోను, వేదికల పైనా చనిపోయిన తన తల్లిని అవమానిస్తూ మాట్లాడారని, ఆమెకు అవమానం జరిగిందని ప్రధాని ఆవేదన వ్యక్తంచేశారు. బిహార్ రాజ్య జీవికనిధి శాఖ సహాయ సంఘ్ లిమిటెడ్‌ను మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం దాదాపు 20 లక్షల మంది మహిళలను ఉద్దేశించి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కొన్నిరోజుల క్రితం బిహార్‌లో ఆర్జేడీ- కాంగ్రెస్‌ల వేదికపై తన తల్లిని ఉద్దేశిస్తూ కొందరు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ వ్యాఖ్యలు కేవలం తన తల్లికి జరిగిన అవమానం మాత్రమే కాదని, దేశంలోని తల్లులు, సోదరీమణులకు జరిగిన అవమానమన్నారు. ఇవి తనను ఎంతో బాధించాయని మోదీ పేర్కొన్నారు. బిహార్ ప్రజలు కూడా తనలాగే బాధ పడ్డారనే విషయం కూడా తెలుసన్నారు. దివంగత మాతృమూర్తి హీరాబెన్ మోదీ తనను, తోబుట్టువులను పెంచేందుకు ఎంతో కష్టపడ్డారన్నారు. 'అమ్మ అనారోగ్యంతో ఉండేది. అయినా మమ్మల్ని పెంచేందుకు పనిచేస్తూనే ఉండేది. మాకు దుస్తులు కొనేందుకు ప్రతి పైసా ఆదా చేసేది. మన దేశంలో అలాంటి తల్లులు కోట్లాది మంది ఉన్నారు. దేవతల కంటే తల్లి స్థానం చాలా గొప్పది' అని మోదీ పేర్కొన్నారు.




# పొలిటికల్ గాసిప్!

## కవిత కొత్త పార్టీ టీఆర్ఎస్ ప్లస్ బీఆర్ఎస్

### టోటల్‌గా టీబీఆర్ఎస్ (తెలంగాణ బహుజన రాష్ట్ర సమితి)

తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) చీలక దిశగా పయనిస్తోందా? అన్న చర్చ మొదలైంది. పార్టీ అధినేత కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత ధిక్కారంతో బీఆర్ఎస్ రాజకీయాలు వేడెక్కాయి. పార్టీ సీనియర్ నేతలు, సొంత కుటుంబ సభ్యులు అయిన మాజీ మంత్రి హరీశ్ రావు, ఎంపీ జోగినాపల్లి సంతోష్ పై కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమెపై వేటు వేసే దిశగా బీఆర్ఎస్ అధిష్టానం ఆలోచిస్తోందని అంటున్నారు. ఇదే సమయంలో తన రాజకీయ భవిష్యత్తుపై ఫుల్ క్లారిటీతో ఉన్న కవిత సొంత పార్టీ ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారంటున్నారు. కవిత ప్రారంభించబోయే పార్టీ పేరు.. కార్యాలయం కూడా సిద్ధమైందని ప్రచారం జరుగుతోంది.

**ఆ ఇద్దరిపై ఆగ్రహం...** ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తెలంగాణ జాగృతి పేరుతో సాంస్కృతిక పోరాటం చేసి ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్న కవిత.. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్నారు. అయితే తండ్రి వారసత్వంగా పార్టీ పగ్గాలు చేపట్టాలని భావిస్తున్న కవిత.. తనకు అడ్డుగా ఉన్నారని సొంత అన్న కవిత, మేన బావ హరీశ్ రావుపై కొంత కాలంగా వ్యతిరేకత ప్రదర్శిస్తున్నారు. ఆ ఇద్దరు తన రాజకీయ ఎదుగుదలకు అడ్డుగా నిలుస్తున్నారని కవిత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో గత ఆరేడు నెలలుగా ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ఇదే సమయంలో ఆమె విషయంలో ఇన్నాళ్లు బీఆర్ఎస్ వేచిచూసే ధోరణి అవలంభించింది. అయితే తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ప్రభుత్వం సీబీఐకి లేఖ రాయడంతో బీఆర్ఎస్ లో అగ్గి రాజుకుంది. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, తన తండ్రికి మచ్చ కలిగేలా హరీశ్ రావు అవినీతికి పాల్పడ్డారని కవిత ఆరోపించడంతో బీఆర్ఎస్ చిక్కుల్లో పడిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమెపై పార్టీ నుంచి బహిష్కరించాలని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

**సొంత పార్టీపై నిర్ణయం...** అయితే బీఆర్ఎస్ లో తనకు నాయకత్వం అప్పగించే విషయంలో సానుకూలత కనిపించకపోవడంతో కవిత వేరుదారి చూసుకుంటున్నట్లు చెబుతున్నారు. తండ్రిని ధిక్కరించి వేరే పార్టీలో చేరితే రాజకీయంగా అప్రదిష్ట మూటగట్టుకునే అవకాశం ఉందన్న ఆలోచనతో సొంతంగా పార్టీ పెట్టాలని కవిత నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తన అంతరంగికులతో ఈ విషయమై చర్చించారని, పార్టీ పేరుపైనా ఓ నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. అంతేకాకుండా కార్యాలయాన్ని ఎంపిక చేశారని కవిత సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**టీఆర్ఎస్ లేదా టీబీఆర్ఎస్...** తెలంగాణ సమాజంలో బాగా ప్రాచుర్యం పొందిన టీఆర్ఎస్ అన్న పేరును కవిత పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. టీఆర్ఎస్ పార్టీ పేరుతోపాటు ప్రస్తుత బీఆర్ఎస్ పేరు కలిసేలా టీబీఆర్ఎస్ అన్న పేరు కూడా ఆమె పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. టీబీఆర్ఎస్ అంటే తెలంగాణ బహుజన రాష్ట్ర సమితిగా వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేయడంతోపాటు రాష్ట్రంలో బీసీ వర్గాలను బాసటగా నిలిచేలా టీబీఆర్ఎస్ పేరును ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ టీఆర్ఎస్ గా ఉండేది. ఆ పేరుతోనే రెండు సార్లు ప్రజా విశ్వాసాన్ని చూరగొని అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ గా మారిన తర్వాతే అధికారం కోల్పోయింది. దీంతో కవిత టీఆర్ఎస్ పేరు అయితే సెంటుమెంటు కలిసివస్తుందని చూస్తున్నారని అంటున్నారు. అయితే ఎక్కువ మంది టీఆర్ఎస్ కన్నా టీబీఆర్ఎస్ అన్న పేరుతోనే పార్టీ ఏర్పాటు చేయాలని సూచిస్తున్నట్లు చెబుతున్నారు.

**అక్కడే కార్యాలయం...** ఇక పార్టీపై తుది నిర్ణయం తీసుకునే ముందు కార్యాలయాన్ని కూడా కవిత సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. బంజారాహిల్స్ లోని తన ఇంటి పక్కనే మూడు అంతస్థుల భవనాన్ని ముందుగా ఎంపిక చేసుకోవాలని ఆమె భావిస్తున్నట్లు చెబుతున్నారు. పార్టీ పేరు, కార్యాలయం సిద్ధమైన తర్వాత వీలైనంత త్వరగా పార్టీ పేరు ప్రకటించాలని కవిత భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ ప్రకటన కూడా దసరా లేదా దీపావళిలో ఉంటుందని అంటున్నారు. ఇదే సమయంలో పార్టీ ప్రకటించే ముందు తండ్రి కేసీఆర్ తో కవిత మరోమారు చర్చించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో కవితకు కేసీఆర్ అపాయింట్మెంట్ లభిస్తుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక కవిత విషయంపై తాడేపేడో తేల్చేయాలన్న ఉద్దేశంతో ఉన్న బీఆర్ఎస్ సీనియర్లతో చర్చిస్తోంది. కవిత విషయంతో కొద్ది రోజుల్లోనే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు.



# కాళేశ్వరం కేసు తేలదు...

# 'గులాబీ'కి స్వేచ్ఛ ఉండదు!

## అద్గదీ రేవంతుడు స్కెచ్!

కాళేశ్వరం కేసు కేంద్ర దర్యాప్తు సంస్థ చేతిలోకి వెళ్ళింది. కేంద్ర దర్యాప్తు సంస్థ చేతిలో కొన్ని వేల కేసులు ఉన్నాయి. ఇప్పటికే జగన్ అక్రమస్తుల కేసు సంవత్సరాలుగా పెండింగ్లోనే ఉంది. ఆయన కూడా బెయిల్ మీదనే ఉన్నారు. వివేక హత్య కేసు కూడా ఇంతవరకు తేలలేదు. ఇవే కాదు ఇంకా చాలా కేసుల్లో కూడా సిబిఐ అడుగులు అంత వేగంగా లేవు. సిబ్బంది కొరత కూడా కేంద్ర దర్యాప్తు సంస్థను తీవ్రంగా వేధిస్తోంది. ఇదే సమయంలో కాళేశ్వరం కేసు సిబిఐ చేతిలోకి వెళ్ళింది.. ఈ కేసు ఇప్పుడు తేలుతుందా? ఇప్పటికిప్పుడు శిక్ష పడుతుందా? అనే ప్రశ్నలు పక్కన పెడితే.. తెలంగాణ ముఖ్యమంత్రిని గులాబీ పార్టీ తక్కువ అంచనా వేసింది. ఇప్పటికీ కూడా రేవంత్ తమను ఏమీ చేయలేరనే ధీమాలోనే గులాబీ పార్టీ ఉంది.

**తన భవిష్యత్తు అక్కడే నిర్మించుకున్నాడు...** వాస్తవానికి తెలంగాణ ముఖ్యమంత్రి తన రాజకీయ భవిష్యత్తును మొత్తం తమ పార్టీ మీదనే నిర్మించుకున్నాడనే విషయాన్ని గులాబి నేతలు విస్మరిస్తున్నారు.. పింకు పార్టీ ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యవహరించిన తీరు వల్లే ఆయన ఒక్కసారి గా తెలంగాణలో హీరో అయిపోయాడు. కెసిఆర్ కు ప్రత్యామ్నాయ నాయకుడిగా ఎదిగాడు.. కాంగ్రెసులో గొప్ప గొప్ప నాయకులు ఉన్నప్పటికీ కొడంగల్ శాసనసభ్యుడిని అధిష్టానం ముఖ్యమంత్రి ని చేయాలని భావించిందంటే.. అతని స్టామినా ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు చూస్తున్న రాజకీయ ప్రణామాలను పరిశీలిస్తే తెలంగాణ సీఎం సాధారణ రాజకీయ నాయకుడిగా కాకుండా అసాధారణ వ్యక్తిగా ఎదుగుతున్నట్టు అర్థమవుతుంది. కేంద్ర దర్యాప్తు సంస్థ విషయంలో ప్రతిపక్షాలు భయపడి సాధారణ సమ్మతిని కూడా రద్దు చేశాయి. ఇలాంటి స్థితిలో ధైర్యంగా జీవో నెంబర్ 51 ను వెనక్కి తీసుకున్నాడు తెలంగాణ ముఖ్యమంత్రి. కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి తనను తాను.. తన పార్టీని కూడా రక్షించుకోగలను అనే ధీమా అతడిలో ఉంది. ఒక రకంగా ఇది రాహుల్ వల్ల కూడా కాలేదు. రాహుల్ లాంటి వ్యక్తి కేంద్ర దర్యాప్తు సంస్థలను నిందిస్తున్న వేళ.. తెలంగాణ సీఎం వేసిన అడుగులు ఆశ్చర్యకరం. రేవంత్ కంటే కూడా ఢిల్లీలో బలం ఎక్కువగా ఉన్న నాయకుడిగా చంద్రబాబు పేరు గడించాడు. అటువంటి వ్యక్తి కూడా కేంద్ర దర్యాప్తు సంస్థ విషయంలో 2019లో జాగ్రత్త పడితే.. రేవంత్ మాత్రం ఏ మాత్రం భయం లేకుండా వ్యవహరిస్తున్నాడు.. కేంద్ర దర్యాప్తు సంస్థ కాళేశ్వరం విషయంలో ముందుకు వెళితే.. ఒకవేళ అక్కడే ఆగిపోతే తెలంగాణ ముఖ్యమంత్రికి వచ్చే ఇబ్బంది లేదు. అంతేకాదు రాజకీయంగా ఆయనకు అనేకంగా లాభాలు ఉన్నాయి. ఒకవేళ అనుకున్న పలుకుబడితో కేసీఆర్ నిర్దోషి అని చెప్పించుకున్నప్పటికీ.. తన దగ్గర ఉన్న ఆధారాలను తెలంగాణ ముఖ్యమంత్రి మొహమాటం లేకుండా బయటపడతాడు.

**పట్టు పెంచుకున్నాడు...** ఇటీవల నేషనల్ సర్కిల్స్ లో జరిగిన చర్చ ప్రకారం.. కేంద్రంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు ఏ స్థాయిలో పట్టు ఉందో.. తెలంగాణ ముఖ్యమంత్రి కి కూడా అదే స్థాయిలో పట్టు ఉ ంది. ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో మైండ్ గేమ్ ను ప్రదర్శించిన తెలంగాణ సీఎం.. గులాబీ పార్టీకి ఒక్క సీటు కూడా రాకుండా చేశాడు. చాలామంది అనుకుంటున్నట్టుగా తెలంగాణ త్రీ గోర్జెస్ విషయంలో తెలంగాణ సీఎం టార్గెట్ అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి కాదు. ఇప్పటికీ అతడు రక్షణాత్మక ధోరణిలోనే ఉన్నాడు.. ఒకవేళ ఈ కేసులో ఆయనను అరెస్ట్ చేసే అవకాశం ఉన్నప్పటికీ.. ఆయన దానిమీద దృష్టిసారించలేదు. గులాబీ పార్టీపై సానుభూతి పెంచడం ఎందుకు అన్నట్టుగానే తెలంగాణ ముఖ్యమంత్రి వ్యవహరించినట్టు తెలుస్తోంది.. అందువల్లే అత్యంత తెలివిగా బంతిని కేంద్రం కోర్టులో వేశాడు. ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు ఇచ్చే విషయంలో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వేం నరేందర్ రెడ్డి కి మినహా మిగతా ఎవరికి కూడా సమాచారం లేదు. అంతేకాదు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను కూడా తెలంగాణ ముఖ్యమంత్రి అత్యంత సీరియస్ గా తీసుకున్నాడు. అజహారుద్దీన్ కు ఉన్నట్టుండి ఎమ్మెల్సీ ఇచ్చాడు. ఒకరకంగా ఇది గులాబీ పార్టీకి రేవంత్ ఇచ్చిన మాస్టర్ స్ట్రోక్. అజహారుద్దీన్ కు టికెట్ ఇస్తే దివంగత ఎమ్మెల్యే భార్యను బరిలోకి దింపి గెలుద్దామని.. తద్వారా రేవంత్ పరిపాలనను ప్రజలు తిరస్కరిస్తున్నారని గులాబీ పార్టీ ప్రచారం చేద్దామనుకుంది. కానీ ఆ ప్రచారానికి చెక్ పెట్టాడు రేవంత్.. అంతేకాదు మాజీ క్రికెటర్ కు ఎమ్మెల్సీ ఇచ్చి.. గడచిన ఎన్నికల్లో ఓడిపోయిన నవీన్ యాదవ్ కు టికెట్ కన్ఫామ్ చేశాడు. స్థూలంగా చెప్పాలంటే కాళేశ్వరం ఇప్పట్లో తేలకపోవచ్చు.. కాకపోతే గులాబీ పార్టీ ఒకప్పటి మాదిరిగా ఒకప్పటి మాదిరిగా పనిచేయలేదు. అది తెలంగాణ ముఖ్యమంత్రి వేసిన స్కెచ్.




# భారాస నుంచి కవిత సస్పెన్షన్

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి సంచలన నిర్ణయం తీసుకుంది. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శులు సోమ భరత్‌కుమార్, టి.రవీందర్‌రావు పేరిట ఓ ప్రకటన విడుదల చేసింది. "ఇటీవల కాలంలో కవిత ప్రవర్తిస్తున్న తీరు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు భారత రాష్ట్ర సమితికి నష్టం కలిగించేలా ఉన్నాయి. అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు" అని భారత రాష్ట్ర సమితి పేర్కొంది. కవిత ప్రస్తుతం నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా ఉన్నారు. కొంతకాలంగా భారత రాష్ట్ర సమితితో విభేదిస్తున్న కవిత.. ఎక్కువగా తెలంగాణ జాగృతి తరఫున నిర్వహించే కార్యక్రమాలకే పరిమితమయ్యారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని.. తనపై కొందరు కుట్రలకు పాల్పడుతున్నారని ఇటీవల ఆరోపించారు. గతంలో పరోక్ష విమర్శలు చేసిన కవిత.. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ వరకు పరిస్థితి వచ్చాక.. పార్టీ ఉంటే ఎంత? లేకపోతే ఎంత? అని కవిత వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో పార్టీ విధానంతో ఆమె విభేదించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కవితను పార్టీ సస్పెండ్ చేసింది.



# కాళేశ్వరం మంటల్లో కవిత ఆజ్యం

## కాళేశ్వరం నిర్మాణంలో అవినీతిని కవిత అంగీకరించారు: కాంగ్రెస్ నేతలు

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలు, ప్రత్యారోపణల యుద్ధం నడుస్తోంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కేసును ప్రభుత్వం సీబీఐ విచారణకు అప్పగించడంతో రాజకీయం రసకందాయంలో పడింది. కాళేశ్వరం ప్రాజెక్టు, పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగినట్లు కవిత అంగీకరించారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.

కాళేశ్వరంపై విచారణను సీబీఐకి అప్పగించడంపై హర్షం వ్యక్తం చేసిన భాజపా.. అన్ని ఆధారాలివ్వాలని డిమాండ్ చేసింది.



## కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా

# సీబీఐ విచారణ జరపండి

హైదరాబాద్: కాళేశ్వరంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నివేదిక ఆధారంగా సీబీఐ (%జదీ×%) విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిఫారసు చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్ఏ గుర్తించిందని.. ప్రణాళిక, డిజైన్, నాణ్యత, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. అందుకే ఈ అంశంపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ కూడా విచారణ జరిపి లోపాలను గుర్తించిందని తెలిపింది. ఎన్‌డీఎస్ఏ నివేదికపై అసెంబ్లీలో చర్చించామని లేఖలో ప్రభుత్వం ప్రస్తావించింది. మరోవైపు రాష్ట్రానికి సీబీఐ రాకుండా గతంలో ఉన్న ఆదేశాలను సడలిస్తూ జీవో విడుదల చేసింది. సీబీఐ విచారణకు అన్నివిధాలుగా సహకరిస్తామని ప్రభుత్వం పేర్కొంది.



# ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్.. వారి అంతర్గత వ్యవహారం!

హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సస్పెన్షన్ అంశం.. వారి అంతర్గత కుటుంబ వ్యవహారమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శాసనసభ ఎన్నికల సమయంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, అవకతవకలపై జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసి ఆ నివేదిక ఆధారంగా తదుపరి విచారణను సీబీఐకి అప్పగించామని బహిరంగంగా ప్రకటించినట్లు చెప్పారు.

# జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ వద్దు: హైకోర్టు



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ చేపట్టవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. కాళేశ్వరం కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. కేసీఆర్, హరీశ్‌రావు దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్లకు విచారణార్హత లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను సీబీఐకి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు చేపడుతుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తదుపరి విచారణను న్యాయస్థానం అక్టోబర్ 7కి వాయిదా వేసింది.



# బీఆర్ఎస్ కూలింది..

ఢిల్లీ: మొన్న కాళేశ్వరం కూలింది, నిన్న బీఆరెస్ కూలిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కాళేశ్వరం మూడు పిల్లర్లు కూలిపోతే, బీఆర్ఎస్ మూడు ముక్కలు అయ్యిందని ఎద్దేవా చేశారు. అవినీతి పరులకు బీజేపీలో చోటులేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు.. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి కేసు విషయంలో కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. సీబీఐతో దర్యాప్తు చేయాలంటూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం విషయంలో 22 నెలల నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాలయాపన చేశారో.. తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో తన దగ్గర ఆధారాలు ఉన్నాయని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు సీబీఐకి ఆ ఆధారాలు ఇచ్చి విచారణకు సహకరించాలని ఎంపీ లక్ష్మణ్ సూచించారు. కాగ్ కూడా అవినీతి జరిగింది, లోపాలు ఉన్నాయాని చెప్పిందని స్పష్టం చేశారు. ఘోష్ కమిషన్ నివేదికలో క్రిమినల్ రిఫరెన్స్ లేకుండా నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్ల పాత్ర ఏంటో స్పష్టంగా చెప్పలేదని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత బహిరంగంగా హరీష్ రావు, సంతోష్ అవినీతికి పాల్పడ్డారు అని చెప్పారని గుర్తు చేశారు. హరీష్ రావు, సంతోష్ అవినీతి ఆనకొండలు అని చెప్పిందని స్పష్టం చేశారు. ఇరువురు తెలంగాణ ఆస్తులు కొల్లగొట్టారని విమర్శించారు. రాష్ట్ర ఏర్పాటుకు అనేక మంది యువత, ఉద్యోగులు, ప్రజలు తెలంగాణ కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. అమరుల త్యాగాలను కేసీఆర్ కుటుంబం క్యాష్ చేసుకుని, కోట్లకు పడగలు ఎత్తిందని మండిపడ్డారు. నిష్పక్షపాతంగా సీబీఐ దర్యాప్తు జరగాలి, అవినీతిపరులకు శిక్ష పడాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను బలిపశువును చేసారని కవిత అంటున్నారు, అంటే హరీష్ రావు, సంతోష్ రావుల అవినీతి కేసీఆర్‌కు తెలుసా అని అనుమానం వ్యక్తం చేశారు. కాళేశ్వరం అవినీతిలో అధికారులు, కాంట్రాక్టులు ఎవరున్నా వారిని శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# సైఫాబాద్ పీఎస్‌లో కేసు.. కొట్టివేయాలని హైకోర్టులో సీఎం రేవంత్ పిటిషన్



హైదరాబాద్: సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు 2021లో పీసీసీ ఆధ్వర్యంలో రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. రేవంత్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉంది. ప్రజాప్రతినిధుల కోర్టులో రేవంత్ రెడ్డికి హాజరు నుంచి హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావును హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 7వ తేదీకి వాయిదా వేసింది.

**హైకోర్టులో కేటీఆర్ పిటిషన్...** బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టేయాలని మాజీ మంత్రి కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సృజన్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బంజారాహిల్స్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు పీపీని ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 9వ తేదీకి వాయిదా పడింది.

# వాళ్ల ఆస్తుల తగాదాలతో మాకేం సంబంధం లేదు: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెండ్ కావడంపై తాము స్పందించబోమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆమెపై సస్పెన్షన్ ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని చెప్పారు. ఆస్తులు, వాటాల్లో వారి మధ్య తగాదాలున్నాయని గతంలోనే తాను చెప్పినట్లు గుర్తు చేశారు. ఆ తగాదాలే సస్పెన్షన్‌కు దారి తీసి ఉండొచ్చన్నారు. "కొందరు కవిత వెనుక ఉన్నామన్నారు. మరికొందరు హరీశ్‌రావు, సంతోష్ వెనుక ఉన్నామని చెబుతున్నారు. కానీ, మేం ప్రజల వెంట ఉన్నాం. మిగతా ఎవరి వెనకాల లేము. మేం ప్రభుత్వాన్ని నడుపుతున్నాం. ప్రజలు మా వెంట ఉన్నారు. ఎవరికో వత్తాసు పలకాల్సిన అవసరం మా పార్టీకి, సీఎంకు లేదు. అవినీతిపరులందరినీ దూరం పెడతాం. కేసీఆర్ కుటుంబం కూడా అవినీతిలో కూరుకుపోయింది. అవినీతి సంపదలో వాటాల విషయంలో తగాదా వచ్చినట్లుంది. వారి తగాదాలతో మాకు సంబంధం లేదు"అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిని గెలిపించాలి: ప్రొఫెసర్ కోదండరామ్

హైదరాబాద్: ఈ ఉపరాష్ట్రపతి ఎన్నికలు.. దేశ ప్రయాణం ఏ దిశలో సాగాలో నిర్దేశించే ఎన్నికలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కోదండరామ్ మీడియాతో మాట్లాడారు. ఆధిపత్యం, అధికారం కోసం మాత్రమే ఆలోచిస్తున్న కొందరికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలను రక్షించడం కోసం పార్టీలకు అతీతకంగా ముందుకొచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. న్యాయ కోవిదులు, యూనివర్సిటీల మాజీ వీసీలు, రాజ్యాంగబద్ధ సంస్థల మాజీ ఛైర్మన్‌లు, సీనియర్ జర్నలిస్టులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు, సినీ ప్రముఖులు, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వ్యక్తులు సుదర్శన్ రెడ్డికి మద్దతుగా సంతకాల చేశారని చెప్పారు. అర్బన్ నక్సలైట్ అంశంపై కోదండరామ్ మాట్లాడుతూ.. "అర్బన్ నక్సలైట్ అంటే అర్థం ఏంటో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. అర్బన్ ఏరియాలో పని చేసినంత మాత్రాన నక్సలైట్ ముద్ర వేయడం ఏంటి?ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పనిచేస్తే ఆ ముద్ర వేసేస్తారా?సామాజిక అభివృద్ధి, వికాసం పట్ల ఈ ముద్ర వేసేవారికి వ్యతిరేకత ఉందని అనుకోవాలి. అణచివేసే ప్రయత్నం చేస్తున్నారంటేనే.. ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకత ఉందని అర్థం. ప్రజాస్వామ్య పరిరరక్షణ దేశ ప్రయోజనాలను జస్టిస్ సుదర్శన్ రెడ్డి కాపాడతారు. ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నా"అని కోదండరామ్ అన్నారు.



# పోలీసులపై కాల్పులు.. ఆప్ ఎమ్మెల్యే పరారీ

పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పఠాన్ మజ్రా అత్యాచార ఆరోపణలపై అరెస్టయ్యారు. అయితే, ఆయన అనూహ్యంగా పోలీసు కస్టడీ నుంచి పరారయ్యాడు. హరియాణాలోని కర్నాల్‌లో పోలీసులపై కాల్పులు జరిపి పారిపోయాడు ఎమ్మెల్యే. పటియాలలోని సనౌర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న హర్మీత్, తన సహచరులతో కలిసి పోలీసులపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఒక పోలీస్ అధికారిని గాయపరిచి, వాహనంతో ఢీకొని తప్పించుకున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పఠాన్ మజ్రాను పట్టుకునేందుకు పంజాబ్ పోలీసులు గాలింపు చేపట్టారు. కాగా, ఎమ్మెల్యేపై అత్యాచార కేసు జిరక్‌పూర్‌కు చెందిన ఒక మహిళ ఫిర్యాదు మేరకు నమోదైంది. హర్మీత్ విడాకులు తీసుకున్నట్లు తనకు తప్పుడు సమాచారం ఇచ్చి, 2021లో పెళ్లి చేసుకున్నాడని సదరు మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాదు, తన మీద లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడి, అసభ్యకరమైన సందేశాలను పంపినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

అయితే, ఈ ఆరోపణలను హర్మీత్ ఖండించారు. ఇవి రాజకీయ కుట్రలో భాగమని, ఆప్ ఢిల్లీ నాయకత్వం తనను లక్ష్యంగా చేసుకుందని ఫేస్‌బుక్ లైవ్‌లో ఆరోపించాడు. ఇదిలా ఉంటే, ఈ ఘటనలకు ముందు హర్మీత్ పంజాబ్‌లో వరదల నిర్వహణపై తన పార్టీ ప్రభుత్వాన్ని, ఢిల్లీ నాయకత్వాన్ని విమర్శించాడు. ఈ క్రమంలో ఆప్ నేతృత్వంలోని పంజాబ్ సర్కార్ హర్మీత్ భద్రతా సిబ్బందిని ఉపసంహరించి, సనౌర్ నియోజకవర్గంలోని పోలీసు స్టేషన్ కు అధికారులను బదిలీ చేసింది. దీంతో ఈ కేసు రాజకీయ వివాదంగా మారింది, హర్మీత్ తన అరెస్ట్‌ను రాజకీయ కక్షసాధింపుగా చెబుతుండగా.. పోలీసులు అతడిని పట్టుకునేందుకు హరియాణా పోలీసులతో కలిసి గాలిస్తున్నారు.




అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న ఆంక్షలు భారతీయ నిపుణుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఈ విషయం అజ్ఞాత వర్క్‌ప్లేస్ యాప్ బ్లైండ్‌తో మరోసారి తేటతెల్లమైంది. ఉద్యోగం కోల్పోతే ఏం చేస్తారని ప్రశ్నించగా 45 శాతం మంది తాము భారత్‌కు తిరిగి వెళ్లిపోతామని చెప్పినట్లు అందులో తెలిసింది. 26 శాతం మంది మరో దేశానికి వెళ్లడానికి ఆసక్తి చూపించారు. 29 శాతం మంది ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నట్లు వెల్లడైంది. యూఎస్‌ను వీడటానికి ప్రధానంగా చెబుతున్న కారణాల్లో జీతాల్లో కోతలు (25%), నాణ్యత లేని జీవనం (24%), సాంస్కృతిక లేదా కుటుంబ సమస్యలు (13%), తక్కువ అవకాశాలు (10%) ఉన్నాయి. మళ్లీ యూఎస్ వర్క్ వీసాను ఎంచుకుంటారా? అని ప్రశ్నించగా.. 35 శాతం మంది మాత్రమే సుముఖత వ్యక్తంచేశారు. 65 శాతం మంది ప్రతికూల లేదా ఎటూ తేల్చుకోలేమనే సమాధానం ఇచ్చారు.

**ఉద్యోగం పోతే బహిష్కరణ ముప్పు...** ఉద్యోగం పోతే 60 రోజుల లోపే బహిష్కరణ ముప్పును ఎదుర్కోవాల్సి ఉంటుందని 35 శాతం మంది అభిప్రాయపడ్డారు. తమ లేదా తమకు తెలిసిన వారి అనుభవం ఆధారంగా ఈ ఆందోళన వ్యక్తంచేశారు. గ్రేస్ పీరియడ్ కంటే ముందే తమకు నోటీసులు అందినట్లు మరికొందరు వాపోయారు. తమపై దీర్ఘకాలిక నిషేధం విధిస్తారనే భయం పెరిగిపోయిందని ప్రతి ఆరుగురిలో ఒకరు సమాధానమిచ్చారు. ఉద్యోగం పోయిన వెంటనే అమెరికాను వీడితే అలాంటి ముప్పు తప్పుతుందని కొందరు ఇమిగ్రేషన్ న్యాయవాదులు సలహా ఇస్తున్నారు. అమెరికా టెక్ కంపెనీల్లో భారతీయులను నియమించుకోవడం ఆపేయాలని ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హుకుం జారీ చేశారు. ఈ నిర్ణయం తమ సంస్థలకు లాభం చేకూరుస్తుందని యూఎస్‌లోని 63 శాతం మంది నిపుణులు అభిప్రాయపడ్డారు. కానీ, తమకు నష్టం చేకూరుస్తుందని భారత్‌కు చెందిన 69శాతం మంది వర్కర్లు ఆందోళన వ్యక్తంచేశారు.

**వేతనాల ఆధారంగా హెచ్1 బీ ఎంపిక విధానం...** ప్రస్తుత లాటరీ విధానాన్ని మార్చాలనే ప్రణాళికకు ఈ ఏడాది ఆగస్టులో యూఎస్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ రెగ్యులేటరీ అఫైర్స్ ఆమోదం తెలిపింది. 2021లోనూ ఇలాంటి ప్రయత్నం జరిగింది. దీంతో అత్యధిక వేతనదారులు ప్రయోజనం పొందే అవకాశం ఉండగా.. ఇటీవల పట్టాలు పొందిన గ్రాడ్యుయేట్లకు నిరాశ ఎదురుకావొచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ప్రతి యేటా హెచ్1 బి క్యాప్ ప్రకారం 85 వేల వీసాలు ఆశావహులకు దక్కుతాయి. అందులో 65 వేలు సాధారణ దరఖాస్తుదారులకు కాగా.. మిగిలిన 20 వేలు యూఎస్ మాస్టర్ డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువస్థాయిలో చదివిన వారికి చెందుతాయి. ఒకవేళ పరిమితికి మించి దరఖాస్తులు వస్తే లాటరీ విధానం ద్వారా కేటాయింపులు జరుగుతాయి. ఈ సౌలభ్యాన్ని ప్రస్తుతం ఎక్కువగా టెక్నాలజీ సంస్థలు వినియోగించుకుంటున్నాయి.




## అఫ్గాన్‌లో భూకంప విలయం.. 800 మందికి పైగా మృతి

అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. పాకిస్థాన్ సరిహద్దులోని కునార్ ప్రావిన్స్‌లో రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రత నమోదైంది. ఈ ఘోర విపత్తు కారణంగా 800 మందికి పైగా మరణించినట్లు ఆ దేశ అధికారిక మీడియా సంస్థ రేడియో టెలివిజన్ అఫ్గానిస్థాన్ వెల్లడించింది. మరో 2500 మంది వరకు గాయపడినట్లు తెలిపింది. యూఎస్ జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం.. నంగర్హార్ ప్రావిన్స్‌లోని జలాలాబాద్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడైంది. 8 కిలోమీటర్ల లోతులో అది కేంద్రీకృతమై ఉంది. ఆదివారం అర్ధరాత్రి 11.47 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించినట్లు అధికారులు తెలిపారు. ఘోర విపత్తు కారణంగా కునార్ ప్రావిన్స్ తీవ్రంగా ప్రభావితమైనట్లు సమాచారం. భూకంప తీవ్రతకు సంబంధించిన పలు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. బాధితులకు అత్యవసర సహాయం అవసరమని పలువురు పోస్టులు పెడుతున్నారు.

**హమాస్ అధికార ప్రతినిధిని చంపేశాం...** భూకంపం కారణంగా పలు గ్రామాల్లోని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని వార్దక్ ప్రావిన్స్ మాజీ మేయర్ జరీఫా ఘఫ్ఫారీ పోస్టు పెట్టారు. ఈ విపత్తు ధాటికి పలు కుటుంబాలు కకావికలమైనట్లు పేర్కొన్నారు. 'అఫ్గానిస్థాన్‌లోని కునార్, నోరిస్థాన్, నంగర్హార్ ప్రావిన్స్‌లు భూకంపం కారణంగా తీవ్రంగా నష్టపోయాయి. ఇళ్లు కూలిపోవడంతో పలు కుటుంబాలు వీధిన పడ్డాయి. వారి జీవితం అగమ్యగోచరంగా మారింది. గ్రామాల్లోని మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర గాయాలపాలై ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బాధితుల పరిస్థితి దుర్భరంగా ఉంది. అసమర్థ తాలిబన్ ప్రభుత్వం ఈ విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా లేదు. ఈ సమయంలో కునార్ ప్రజలకు సాయం అత్యవసరం. అంతర్జాతీయ సమాజం, మానవతా సంస్థలు సత్వరమే స్పందించి బాధితులను ఆదుకోవాలి. అవసరమైన ఆహారం అందించి.. ఆశ్రయం కల్పించాలి. ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయాలి' అని పోస్టులో పేర్కొన్నారు. భూకంపం కారణంగా పలువురు మరణించారనే వార్త విని తాను చలించిపోయానని క్రికెటర్ రహ్మనుల్లా గుర్బాజ్ పోస్టు పెట్టారు. బాధితుల కుటుంబం కోసం ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులు సమీపంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అంతకుముందు ఓ అధికారి తెలిపారు. 20 నిమిషాల వ్యవధి తర్వాత 4.5 తీవ్రతతో మరో భూకంపం వచ్చినట్లు పేర్కొన్నారు.




భారత్‌ను బెదిరించేందుకు ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఏ ప్రయత్నాన్ని విడిచిపెట్టడం లేదు. దేశంలోని కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకొని రెచ్చగొట్టేలా తాజాగా వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై నోటికి వచ్చినన్ని ఆరోపణలు చేశారు. "క్రెమ్లిన్‌కు భారత్ లాండ్రోమ్యాట్ వలే పనిచేస్తోంది. మీకు తెలుసా.. ఓ వర్గం లబ్ధి పొందేందుకు భారత ప్రజలను ఫణంగా పెడుతోంది. మనం దానిని అడ్డుకోవాలి. అది ఉక్రెయిన్ వాసులను చంపుతోంది. మనం (అమెరికన్లు) చెల్లింపుదారులుగా ఏం చేయాలో అది చేయాలి" అని నవారో పేర్కొన్నారు. అదే సమయంలో మాస్కో, బీజింగ్‌తో న్యూదిల్లీ సంబంధాలు ప్రపంచ స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయంటూ నవారో ఆందోళన వ్యక్తంచేశారు. "అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి అధినేత అయిన మోదీ ఓ గొప్ప నాయకుడు. కానీ, పుతిన్, జిన్‌పింగ్‌తో ఎందుకు అంటకాగుతున్నారో నాకు అర్థం కావడంలేదు" అని వ్యాఖ్యానించారు. రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న వాటిల్లో భారత ప్రభుత్వరంగం వాటాలు ఉన్న ఐవోసీ, బీపీసీఎల్ ఉండగా.. ఆ తర్వాత స్థానాల్లో రిలయన్స్, నయారా ఎనర్జీ ఉన్నాయి. 150 కోట్ల మంది చమురు అవసరాలకు తమకు చౌక ఇంధనం ముఖ్యమని భారత ప్రభుత్వం చెబుతూనే ఉంది. 2024 ట్రేడింగ్ ఎకనామిక్స్ లెక్కల ప్రకారం అమెరికా రష్యా నుంచి 3.27 బిలియన్ డాలర్ల వస్తువులను దిగుమతి చేసుకొంది. వీటికోసం అత్యధికంగా 1.3 బిలియన్ డాలర్లను వెచ్చించింది. భారత్ చమురు కొనుగోళ్ల గురించి మాట్లాడే నవారో ఈ దిగుమతల ఊసు ఎత్తడం లేదు.

**పన్నులు శాశ్వతం కాదు..: నవారో...** మరోవైపు ప్రపంచదేశాలపై అధ్యక్షుడు ట్రంప్ పన్నులు విధించడానికి ఎలాంటి అధికారాలు లేవని అమెరికా ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై నవారో స్పందించారు. ఆ టారిఫ్‌లు శాశ్వతం అని తమ కార్యవర్గం ఎప్పుడూ చెప్పలేదని పేర్కొన్నారు. "మేము ఎప్పుడూ అవి శాశ్వతం అని చెప్పలేదు. కావాలంటే మీరు బెసెంట్, లుట్నిక్, గ్రీర్, అధ్యక్షుడివి, నా ప్రకటనలు చూడండి" అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తమకు అనుకూలంగా వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

**భారత్-చైనా స్నేహ గీతిక...** ట్రంప్ విధించిన సుంకాలు చాలావరకు చట్ట విరుద్ధమని అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తీర్పు ఇచ్చింది. అధ్యక్షుడు ట్రంప్ తన ఆర్థిక అధికారాలను అతిక్రమించి అధికంగా టారిఫ్‌లను పెంచినట్లు పేర్కొంది. 7-4 తేడాతో అప్పీళ్ల కోర్టు న్యాయమూర్తులు ఈ తీర్పు వెలువరించారు. భారీగా విధించిన సుంకాలు పలు దేశాలను ప్రభావితం చేశాయని కోర్టు ఈ సందర్భంగా పేర్కొంది. ప్రస్తుతానికి పెంచిన టారిఫ్‌లను అక్టోబర్ నెల మధ్య నాటికి కొనసాగించడానికి న్యాయమూర్తులు అనుమతి ఇచ్చారు. దీంతో ఈ నిర్ణయాన్ని యూఎస్ సుప్రీంకోర్టులో సవాలు చేసేందుకు కోర్టు అనుమతించింది. కోర్టు తీర్పుపై ట్రంప్ సుప్రీంకోర్టులో పోరాడనున్నారు.

# మసీదులో వినాయకుడు.. ఇదిరా భారత్ అంటే?



భిన్నత్వంలో ఏకత్వం. మతం అన్నది నమ్మకం. మానవత్వానికి నిలువెత్తు రూపంగా ఉండాలే తప్పించి.. ఆ పేరుతో విభేదాల్ని క్రియేట్ చేసుకోవద్దు. ఒకరి సంప్రదాయాన్ని మరొకరు గౌరవించుకోవటం.. అందరు కలిసి మెలిసి పండగల్ని చేసుకోవటంలో ఉండే సంతోషం.. మరెందులోనూ ఉండదు. ఒకరి పండుగ వేళను మరో వర్గం వారు సాదరంగా ఆహ్వానించటం.. తాము భాగస్వామ్యం కావటానికి మించిన మానవత్వం ఇంకేం ఉంటుంది. కథ లాంటి ఒక ఉదంతం మహారాష్ట్రలోని ఒక గ్రామంలో గడిచిన కొన్నేళ్లుగా నడుస్తోంది. వీరి ఉదంతం విన్నతర్వాత అసలుసిసలు మతసామరస్యానికి ఇంతకు మించిన నిదర్శనం ఇంకేం ఉంటుందన్న భావన కలుగక మానదు. అంతేకాదు.. ఇది కదా భారత్ అంటే అన్న భావన మనసును కమ్మేస్తుంది. ఇంతకూ విషయం ఏమంటే.. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపానికి వేదికగా మారిందో మసీదు. అవును.. మీరు చదివింది నిజమే. ఇంతకూ ఇదెక్కడ? అదెలా సాధ్యం? మిగిలిన వారికి భిన్నంగా ఆ గ్రామంలో ఉన్న పరిస్థితులు ఏమిటి? అన్న విషయంలోకి వెళితే.. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా గోటి?ండీ గ్రామంలోని స్థానికులు ప్రతి ఏడాది గణేశుడి విగ్రహానని మసీదులో ప్రతిష్ఠించి పూజలు చేయటం కనిపిస్తుంది. ఇలా ఎలా? అన్న ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే 45 సంవత్సరాలు వెనక్కి వెళ్లాల్సి ఉంటుంది. అప్పట్లో భారీ వర్షం కారణంగా ఒక గణపతి విగ్రహం తడిచి పోతుంటే.. దాన్ని స్థానిక ముస్లింల చొరవతో మసీదులోకి మార్చారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది మసీదులోనే వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి గణేశ్ ఉత్సవాల్ని నిర్వహిస్తున్నారు. ఆసక్తికరంగా గణేశ్ నవరాత్రుల్ని హిందూ.. ముస్లింలు ఉమ్మడిగా పాల్గొంటూ ఈ ఊరి స్పెషల్. వీరి ఐక్యమత్యానికి కాలపరీక్ష కూడా ఎదురైంది. అదేమంటే.. ఒకసారి వినాయకచవితి.. బక్రీదు ఒకేసారి వచ్చింది. ఈ సందర్భంగా ఇరు వర్గాలు చర్చించుకొని.. ఊహించని రీతిలో పరిష్కారానికి కనుగొన్నారు. ఇందుకు ముస్లింలు చొరవ తీసుకోవటం విశేషం. వినాయకచవితి.. బక్రీదు ఒకేరోజు వచ్చిన రోజు.. ముస్లింలు నమాజ్ మాత్రమే చేసి.. కుర్బానీకి దూరంగా ఉండటం గమనార్హం. ఇలా వినాయక చవితిని మసీదులో ఘనంగా నిర్వహించుకోవటం అరుదైన అంశమే కాదు.. మతసామరస్యానికి ఇదో స్ఫూర్తిగా చెప్పక తప్పదు.

## కాళేశ్వరంలో అవినీతి అని కవిత డిక్లేర్ చేసేశారా ?

గులాబీ పార్టీలో ముళ్ళున్నాయి. అవి ఇంతవరకూ బయట వారికే గుచ్చుకునేవి. ఇపుడు సొంత వారినే గిచ్చి గిచ్చి పొడుస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ముద్దుల తనయ, ఎమ్మెల్సీ అయిన కవిత గులాబీ పార్టీని ముల్లు మాదిరిగా తూట్లు పొడుస్తునారు ఈ నేపధ్యంలో ఆమె తన తండ్రి తన దైవం అని పదే పదే చెప్పుకునే కేసీఆర్ నే ఇరకాటంలోనూ ఇబ్బందిలోనూ నెడుతున్నారు అని అంటున్నారు. కాళేశ్వరంలో అవినీతి జరగలేదు అన్నది బీఆర్ఎస్ గట్టి వాదన. అది ప్రజల కోసం కట్టిన ప్రాజెక్ట్ అని కేసీఆర్ మానస పుత్రికగా తెలంగాణాను సస్య శ్యామలం చేసేందుకు పుట్టినది అన్నది వారి బలమైన భావన.

**అవినీతి మరకలు అంటూ :** అయితే కవిత మాట్లాడుతున్నది చూస్తూంటే తన తండ్రికి అవినీతి మరకలు అంటించారు అని అంటున్నారు. అది హరీష్ రావు సంతోష్ అని పక్కన ఉండే పార్టీ కీలక నేతల పేర్లు చెబుతున్నారు. తన తండ్రికి డబ్బు కానీ మరోటీ కానీ అవసరం లేదని కానీ వారే అవినీతి పనులు చేస్తూ తన తండ్రిని బదనాం చేస్తున్నారు అని ఆమె ఆరోపిస్తున్నారు ఈ విధంగా ఆమె చెప్పడం ద్వారా ఒక్క విషయం అయితే తేటతెల్లం చేస్తున్నారు అని అంటున్నారు కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగింది అని చెప్పకనే చెబుతున్నారు అని అంటున్నారు.

**కాంగ్రెస్ వాదన అదే కదా :** కవితకు అయితే కేసీఆర్ తన తండ్రి అని ఆయనకు ఏమీ తెలియదు అని మినహాయింపులు ఉన్నాయి




కానీ కాంగ్రెస్ పార్టీ మొత్తం అందరూ కలిసే అవినీతి చేశారు భారీ ప్రాజెక్ట్ రూపంలో అతి పెద్ద గుదిబండను తెలంగాణాకు తగిలించారు అని అంటున్నారు అచ్చం కాంగ్రెస్ వాదననే కవిత తన నోటి వెంట వినిపిస్తున్నారా అన్నది కూడా చర్చగా సాగుతోంది. అయితే ఆమె కేసీఆర్ ని ఆకాశానికి ఎత్తేస్తూ అదే సమయంలో బీఆర్ఎస్ లో తనకు పడని వారిని ఈ విధంగా టార్గెట్ చేస్తున్నారు అని అంటున్నారు. ఆమె ఈ రకమైన కామెంట్స్ చేయడం వల్ల బీఆర్ఎస్ కి రెండిందాలుగా ఇబ్బందిగా ఉందని అంటున్నారు.

**పార్టీ పరంగానే కాదు :** బీఆర్ఎస్ అంతా ఒక్కటి అన్న భావన జనంలో ఉంటూ ఉండేది. కానీ అది నిజం కాదని అన్ని పార్టీల లాగానే అక్కడ కూడా విభేదాలు ఉన్నాయని అధికారం కోసం పదవుల కోసం కుమ్ములాటలు ఉన్నాయని అది కూడా కేసీఆర్ ఉండగానే ఇలా జరుగుతోందని కూడా అంతా అనుకునే నేపధ్యం ఉంది. ఇది పార్టీ పరంగా చూస్తే ఇమేజ్ ని డ్యామేజ్ చేసినట్లే అని అంటున్నారు. మరో వైపు బీఆర్ఎస్ కి ఇపుడు ఊపిరాడనీయని భారీ ప్రాజెక్ట్ కాళేశ్వరం అన్నది ఉంది అవినీతి అన్నదే జరగలేదు అని బీఆర్ఎస్ బల్ల గుద్ది చెబుతూంటే కేసీఆర్ సొంత బిడ్డ మాత్రం అవినీతి జరిగింది తన తండ్రి పాత్ర లేదు వారే కారకులు అని కొన్ని పేర్లు చెబుతున్నారని ఫలితంగా బీఆర్ఎస్ మరింతగా బదనాం అవుతోంది అని అంటున్నారు. దీంతో బీఆర్ ఎస్ లో కవిత విమర్శలు అతి పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. అదే సమయంలో అధికార కాంగ్రెస్ కి మాత్రం ఈ పరిణామాలు ఖుషీగా ఉన్నాయని అంటున్నారు. మొత్తానికి గులాబీ ముళ్ళను విప్పుకోవడం కానీ బీఆర్ఎస్ కారుకి పడిన పంచర్లను రిపేరు చేసుకోవడం కానీ ఆ పార్టీకి పెద్ద పనే అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## నమ్మలేరు కానీ నిజం.. చలామణిలో రూ.6వేల కోట్ల రూ.2వేల నోట్లు?

పెద్ద నోట్ల రద్దు తర్వాత చలామణిలోకి వచ్చిన రూ. 2వేల నోట్ల గురించి తెలిసిందే. ఇలా వచ్చి అలా మాయమైన నోట్లలో రూ. 2వేల నోటుది ఒక ప్రత్యేకత. రెండేళ్ల క్రితం ఈ నోటు చలామణిని నిలిపేస్తూ రిజర్వు బ్యాంక్ నిర్ణయం తీసుకోవటం.. ప్రజలు తమ వద్ద ఉన్న రూ. 2వేల నోట్లను బ్యాంకుల్లో జమ చేయటం తెలిసిందే. అయితే.. ఇప్పటికి రూ. 2వేల నోట్లు రిజర్వు బ్యాంక్ కు తిరిగి రావాల్సిన మొత్తం భారీగా ఉందన్న విషయం వెలుగు చూసింది. ఆర్బీఐ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం 2023 మే 19న ఈ పెద్ద నోట్లను వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడే వేళకు మార్కెట్ లో రూ. 3.56 లక్షల కోట్ల విలువ చేసే రూ. 2వేల



నోట్లు మార్కెట్ లో ఉన్నాయి. అయితే.. ఈ ఏడాది (2025) ఆగస్టు 31 నాటికి చలామణిలో రూ. 5956 కోట్ల నోట్లు వెనక్కి రావాల్సి ఉంది. రూ. 2 వేల నోట్లను వెనక్కి తీసుకునే వేళ.. మార్కెట్ లో ఉండే మొత్తంతో పోలిస్తే దాదాపు ఒకటిన్నర శాతం నోట్లు మార్కెట్ లోనే ఉండటం ఆసక్తికరంగా మారింది. ఈ నోట్లకు మార్కెట్ లో ఎలాంటి విలువ లేకున్నప్పటికి.. రిజర్వు బ్యాంక్ కు వెనక్కి రాకపోవటం ఏమిటన్నది ఇప్పుడు ఆసక్తికర అంశంగామారింది. అయితే.. రూ. 2 వేల నోట్లను రద్దు చేయలేదు అని అవి అధికారికంగా చెల్లుబాటు అయ్యే పరిస్థితి లేదు. ఎవరి వద్ద అయినా రూ. 2వేల నోట్లు ఉంటే ఒక పద్ధతి ప్రకారం బ్యాంకుల్లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

లేదంటే.. ఇండియా పోస్టు ద్వారా హైదరాబాద్.. బెంగళూరు..చెన్నైలో ఉండే ఆర్ బీఐ ఇష్యూ ఆఫీసులకు పంపి.. వాటిని మార్చుకునే వెసులుబాటు ఉంది. ఏమైనా పెద్ద నోట్లను వెనక్కి తీసుకున్న తర్వాత కూడా ఇంత భారీగా మార్కెట్లో ఉండటం ఆసక్తికర అంశంగా చెప్పకతప్పదు.

చురకలు

## సంపాదకీయం

# రాహుల్ ర్యాగింగ్... బీజేపీకి మోతెక్కేలా !

కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అయిన రాహుల్ గాంధీ బీజేపీని టార్గెట్ గా చేసుకుని బీహార్ లో ఓటర్ అధికార యాత్రను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జరిగిన ఒక ర్యాలీలో ఆయన కేంద్ర ప్రభుత్వం మీద బీజేపీ మీద తీవ్ర వ్యాఖ్యలు చేసారు. తన చేతిలో హైడ్రోజన్ బాంబు ఉందని దానిని త్వరలో వేస్తాను అని భారీ వార్నింగ్ ఇచ్చేశారు. ఆ బాంబుతో ప్రకంపనలు పుడతాయని ఆయన అంటున్నారు

**ఓటు చోరీ అంటూ రెట్టిస్తున్నా :** రాహుల్ గాంధీకి ఏమీ తెలియదు పప్పు అని బీజేపీ వారు అంతా ఒక అభిప్రాయం పక్కాగా స్థిరపరచుకున్నారు. అయితే అది తప్పు తాను పప్పుని కాదు అని రాహుల్ చాలా కాలం క్రితమే రుజువు చేసుకున్నారు ఆయన నిప్పు కణికగా మారిపోతారని ఎవరూ అనుకోలేదు. కానీ ఆయన నిప్పులే రాలుస్తున్నారు ఓటు చోరీ అంటూ రాహుల్ వాడుతున్న పదాలు కానీ ఆయన చేస్తున్న ర్యాగింగ్ కానీ అసలు ఏ మాత్రం తట్టుకో లేకపోయేలా కాషాయం పెద్దలకు ఉందని అంటున్నారు వారి చేతనే కషాయం తాగించేస్తున్నారు అని కూడా సెటైర్లు పడుతున్నాయి.

**హైడ్రోజన్ బాంబు వేస్తా :** ఇదిలా ఉంటే బీహార్ ర్యాలీలో రాహుల్ స్ట్రాంగ్ బీజేపీకి బిగ్ వార్నింగ్ ఇచ్చారు. ఓటు చోరీ దేశవ్యాప్తంగా జరిగింది అని రాహుల్ గాంధీ రెట్టిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఎన్నో విధాలుగా సాయపడుతోందని ఈ క్రమంలో సామాన్యులు బడుగుల ఓట్లు చోరీ అవుతున్నాయని ఆయన అంటున్నారు. ఆగస్టు నెల 17 నుంచి ఆయన ఓటర్ అధికార యాత్ర చేస్తూ ప్రతీ చోటా ఇదే విషయం చెబుతున్నారు. ఈ ర్యాలీలో అయితే ముందుంది చాలా అంటున్నారు. అదేంటి అంటే హైడ్రోజన్ బాంబు వేస్తాను అని హెచ్చరిస్తున్నారు.

**లోక్ సభ ఎన్నికల గురించేనా :** ఇక లోక్ సభ ఎన్నికలలోనూ పెద్ద ఎత్తున ఓట్ల తారు మారు జరిగింది అని రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. వాటి వివరాలు అన్నీ కూడా పక్కాగా తన దగ్గర ఉన్నాయని అవి అణు బాంబు కంటే పవర్ ఫుల్ అని కూడా చెబుతున్నారు. చాలా తొందరలోనే వాటిని బయటపెడతాను అని అంటున్నారు. అంటే ఆగస్ట్ 7న ఆయన వేసిన తొలి బాంబు ఎఫెక్ట్ బీహార్ అంతా ర్యాలీగా మారి ఒక ఊపు ఊపేసింది. ఇపుడు ఏకంగా హైడ్రోజన్ బాంబు అని అంటున్నారు. ఇది ఏ రకమైన రాజకీయ దుమారం రేపుతుందో అన్న చర్చ అయితే ఉంది అని అంటున్నారు.

**బీజేపీ రెడీనా :** అణు బాంబు కంటే పెద్ద బాంబు తాను వేయబోతున్నాను బీజేపీ రెడీనా అని రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నారు. దేశమంతా ప్రస్తుతం ఓటు చోరీ గురించే మాట్లాడుతోందని కూడా ఆయన చెబుతున్నారు. ఒక్క బీహార్ రాష్ట్రంలోనే 65 లక్షల మంది ఓటర్లను అక్రమంగా తొలగించారంటూ రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. ఒక పద్ధతి ప్రకారం రాజ్యాంగాన్ని హత్య చేసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఉన్నాయని అయితే కాంగ్రెస్ వాటిని సాగనివ్వదని ఆయన స్పష్టం చేశారు. ఓటు చోరీని బయటపెట్టేందుకే ఓటర్ అధికార్ యాత్రను చేపట్టినట్లుగా ఆయన చెబుతున్నారు.

**రాహుల్ మీద బీజేపీ ఫైర్ :** ఏమిటీ అణు బాంబులు హైడ్రోజన్ బాంబుల బెదిరింపులు అంటూ బీజేపీ నేత కేంద్ర మాజీ న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ రాహుల్ ని నిలదీస్తున్నారు బాధ్యతారాహిత్యానికి రాహుల్ వ్యవహారశైలి అద్దం పడుతోంది అన్నారు. ఆయన పార్లమెంట్ లో మాట్లాడినా లేక బయట మాట్లాడినా ఏమి చెప్పాలనుకుంటున్నారో ఎవరికీ అసలు అర్ధం కాదని ఎద్దేవా చేశారు. దేశంలోని ఓటర్లను అవమానిస్తూ తనను తాను కించ పరచుకుంటూ రాహుల్ ఓటర్ అధికార ర్యాలీలు చేస్తున్నారని మండిపడ్డారు బీహార్ ర్యాలీకి యూపీ నుంచి జనాలను తరలిస్తున్నారని ఆయన విమర్శించారు. ఇవన్నీ పక్కన పెడితే ఓటు చోరీ అని రాహుల్ చేస్తున్న ర్యాగింగ్ మాత్రం చాలా ఇబ్బందికరంగానే అధికార పార్టీ పెద్దలకు ఉందని అంటున్నారు.

# భక్తి ముక్తి ప్రదాయిని పరివర్తిని ఏకాదశి



పరివర్తిని ఏకాదశి హిందూ సంప్రదాయంలో వైష్ణవ భక్తులకు అత్యంత ప్రాధాన్యం కలిగిన పవిత్ర పర్వ దినంగా పరిగణించ బడుతుంది. భాద్రపద శుక్ల ఏకాదశి రోజున జరుగు ఈ వ్రతం "పార్శ్వపర్వ ఏకాదశి"గాను ప్రసిద్ధి చెందింది. ఈ రోజున శ్రీమహా విష్ణువు తన యోగనిద్రలో ఒక వైపు నుండి మరో వైపుకు పరివర్తనం చేస్తాడనే పురాణ ప్రస్తావనలున్నాయి. ఆ పరివర్తన క్షణాన్ని స్మరించుకొని భక్తులు ఉపవాసం, జపం, ధ్యానం, జాగరణతో ఈ ఏకాదశిని ఆచరిస్తారు. ఏకాదశి వ్రతాల్లోనూ దీనికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. పద్మ పురాణం, స్కంద పురాణం, భవిష్య పురాణం వంటి గ్రంథాల్లో పరివర్తిని ఏకాదశి ప్రాముఖ్యతను వివరంగా వర్ణించారు. ఈ వ్రతం ఆచరించిన వారికి పాపాలు నశించి, విష్ణులో లీనమయ్యే అవకాశం లభిస్తుందని, పితృదేవతలు సంతృప్తి చెందుతారని పురాణోక్తి. శ్రద్ధతో ఉపవాసం చేసి రాత్రంతా భజనలు, కీర్తనలు చేస్తూ జాగరణలో గడపడం వల్ల ఆధ్యాత్మిక శాంతి, చిత్తశుద్ధి, మోక్ష సిద్ధి లభిస్తుందని విశ్వాసం ఉంది. ద్వాదశి రోజున అన్నదానం, దానధర్మాలు చేయడం ద్వారా వ్రత పరిపూర్ణత సాధించవచ్చని శాస్త్రోక్తి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ రోజున ఘనంగా పార్శ్వ పర్వ మహోత్సవం నిర్వహిస్తారు. శ్రీనివాసుని ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారు పరివర్తనం చేయబడినట్లు సంకేతాత్మకంగా ఆరాధన జరుగుతుంది. వేలాదిమంది భక్తులు పాల్గొని దివ్యదర్శనం పొందుతారు. ఇదే విధంగా శ్రీరంగం, పాండురంగ క్షేత్రం, వంటి వైష్ణవ పవిత్ర క్షేత్రాల్లోనూ ప్రత్యేక వేడుకలు జరుగుతాయి. చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించే యతులు ఈ రోజున పరివర్తనం చేసుకోవడం ప్రారంభించడం కూడా ధార్మిక సంప్రదాయంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా భావిస్తారు. పరివర్తిని ఏకాదశి వ్రతాన్ని ఉపవాసంతో పాటించే వారు ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, ఆధ్యాత్మిక వికాసాన్ని పొందుతారని నమ్మకం. భక్తి, భయం, శ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరించిన వారు జనన మరణ చక్రం నుండి విముక్తి పొంది, విష్ణు లోకంలో స్థానం పొందుతారని పురాణ గాథలు చెబుతున్నాయి. అందువల్ల ఈ ఏకాదశి కేవలం ఒక ఉపవాస పర్వదినం కాక, భక్తిని మరింత లోతుగా పెంపొందించే ఆధ్యాత్మిక సాధన దినంగా పరిగణించ బడుతుంది. పరివర్తిని ఏకాదశి విశిష్టతను గ్రహించిన ప్రతి భక్తుడు దీనిని శ్రద్ధ భక్తులతో ఆచరించడానికి ప్రయత్నిస్తారు. పాప క్షయాన్ని కలిగించి, పుణ్య సంపత్తిని ప్రసాదించే ఈ పవిత్ర వ్రతం మానవ జీవితాన్ని ధర్మ మార్గంలో నడిపించే మహత్తర పర్వదినంగా నిలుస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పాత్రికేయ కురువృద్ధులు నందూరి - సెప్టెంబర్ 3...నందూరి రామమోహనరావు వర్ధంతి



తెలుగు పత్రికలతో పరిచయం ఉన్న వారికి నందూరి రామమోహనరావు పేరు సుపరిచితమే. అయన సమాజం పట్ల నిబద్ధత కలిగిన సంపాదకులు. ఆయన ఎంతో మందికి గురు తుల్యులు, మార్గ నిర్దేశకులు. మరెంతో మందిని పాత్రికేయులుగా తీర్చి దిద్దిన గురువులు. పాత్రికేయునిగానే కాక, రచయితగా కూడా ప్రఖ్యాతి గాంచారు. పత్రికారంగంలో అంతటి సంగీత సాహిత్య కళా మర్మాలెరిగిన వ్యక్తి చాలా అరుదు. నందూరి రామమోహనరావు (ఏప్రిల్ 24, 1927- సెప్టెంబర్ 3, 2011) తెలుగు పాత్రికేయరంగ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మేధావి. చాలాకాలం ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదక బాధ్యతలు నిర్వహించారు. "బాల" అనే పత్రికలో, ఆంధ్రపత్రిక లోనూ 1940 వ దశకంలో అయన రచనలు ఎన్నో ప్రచురింప బడ్డాయి. "నరావతారం", "విశ్వరూపం" ఆయన ప్రముఖ రచనలు. సామాన్య జనాలకు సైన్సు విషయాలను పరిచయం చేయడంలో నందూరి కృషి మరవ లేనిది. అయన ఆంధ్రపత్రికలో మార్క్ ట్వేయిన్ నవలలకు తెలుగు అనువాదాలు కూడా చేసారు. దశాబ్దాల క్రితం నందూరి ఆంధ్రవార పత్రికలో పిల్లల కోసం రాబర్ట్ లూయీ స్టీవెన్సన్ కాంచన ద్వీపం, మార్క్ ట్వేన్ టామ్ సాయర్, హకల్ బెరీ ఫిన్, రాజూ పేద, విచిత్ర వ్యక్తి అనువాద రచనలు ఆకట్టు కునేవి. అనువాదం కూడా మరో భాష నుంచి అనువాదాన్ని చేసినట్లు కాకుండా తెలుగులో అచ్చు స్వీయ రచనలానే వుండేది. ఆంధ్రపత్రిక ద్వారా ఆయన జర్నలిస్టు జీవితం ప్రారంభించి, 1948 నుంచి 1960 వరకు ఆయన ఆంధ్ర పత్రికలో పనిచేశారు. 1960లో సహ సంపాదకులుగా 'ఆంధ్రజ్యోతి'లో కాలూనారు. 1960 నుంచి 1994 దాకా%ౌ%దాదాపు మూడున్నర దశాబ్దలు ఆయన 'ఆంధ్రజ్యోతి'లో రచనా జైత్ర యాత్ర కొనసాగించారు. ఆయన సంపాదకీయ రచనా వైశిష్ట్యం పాఠకులపై చాలా ప్రభావం చూపేది. తొలినాళ్లలో సంపాదకులు నార్ల వెంకటేశ్వర రావుతో కలసి పని చేశారు. నార్ల తర్వాత 1980 లో నందూరి 'ఆంధ్రజ్యోతి' సంపాదకులుగా పూర్తిస్థాయి బాధ్యతలు భుజ స్కందాలపై వేసు కున్నారు. ఆయన 1962, 1978, 1984, 1992 లలో అమెరికాలో, 1982లో రష్యా లోను పర్యటించారు. ఆరు దశాబ్దాల కాలం గడిచినా, నందూరి నాటి పుస్తకాలకు ఆదరణ తగ్గక పోవడం విశేషం. నందూరి ఖగోళ, భౌతిక శాస్త్రాలను పరిశోధించి 'విశ్వరూపం' అనే పుస్తకం రచించారు. మానవాళి పరిణామ క్రమానికి సంబంధించిన నరావతారం, తత్త్వశాస్త్రాన్ని సులువుగా వివరించే 'విశ్వ దర్శనం' ఆయన కలం నుంచి జాలువారినవే. నందూరి.. సవ్యసాచి పేరుతో రాజకీయ వ్యంగ్య రచనలు, హరివిల్లు పేరుతో బాల గేయాలు, ఉషస్విని పేరిట కవితలు రచించారు. మిత్రలాభం, మిత్ర భేదం (పంచతంత్ర కథలు) పేరిట బాపు వేసిన బొమ్మలకు నందూరి మాటలను అందించారు. ఇంద్రగంటి శ్రీకాంత శర్మతో కలిసి 'మహా సంకల్పం' అనే సంకలనాన్ని వెలువరించారు. సంపాదకీయాల సంకలనం అను పల్లవి, చిరంజీవులు, వ్యాఖ్యావళి తదితరాలు ఆయన కలం నుండి జాలువారిన రచనలే. నందూరి రాసిన ఐదు పుస్తకాలను న్యూస్టూడెంట్ బుక్ సెంటర్ ఆధినేత బాబ్జీ ప్రచురించి 2006 మే 9వ తేదీన ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించి, ఆయనను సత్కరించారు. ఆంధ్రపత్రికలో పని చేసే రోజుల్లో కొడవటిగంటి కుటుంబరావు, పండితారాధ్యుల నాగేశ్వరరావు, తెన్నేటి సూరి, పిలకా గణపతిశాస్త్రి వంటి దిగ్గజాలతో సాహిత్యంపై చర్చించేవారు. అలాగే ఆరుద్ర, శ్రీశ్రీ లతోపాటు 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు రామచంద్రమూర్తి, తదితరులతో నందూరికి సంబంధం, అనుబంధం ఉండేది. నరావతారం, విశ్వరూపం, విశ్వదర్శనం - భారతీయ చింతన విశ్వదర్శనం - పాశ్చాత్య చింతన అనుపల్లవి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం) చిరంజీవులు (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం), వ్యాసావళి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం) అక్షరయాత్ర (సాహిత్య, సాహిత్యేతర వ్యాస సప్తతి), ఉషస్విని (కవితా సంపుటి) చిలక చెప్పిన రహస్యం (పిల్లల నవల), మయూర కన్య (పిల్లల నవల), హరివిల్లు (పిల్లల గేయాలు) వంటి రచనలు చేసారు. అభినందన (హైదరాబాదు) సంస్థ నుంచి ముట్నూరి కృష్ణారావు అవార్డు (1988), జూలూరి నాగ రాజారావు (హైదరాబాదు) స్మారక అవార్డు (1989), మద్రాసు తెలుగు అకాడెమీ "ఉగాది వెలుగు" అవార్డు (1989), కళాసాగర్ (మద్రాసు) అవార్డు, అభిరుచి (ఒంగోలు) సంస్థ వారి "పాత్రికేయ రత్న" అవార్డు, ."జమీన్ రైతు" వజ్రోత్సవంలో నెల్లూరి వెంకట్రామా నాయుడు స్మారక అవార్డు (1990), ఆలూరి నారాయణరావు స్మారక ట్రస్టు (విజయవాడ) వారి సి.వై.చింతామణి అవార్డు, తెలుగు యూనివర్సిటీ వారి ఆనరరీ డాక్టరేట్ (1991), అమెరికన్ తెలుగు అసోసియేషన్ వారి "శిరోమణి" అవార్డు (1992), క్రాంతి విద్యా సంస్థల (విజయ వాడ) నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1994), రామకృష్ణ జైదయాళ్ హార్మొనీ అవార్డు (1994), సిద్ధార్థ కళా పీఠం (విజయవాడ) వారి విశిష్ట వ్యక్తి అవార్డు (1994), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1996), తెలుగు యూనివర్సిటీ వారి తాపీ ధర్మారావు స్మారక అవార్డు (1997), అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి ప్రతిభామూర్తి అవార్డు (1998), తదితర అవార్డులు అందుకున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోసిన జమలాపురం కేశవరావు - సెప్టెంబర్ 3...తెలంగాణ సర్దార్ జయంతి




నిజాం నిరంకుశ పాలనలో బానిసలుగా బతుకుతున్న వారి స్వేచ్ఛకోసం, తమ జీవితాన్ని త్యజించిన వారిలో 'సర్దార్ జమలాపురం కేశవరావు' ముందు వరుసలో నిలుస్తారు..

కట్టెదుట జరుగుతున్న అన్యాయాలకు చూస్తూ, సహిస్తూ ఉండలేక ప్రజల్లో ధైర్య సాహసాలను నూరి పోయడమే ఏకైక లక్ష్యంగా జీవితాంతం మందుకు సాగారు. హైదరాబాద్ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీకి జీవంపోసి, ప్రజా శ్రేయస్సు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిబద్ధత కలిగిన నేత, త్యాగశీలి సర్దార్ జమలాపురం కేశవరావు. సత్యాగ్రహిగా, క్విట్ ఇండియా ఉద్యమ కార్యకర్తగా, ఆంధ్ర మహాసభ నిర్వాహకుడిగా, గ్రంథాలయోద్యమ నిర్మాతగా, ఆదివాసీ, దళిత జనోద్ధారకుడిగా, పత్రిక స్థాపకుడిగా ఇలా కొన్ని ఎన్నో కార్యకలాపాలు చేపట్టి హైదరాబాద్ రాజ్య ప్రజల్లో చైతన్యాన్ని, ధైర్యాన్ని నింపిన మహోన్నతుడు కేశవరావు. అందుకే ఆయన్ను అందరూ తెలంగాణ 'సర్దార్'గా పిలుచు కుంటారు. తెలంగాణ కేసరిగా, 'దక్కన్ సర్దార్'గా బిరుదు లందుకున్న జమలాపురం కేశవరావు తనదైన శైలిలో ఉద్యమాలు నడిపి కాంగ్రెస్‌కు, తెలుగు వారి ముఖ్యంగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోశారు. దక్కన్ సర్దార్‌గా, ఉక్కు మనిషిగా ప్రజలు పిలుచుకునే కేశవరావు నిజాం సంస్థానంలో తూర్పు భాగాన ఉన్న ఖమ్మం (నాటి వరంగల్ జిల్లా)లోని ఎర్రుపాలెంలో 1908, సెప్టెంబర్ 3 న జమలాపురం వెంకట రామారావు, వెంకట నరసమ్మలకు తొలి సంతానంగా జన్మించారు. సంపన్న జమీందారీ వంశంలో పుట్టినా, నాటి దేశ రాజకీయాలు అతనిని తీవ్రంగా కలవర పరచాయి. ఎర్రుపాలెంలో ప్రాథమిక విద్య అనంతరం, హైదరా బాదులోని నిజాం కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. వందేమాతరం గీతాలాపనను నిషేధించి నందుకు నిరసనగా, కళాశాల విద్యార్థులను కూడగట్టి, నిరసనోద్యమంలో కాలూనారు. గీతాన్ని ఆలాపించ నివ్వకపోతే తరగతులకు హాజరు కాబోమని హెచ్చరించారు. దీంతో చివరకు నిజాం పాలకవర్గం నిషేధాన్ని ఎత్తివేయక తప్పలేదు. ఈఘటన తర్వాత కేశవరావు ఆలోచనా పరిధి మరింత విస్తృతం అయింది. నిజాం పాలనలో కొనసాగుతున్న వెట్టి చాకిరితో అష్టకష్టాలకు గురవుతున్న ప్రజలను చూసిన కేశవరావు చలించి పోయారు. ప్రజలను విముక్తం చేయడానికి తెలంగాణ జిల్లాల్లో...ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కేశవరావు కాలినడకన విస్తృతంగా పర్యటించారు. ఆ క్రమంలోనే భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల, గాంధీ సిద్ధాంతాల పట్ల కేశవరావు ఆకర్షితుడయ్యారు. 1923లో రాజమండ్రిలో మొదటిసారి మహాత్మా గాంధీ ఉపన్యాసాన్ని విన్న కేశవరావు, 1930లో విజయవాడలో జరిగిన సభలో గాంధీ పరిచయంతో మరింత ఉత్తేజితుడైనారు. ఆంధ్రపితామహుడుగా మాడపాటి హనుమంతరావు ప్రారంభించిన గ్రంథాలయ ఉద్యమంను తెలంగాణలోని ప్రతి పల్లెలోనూ ప్రచారం గావించారు. వయోజన విద్యకై రాత్రి పాఠశాలలు నడపడంలో కేశవరావు కృషి చేశారు. అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని నింపడానికి ప్రత్యేక శ్రద్ధను కనపరిచేవారు. 1938లో దీపావళి సందర్భంగా ఆవిర్భవించిన 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' స్థాపనలో కేశవరావు కీలకపాత్ర వహించి, దానికి మొదటి అధ్యక్షుడయ్యారు. 1938 సెప్టెంబర్ 24 మధ్యాహ్నం మధిరలో గోవిందరావు నానక్, జనార్దనరావు దేశాయ్, రావి నారాయణరెడ్డిలతో కలిసి సత్యాగ్రహ దీక్షకు కేశవరావు సిద్ధమయ్యాడు. ఎట్టి పరిస్థితుల్లో సర్దార్‌ను దీక్ష చేయనివ్వొద్దని నిజాం ప్రభుత్వం అనుమతి నివ్వలేదు. మధిరలో అడుగడుగునా పోలీసులను మోహరించింది. అయినా భారీ సంఖ్యలో ప్రజలు దీక్ష వేదిక దగ్గరకు చేరుకున్నారు. అప్పుడే ఎవరూ ఊహించని విధంగా రైతు వేషంలో దీక్ష వేదిక దగ్గరకు వచ్చాడు కేశవరావు. వెంటనే మహాత్మా గాంధీకి జై, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ జై అని దిక్కులు పెక్కటిల్లేలా నినాదించారు. అరెస్టు చేసి నిషేధాన్ని ఉల్లఘించి సత్యగ్రహ దీక్ష చేశారంటూ కేశవరావుకు 18 నెలలు జైలు శిక్ష విధించారు. వరంగల్ జైలులో ఎనిమిది నెలల శిక్షను అనుభవించిన తర్వాత కేశవరావుతో సహా రాజకీయ ఖైదీలందరినీ నిజామాబాద్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా అదే పోరాట పంథాను కేశవరావు కొనసాగించారు. అంటరానితనం నిర్మూలించేందుకు, ఆదివాసీల అభివృద్ధికి కూడా ఉద్యమం చేశారు. 1942లో కాంగ్రెస్ పిలుపు మేరకు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని తెలంగాణలో ఊరూరా ప్రచారం చేసే బాధ్యత వహించారు. 1946లో మెదక్ జిల్లా కందిలో కేశవరావు అధ్యక్షతన జరిగిన 13వ ఆంధ్ర మహాసభ సందర్భంగా నిర్వహించిన బ్రహ్మాండమైన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. 1947 ఆగస్టు 7న మధిరలో స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన సత్యాగ్రహం మరువలేనిది. దానికి బాధ్యుడైన కేశవరావుకు ప్రభుత్వం రెండు సంవత్సరాలు కారాగార శిక్ష విధించింది. యావత్ భారత దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చు కోవడానికి ఉవ్విళ్లూరుతున్న సందర్భంలో కేశవరావు వంటి నాయకులు నిర్భంధానికి గురికావడం ఒక విషాదం. నిజాం సంస్థానం భారత దేశములో విలీనమైన తరువాత, 1952లో కేశవరావు రాజ్యసభకు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌పై పోలీసు చర్య అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలను తీవ్రంగా నిరసించిన మొట్టమొదటి కాంగ్రెస్ వ్యక్తి కేశవరావు. అప్పటి మిలిటరీ అధికారి నంజప్పను నిలదీసిన నిజమైన ప్రజానాయకుడు సర్దార్. కాంగ్రెస్ పార్టీలో ఉండి జాగీర్దార్లను, జమిందార్లను విమర్శించమంటే ఆనాడు నిజంగా ఒక సాహసమే. నంజప్ప నేతృత్వంలో మిలిటరీ వారు కమ్యూనిస్టుల ఏరివేత పేరిట జరిగిన హింసా కాండను, ముస్లిముల ఊచకోతను కేశవరావు ఖండించారు. ప్రజల పక్షాన నిలిచారు. "మనం ఏ ప్రభుత్వాన్ని అయినా సరే అది రాష్ట్ర, జాతీయ ప్రభుత్వం, కాంగ్రెసు ప్రభుత్వం అయినా, కాంగ్రెసు కాని ప్రభుత్వం అయినా అమాయక ప్రజలపై అత్యాచారాలు జరపడాన్ని సహించబోము. నంజప్ప మన ప్రభుత్వంలో ఒక అధికారి మాత్రమే. యింకా స్పష్టంగా చెప్పాలంటే ఆయన మన ప్రజలకు సేవకుడు. ఆయన యధేచ్ఛగా ప్రవర్తించడానికి, మేము అనుమతించడానికి సిద్ధముగా లేము. ఆయన చేస్తున్న అకృత్యాలు నిజాం తొత్తులైన జాగీర్దార్లను, నాజీ హిట్లరును తలదన్నిన నిజాంను మరిపిస్తున్నది. నంజప్ప తెలంగాణ రక్షకుడిగా కాక, భక్షకుడిగా వచ్చినట్లు అనిపిస్తున్నది." అని డోర్నకల్లులో జరిగిన సభలో కేశవరావు ఎలుగెత్తి చాటారు. సర్దార్ కేశవరావు భాషారాష్ట్ర సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకి. తెలంగాణ అస్తిత్వాన్ని స్థిరీకరించాలని కోరుకున్నారు. కన్నడ, మరాఠీ భాషా ప్రాంతాలతో కలిసి పోయిన హైదరాబాద్ రాష్ట్రం అలాగే ఉండాలని వాంచించారు. అలాగే జమిందారి, జాగిర్దారీ వ్యవస్థలతో అతలాకుతలమైన తెలంగాణను విశాలాంధ్రలో కలిపినట్లయితే ఏమాత్రం మేలు జరగదని నొక్కి చెప్పారు. విద్యాపరంగా, సామాజిక, ఆర్థిక రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయకుండా విశాలాంధ్ర ఏర్పాటు వల్ల స్థానికులపై స్థానికేతరుల అజమాయిషీ ఆరంభ మవుతుందని ముందుగానే ఊహించిన అనుభవశాలి ఆయన. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ సభలు, సమావేశాలు జరిగినపుడు ఒక సామాన్య కార్యకర్త మాదిరిగా పందిళ్ళు వేయడానికి, కర్రలు కూడా నాటి నిరాడంబరతకు, పార్టీ పట్ల అంకితభావంకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచి, అంతలా పార్టీకి సేవ చేసిన ఆయనకు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల మూలంగా రావాల్సినంత పేరు, దొరకాల్సిన గౌరవం రాలేదు. చేపట్టిన ప్రతి ఉద్యమం లోనూ విజయాల్ని సాధించిన ఆయన స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనకు ద్రోహం చేశారు. ఆయన ఎదుగుదలను అడ్డుకున్నారు. ఎన్నికల్లో ఓటమి చెందేలా పరిస్థితులు కల్పించారు. జైలు జీవితం, ఉద్యమ సమయంలో భోజనం లేకపోవడం, పార్టీలోని నాయకులు చేసిన మోసం, కలగలిసి తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అయిన కేశవరావు1953, మార్చి 29న తన 46వ ఏట మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# యాదృచ్ఛిక పరిశీలన నుంచి యాంటీబయాటిక్ యుగం వరకు: పెన్సిలిన్ ఆవిష్కరణ పూర్వాపరాలు - సెప్టెంబర్ 3...అలెగ్జాండర్ ఫ్లెమింగ్ పెన్సిలిన్‌ను కనుగొన్న దినం

1928 సెప్టెంబర్ 3న లండన్‌లోని సెయింట్ మేరీస్ హాస్పిటల్‌లో శాస్త్రవేత్త సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ చేసిన ఒక సాధారణ పరిశీలన వైద్య చరిత్రను శాశ్వతంగా మార్చేసింది. బాక్టీరియాలజిస్ట్‌గా పనిచేస్తున్న ఆయన స్టాఫైలోకాకస్ అనే బాక్టీరియాపై ప్రయోగాలు కొనసాగిస్తుండగా కొన్ని పెట్రీ డిష్‌లు శుభ్రం చేయకుండా వదిలిపెట్టబడ్డాయి. వాటిలో ఒకదానిపై పచ్చటి రంగు శిలీంధ్రం పెరిగి, ఆ శిలీంధ్రం చుట్టూ ఉన్న ప్రాంతంలోని బ్యాక్టీరియా పూర్తిగా నశించి పోయినట్లు ఆయన గమనించాడు. ఆ శిలీంధ్రం పెనిసిలియం నోటాటమ్ అనే జాతికి చెందినదని, దానిలో నుంచి ఏదో పదార్థం వెలువడి బ్యాక్టీరియాను చంపేస్తుందని నిర్ధారించాడు. ఆ పదార్థానికే ఆయన పెన్సిలిన్ అని పేరు పెట్టాడు. మానవ శరీరానికి హాని చేయకుండా ప్రమాదకర బాక్టీరియాలను మాత్రమే నశింపజేసే ఈ రసాయనం శాస్త్ర రంగానికి విప్లవాత్మక ఆవిష్కరణగా నిలిచింది. ఫ్లెమింగ్ తన ఆవిష్కరణను1929లో శాస్త్రీయ పత్రికలో ప్రకటించినప్పటికీ మొదట్లో పెద్దగా ప్రాధాన్యం పొందలేదు. పెన్సిలిన్‌ను శుద్ధి చేసి ఔషధంగా ఉపయోగించగల సాంకేతిక పరిజ్ఞానం ఆ సమయంలో ఆయన వద్ద లేదు. దాదాపు దశాబ్దం తర్వాత ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలోని హొవార్డ్ ఫ్లోరీ, ఎర్నెస్ట్ చైన్, నార్మన్ హీట్‌లీ తదితర శాస్త్రవేత్తలు పెన్సిలిన్‌పై విస్తృత పరిశోధనలు చేపట్టి, శుద్ధ రూపంలో ఉత్పత్తి చేయగలిగారు. 1939%-%40లోనే పెన్సిలిన్‌ను



క్లినికల్ ట్రయల్స్‌లో విజయవంతంగా వినియోగించి, మానవ శరీరంలో వాడదగ్గ స్థాయికి అభివృద్ధి చేశారు. రెండో ప్రపంచ యుద్ధం (1939%-%45) సమయంలో పెన్సిలిన్ ప్రాణ రక్షక ఔషధంగా నిలిచింది. యుద్ధ రంగంలో గాయపడిన సైనికుల చికిత్సకు దీన్ని విస్తృతంగా వినియోగించారు. యుద్ధ సమయంలో పెన్సిలిన్ వినియోగంతో లక్షలాది మంది సైనికుల ప్రాణాలు రక్షించ బడ్డాయి. 1943 నాటికి అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు కలిసి పెద్ద ఎత్తున పెన్సిలిన్ ఉత్పత్తిని ప్రారంభించాయి. 1944 నార్మండీ యుద్ధంలో మిత్ర దేశాల సైన్యానికి పెన్సిలిన్ ప్రధాన ఆయుధంగా పనిచేసింది. యుద్ధానంతరం సాధారణ పౌరులకు కూడా ఈ ఔషధం అందుబాటులోకి వచ్చి ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందింది. పెన్సిలిన్ ఆవిష్కరణకు ముందు చిన్న గాయాలే ప్రాణ హానికరమయ్యే పరిస్థితులు ఉండేవి. న్యుమోనియా, సెప్సిస్, గనేరియా, సిఫిలిస్, చర్మ ఇన్ఫెక్షన్ల వంటి వ్యాధుల కారణంగా మరణాలు అధికంగా జరిగేవి. కానీ పెన్సిలిన్ అందుబాటులోకి రావడంతో అంటువ్యాధుల చికిత్సలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. సర్జరీల తర్వాత వచ్చే ఇన్ఫెక్షన్లను నివారించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషించింది. యాంటీబయోటిక్స్ యుగానికి నాంది పలికిన ఈ ఔషధం ఆధునిక వైద్యానికి మూల స్థంభంగా నిలిచింది. ఈ విప్లవాత్మక ఆవిష్కరణకు గుర్తింపుగా 1945లో సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్, హొవార్డ్ ఫ్లోరీ, ఎర్నెస్ట్ చైన్‌లకు వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రదానం చేయబడింది. పెన్సిలిన్ ఆవిష్కరణతో వైద్యరంగం మాత్రమే కాక మానవ జీవన విధానం కొత్త దశలోకి ప్రవేశించింది. 20వ శతాబ్దపు అత్యంత గొప్ప శాస్త్రీయ ఆవిష్కరణలలో పెన్సిలిన్ ఒకటిగా గుర్తించబడింది. 1928 సెప్టెంబర్ 3న జరిగిన ఆ యాదృచ్ఛిక పరిశీలన మానవాళికి కోట్లాది ప్రాణాలను కాపాడిన ప్రాణ దాయకమైన కానుకగా మారి చరిత్రలో శాశ్వత మైలురాయిగా నిలిచి పోయింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# కబ్జా ఉచ్చులో రూ.20 కోట్ల ప్రభుత్వ స్థలం

కరీంనగర్ : కరీంనగర్‌లో రూ. 20 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నా.. జిల్లా యంత్రాంగం సరైన రీతిలో స్పందించడంలేదు. దివ్యాంగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కేటాయించిన ఈ స్థలం ఆక్రమణకు గురవుతుంటే చూస్తూ వారు ఊరుకోలేక, కనిపించిన ప్రతి అధికారి దగ్గరకు వెళ్లి స్థలాన్ని ప్రభుత్వం కాపాడాలని వేడుకుంటున్నారు. ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం నాడు పలువురు దివ్యాంగుల సంఘ నాయకులు సమస్యను రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అంగుళం స్థలాన్ని సైతం వదిలిపెట్టవద్దని కలెక్టర్, పోలీస్ కమిషనర్లను ఆదేశించారు. ఆ సమయంలో హడావుడి చేసిన అధికార యంత్రాంగం స్థలాన్ని రాబట్టడంలో విఫలమైందని దివ్యాంగ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

**అర ఎకరం కేటాయింపు..**

1994లో అప్పటి ప్రభుత్వం దివ్యాంగుల శిక్షణ, ఉపాధి కేంద్రం (టీసీపీసీ) భవన నిర్మాణానికి నగరంలో 20 గుంటల (అర ఎకరం) స్థలం కేటాయించింది. నగరం నడిబొడ్డున బస్టాండ్ సమీపంలోని టెలిఫోన్, ఐటీ భవనాల సమీపంలో ఉంది. అప్పుడు స్థలంతోపాటు మొదటి విడతలో భాగంగా డీఆర్‌డీఏకు 1.38 లక్షలు కేటాయించారు. అప్పటి అధికారులు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించకుండా మధ్యలో కొంతవరకు భవనం నిర్మించి మమ అనిపించారు. తరువాతి కాలంలో స్థలం చుట్టూ పెద్ద పెద్ద భవంతులు రావడంతో విలువ అమాంతం పెరిగింది. ఈక్రమంలోనే కొంత స్థలం ఆక్రమణకు గురైంది. దానిని



తిరిగి స్వాధీనం చేసుకోవాలని దివ్యాంగులు అధికారులను కోరుతున్నా ఫలితం లేకుండాపోయింది. దివ్యాంగుల పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, దివ్యాంగుల ఉద్యోగుల హక్కుల పోరాట సమితి బాధ్యుడు వెన్నం శ్రీనివాస్‌లు.. స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు ఆక్రమణదారులకే వంత పాడుతున్నారని, మిగిలిన స్థలం సైతం కబ్జాకు గురయ్యే అవకాశముందని ఆరోపించారు. స్థానిక ఎంపీ బండి సంజయ్‌ను సైతం కలిసి వినతిపత్రం సమర్పించగా స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసుకోవాలని రూ. 4.95 లక్షలను ఎంపీ ల్యాడ్స్ నుంచి కేటాయించారు. ఏడాదిన్నర కిందట నిధులు కేటాయించినా స్థల వివాదం మూలంగా ప్రహరీ పని ముందుకు సాగడంలేదు.

**అంగుళం స్థలం కూడా వదిలిపెట్టం** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రహరీ నిర్మాణానికి టెండర్ పిలిచాం. అంగుళం స్థలం కూడా వదిలిపెట్టకుండా స్వాధీనం చేసుకుంటాం. ఏ సమస్య ఉన్నా పరిష్కరించి, ప్రహరీ నిర్మిస్తాం. సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి

# ఇకపై రోడ్లపైనే వాహన తనిఖీలు!

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను తొలగిస్తూ ఈ నెల 28న రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడుచోట్ల వీటిని తొలగించనున్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ఉండే మన జిల్లాలో ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది రవాణా శాఖ అధికారులకు మాత్రం మింగుడు పడని అంశంగా మారిందనే చెప్పాలి. ఉమ్మడి జిల్లాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో కల్లూరు, పాల్వంచ, అశ్వారావుపేటలో చెక్‌పోస్టులున్నాయి. ఇక్కడ ఎంవీఐ, ఏఎంవీఐలతోపాటు కానిస్టేబుల్స్, సిబ్బంది 24 గంటల పద్ధతిలో పనిచేస్తున్నారు. ఇక్కడ అందించే సేవలన్నీ ఇకపై ఆన్‌లైన్‌లోనే సమకూర్చాలని నిర్ణయించారు. సర్వర్‌లో ఇందుకనుగుణంగా మార్పులు చేస్తోంది. అంతర్రాష్ట్ర వాహనాలకు సంబంధించిన తాత్కాలిక అనుమతులు, వాహన పన్నులు, రవాణా శాఖ నిబంధనల పత్రాల తనిఖీలను సాధారణ వాహన తనిఖీల మాదిరిగానే చేపడతారు. ఇందుకోసం ఆరు నెలలపాటు మొబైల్ స్క్వాడ్లను నియమించి నూతన నిబంధనలపై అవగాహన కల్పిస్తారు. నిబంధనలు పాటించని వాటిని గుర్తించేందుకు వీలుగా ఏఎన్‌పీఆర్(ఆటో నంబర్ ప్లేట్ రీడర్) కెమెరాల్ని ఏర్పాటు చేస్తారు.

**ఇప్పటిదాకా...** ఉమ్మడి జిల్లాలోకి ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ఎక్కువగా సరకు రవాణాతోపాటు ప్రజలను తరలించే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాటికి చెక్‌పోస్టుల వద్ద రవాణా అధికారులు తాత్కాలిక అనుమతి(టెంపరరీ పర్మిట్) పత్రాలను జారీ చేసేవారు. సరకు ఎంటీ? లోడు ఎంత వస్తుందనే దాంతోపాటు పన్నులు సక్రమంగా చెల్లించారా



లేదా తనిఖీలు చేస్తుంటారు. నిబంధనలకు విరుద్ధంగా పట్టుబడితే కేసులు నమోదు చేస్తారు.

**లాభనష్టాలు..** చెక్‌పోస్టుల తొలగింపుతో వాహనాల రాకపోకలు సులభతరం అవుతాయి. వస్తు రవాణా వేగవంతమై వ్యాపారులకు ఖర్చు, సమయం ఆదా అవుతుంది. చెక్‌పోస్టుల నిర్వహణ ఖర్చు ప్రభుత్వానికి తగ్గనుంది. మరోపక్క నిషేధిత వస్తువులు(డ్రగ్స్, మద్యం, మాదక ద్రవ్యాలు) రవాణా పెరిగే ప్రమాదం ఉంది. భద్రతాపరమైన సమస్యలతోపాటు సరకు రవాణాలో అక్రమాలకు ఆస్కారం ఉంటుంది. పన్నులు చెల్లించకపోవడం, పర్మిట్లు తీసుకోకపోవడం వంటివాటితో ప్రభుత్వ ఆదాయానికి గండిపడే అవకాశం ఉంటుంది. **అధికారుల్లో గుబులు..!**

ఉమ్మడి జిల్లాలో రవాణా చెక్‌పోస్టుల నుంచి భారీగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అంతకన్నా ఎక్కువగా అక్కడ విధులు నిర్వర్తించే కొంతమంది సిబ్బంది లాభపడుతుంటారనే విమర్శలున్నాయి. ఇక్కడ పోస్టింగ్ తీసుకునేందుకు వాహన ఇన్‌స్పెక్టర్లతో పాటు కానిస్టేబుల్స్ సైతం ఉత్సాహం చూపిస్తుంటారు. మంత్రుల స్థాయిలో ప్రయత్నిస్తుంటారు. ఒక్క రోజు విధులు నిర్వర్తిస్తే మరుసటి రోజు సెలవుతోపాటు అమ్యామ్యాలకు కొదవ ఉండకపోవటమే దీనికి కారణమన్న అభిప్రాయం ఉంది. ఏ అధికారి విధుల్లో ఉంటే ఆయన సహాయకులే (ప్రైవేటు సిబ్బంది) అన్నీ చూసుకుంటారు. జరిమానా మొదలు అన్ని పనులు వీరే నియంత్రిస్తారు. చెక్‌పోస్టుల ఎత్తివేతతో ఇలాంటివన్నీ అడ్డుకట్టపడతాయి.

# వర్షాల వేళ అండగా ఆయుష్ సేవలు




కొత్తగూడెం : వ్యాధుల తరుణంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో వ్యాధులు, విష జ్వరాలు విజృంభిస్తుండటంతో జనరల్ వార్డుల్లో జ్వర పీడితులు పెరిగిపోతున్నారు. కేవలం ఇంగ్లీష్ మెడిసిన్‌తో మాత్రమే కాకుండా ఆయుష్ కేంద్రాల్లోని ఔషధాలతో సైతం చాలా మంది ఉపశమనం పొందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయుష్ కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలకు సైతం ఆదరణ పెరిగిపోతోంది. చాలా మంది అల్లోపతి ఔషధాల కంటే ఆయుర్వేద ఔషధాల వినియోగానికి మొగ్గు చూపుతున్నారు. అక్కడి కేంద్రాల్లో వైద్య చిట్కాలను ఆచరించడానికి ఆసక్తి చూపుతున్నారు. దాంతో జిల్లా వ్యాప్తంగా ఆయుష్ కేంద్రాలు సైతం వైద్య సేవలకు వేదికగా మారుతున్నాయి. వందలో 30 మంది వరకు ఆయుర్వేదానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దాంతో ఆయుష్ కేంద్రాల్లో వైద్య సేవలు పెరుగుతున్నాయి.

**సబ్ సెంటర్లలోనూ అందుబాటులో సేవలు**

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయుష్ కేంద్రాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో సబ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. పీహెచ్‌సీ, ప్రాంతీయ ఆసుపత్రులు, సీహెచ్‌సీలలోనూ సబ్ సెంటర్లు కొనసాగుతున్నాయి. ఆయా ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్న వారు సైతం ఆయుష్ కేంద్రాల్లో వైద్య చికిత్సలు పొందుతున్నారు. క్రమంగా అనారోగ్య సమస్యలు తగ్గుముఖం పడుతుండటం, ఎలాంటి ఒత్తిళ్లు, సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఆరోగ్యం కుదుట పడుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఆయుర్వేద వైద్య చికిత్సలను మరింత మెరుగు పరిచేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటే శ్రేయస్కరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **మెరుగైన వైద్యం అందిస్తున్నాం..**

ప్రస్తుతం విష జ్వరాలు, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ఆయుష్ కేంద్రాల్లో వైద్య సేవలను మెరుగు పరుస్తున్నాం. రోగులకు తగినట్లుగా ఔషధాలను అందుబాటులోకి తెస్తున్నాం. ప్రజలు ఆయుష్ కేంద్రాలను వినియోగించుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. మహేశ్, ఆయుష్ ప్రోగ్రామ్ మేనేజర్

# మలుపు ఉంది జాగ్రత్త!



ఇల్లెందు : ఇల్లెందు నుంచి గుండాలతో పాటు పాఖాల మార్గంలో పలు మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. వీటికి తోడు రహదారి ఆక్రమణలు ప్రమాదాలకు ఆజ్యం పోస్తున్నాయి. సమస్య పరిష్కారానికి రహదారులు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ), పంచాయతీ రాజ్ శాఖాధికారులు చొరవ తీసుకొని సూచికలు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు చేయాలి. ఇదే సందర్భంలో ఇరువైపులా సమస్యగా మారిన పచ్చిరొట్ట, మాబీరాను తొలగించాల్సిన అవసరం ఉంది.

**ఇల్లెందు–రొంపేడు..**

ఇల్లెందు నుంచి రొంపేడు మార్గంలో రెండు మలుపుల వద్ద ఆక్రమణలు ప్రమాదాలకు ఆజ్యం పోస్తున్నాయి. నిత్యం ఈ రోడ్డులో అధికారులు, నేతలు పర్యటిస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. టర్నింగ్‌ల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక పలుమార్లు మృత్యుఘోషలు వినిపిస్తున్నాయి. ఇల్లెందు నుంచి రొంపేడు మార్గంలో ఆక్రమణలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీవో చిరంజీవి పేర్కొన్నారు. గత నెల ఈ ప్రాంతంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహబూబాబాద్ జిల్లా గార్ల మండలానికి చెందిన సాగర్(23) మృతిచెందగా మరో యువకుడు తీవ్రగా గాయపడ్డాడు. మామిడిగూడెం నుంచి పోలారం మార్గంలోనూ పలు మలుపుల్లో వాహనదారులు గుర్తించేలోపే ప్రమాదాలు జరుగుతున్నాయి.

అశోక్‌నగర్ పరిధిలో మే నెలలో చెట్టును ఢీకొని రామ్మూర్తి (30) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈప్రాంతంలో గతంలోనూ పలువురు ప్రమాదాల్లో మృతిచెందిన ఉదంతాలు ఉన్నాయి.

**టేకులపల్లి మండలంలోనూ..** పెట్రాంచెలక స్టేజీ నుంచి ఇల్లెందు మండలం మర్రిగూడెం అడ్డరోడ్డు వరకు ఉన్న ర.భ మార్గం ప్రమాదకరంగా ఉంది. బోడు నుంచి మర్రిగూడెం మార్గంలోనూ పలు చోట్ల రహదారికి ఇరువైపుల పచ్చిరొట్ట కమ్మేసింది. టేకులపల్లి నుంచి బోడు మార్గంలో మార్చిలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కారేపల్లి మండలం ఉసిరికాయపల్లికి చెందిన యువకుడు మృతి చెందాడు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా సూచికలను ఏర్పాటు చేశాం. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో రహదారి వెంట ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తే వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయి. మోతీలాల్, ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, ఇల్లెందు

# నానో వైపు 'సాగు'దాం



సిరిసిల్ల: నానో యూరియా వచ్చాక పంటలకు ఎరువులు చల్లే ప్రయాస సగానికి తగ్గింది. కూలీలను మాట్లాడటం.. బస్తాలు మోసుకెళ్లడం.. యూరియా కొరత, రోజుల తరబడి నిరీక్షణ వంటి సమస్యలు ఉండవు. 500 మిల్లీలీటర్ల నానో యూరియా ఎకరానికి డ్రోన్‌తో అయితే పది నిమిషాల్లో చల్లేస్తోంది.

**ప్రభుత్వం సంస్కరణలు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు సహకార సంఘాల ఎదుట రోజుల తరబడి పడిగాపులు పడటం.. అవి వచ్చాక ఒకటి.. అర దొరకడమే గగనమైంది. ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడకంపై వ్యవసాయశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తున్నా.. చాలా వరకు రైతులకు చేరక ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి 11,75,129 ఎకరాల్లో సాగయ్యాయి. పంటలకు రసాయన ఎరువుల వినియోగాన్ని దశలవారీగా తగ్గించేందుకు ప్రభుత్వం సంస్కరణలు చేపడుతోంది. ప్రస్తుతం గుళికల రూపంలో అందజేస్తున్న యూరియా బస్తాలు సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా నానో యూరియాకు ప్రాధాన్యం పెంచుతున్నారు.

**అనేక ప్రయోజనాలు** గుళికల యూరియా మార్కెట్లో రూ. 280. అదే 500 మిల్లీలీటర్ల నానో యూరియా 220 నుంచి రూ. 280 వరకు కంపెనీలను బట్టి లభిస్తుంది. గుళికలతో వృథా ఎక్కువ ఉంటుంది. 500 మిల్లీ లీటర్ల యూరియా ఒక బస్తాకు సమానం.

ఈ సీజన్ నుంచే నానో యూరియా వినియోగాన్ని పెంచారు. ఇది పర్యావరణ హితమైనదే కాకుండా నేలలోని పోషకాలను సమృద్ధిగా వినియోగించుకొని పంట దిగుబడికి దోహదపడుతుంది.

ఇఫ్కో సంస్థ నానో యూరియా సరఫరాతోపాటు రైతులకు డ్రోన్‌లను అందుబాటులో ఉంచుతుంది. ఉమ్మడి జిల్లాలో 21 డ్రోన్‌లు అందుబాటులో ఉంచారు. వీటితోపాటు ఇతర ప్రైవేటు సంస్థలు కూడా ఉన్నాయి. ఇవేకాకుండా స్ప్రేయర్లతోనూ పిచికారీ చేసుకోవచ్చు.

సహకార సంఘాలకు సరఫరా చేస్తున్న ఇఫ్కో నానో యూరియా రైతులకు బీమాను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతు ఒక బాటిల్ గరిష్ఠంగా 20 కొనుగోలు చేసినవారికి రూ. 10 వేల నుంచి రూ. 2 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. నెలరోజుల నుంచి సంవత్సరం వరకు బీమా అమల్లో ఉంటుంది. రైతులు యూరియా కొనుగోలు చేసిన రశీదులను భద్రపరుచుకోవాలి. వృథా తగ్గింది.. ఫలితం బాగుంది

నాలుగు ఎకరాల వరి, అయిదు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. వరి నాటువేసిన నెల రోజుల తర్వాత రెండో విడత, పత్తిలో మొలకలు వచ్చినప్పటి నుంచి ఆరు ఎకరాల్లో ఈ సీజన్‌లోనే తొలిసారి నానో యూరియా వాడాను. మిగతా విస్తీర్ణానికి గుళికలు వేశాను. ఒక ఎకరం పొలానికి గుళిక యూరియా చల్లేందుకు అయితే రూ. వెయ్యి ఖర్చవుతుంది.

# రెక్కల కష్టం.. వర్షార్పణం

ఖమ్మం : ముందెన్నడూ లేని రీతిలో సాగర్ జలాలు నెల రోజుల ముందే పొలాలకు చేరాయి. విస్తారంగా వర్షాలు కురిశాయి. వాగులు పొంగాయి.. చెరువులు మత్తడి పోశాయి. జిల్లాలో వానాకాలం సాగు విస్తీర్ణం అంచనాకు మించి సాగైంది. సుమారు 6.34 లక్షల ఎకరాల్లో అన్ని రకాల పంటలు పండిస్తారని భావించగా ఇప్పటికే 6,55,275 ఎకరాలకు చేరింది. అనుకూలించిన ప్రకృతే భారీ వర్షాల రూపంలో అన్నదాతలను కుదేలు చేసింది. రోజుల విరామంతో రెండు విడతలుగా వచ్చిన వర్షాలు చేటు చేశాయి. పంటనష్టం ప్రాథమిక అంచనాలు క్షేత్ర స్థాయిలో షరామామూలుగా సాగటంతో జిల్లాలో అన్నదాతలు బోరుమంటున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 2812 మంది రైతులకు చెందిన 3,644 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో వరి 2,200 ఎకరాల్లో, పత్తి 590, పప్పుదినుసులు 719 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించారు. క్షేత్ర స్థాయిలో రైతులను కదిలిస్తే పంట నష్ట తీవ్రత అధికంగా ఉందంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. మూడు నెలల రెక్కల కష్టం నాలుగైదు రోజుల వర్షాలతో తుడిచిపెట్టుకపోయిందంటున్నారు. పత్తి, పెసరకు తీవ్ర నష్టం వాటిల్లింది.

**పెసర రైతు ఆగమాగం..**

పక్షం రోజుల క్రితం కురిసిన వర్షాలతో పెసర రైతు సగం నష్టపోతే రెండు రోజుల క్రితం వరకూ ఎడతెరపి లేకుండా పడ్డ వానలతో పూర్తిగా కుదేలయ్యాడు. జిల్లాలో 17వేల ఎకరాల్లో పెసర సాగైంది. ఇందులో సుమారు 9వేల ఎకరాలు ముందస్తుగా వేయగా ఆ పంట చాలావరకు దెబ్బతింది. మధిర, వైరా, వైరా, రఘునాథపాలెం, చింతకాని మండలాల్లో అధికంగా నష్టపోయారు. కొణిజర్ల, ఏన్కూరు,



కారేపల్లి, వైరా మండలాల్లో వాగుల పక్కన పూర్తిగా దెబ్బతింది. ఇదే అదునుగా మార్కెట్లోకి వచ్చిన పెసరను వ్యాపారులు క్వింటా రూ. 3500 నుంచి రూ. 4వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తేనే ప్రభుత్వ మద్దతు ధర దక్కుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుగా వేసిన పైరు కోతకు రావడంతో మిషన్లతో పనులు మొదలుపెట్టారు. అందులో సగానికి సగం విత్తనాలు బూజుపట్టి నల్లగా మారాయి. అధిక తేమతో పాటు నీరు చేరడంతో గింజలు గట్టిపడలేదు. కొణిజర్ల మండలం క్రాంతినగర్‌కు చెందిన భూక్యా సురేశ్ గుబ్బగుర్తి సమీపంలో కౌలుకు తీసుకుని 8 ఎకరాల్లో పత్తి వేశాడు. తండ్రి మంగీలాల్ మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగుచేస్తున్నారు. మొత్తం కాయ దశలో ఉంది. నిమ్మవాగు ఉద్ధృతితో సురేశ్‌కు చెందిన ఏడు ఎకరాలు, మంగీలాల్ మూడు ఎకరాల్లో పత్తి మొత్తం కుళ్లిపోయింది. మల్లుపల్లికి చెందిన రైతు దిరిశాల కృష్ణ ఎకరంన్నర పెసర వేశారు. పగిడేరు వచ్చి చేరడంతో పూర్తిగా దెబ్బతింది. గింజ కూడా ఇంటికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. రాలిన ఆశలు.. జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. పూత, పిందె ఉన్న దశలో వర్షాలు నష్టం మిగిల్చాయి. తేమశాతం పెరిగి పూత, పిందె పూర్తిగా రాలిపోయింది. ముందుగా వచ్చిన కాయల్లోకి నీరుచేరడంతో నల్లబడిపోతున్నాయి. వాగులు, ఏర్లు పక్కన పంటంతా నల్లబడింది. 5వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు అనధికార అంచనా. 'ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమికంగా నష్టాన్ని అంచనా వేస్తున్నాం. తదుపరి మార్గదర్శకాల ప్రకారం పూర్తి స్థాయిలో సర్వే చేస్తాం.' జిల్లా వ్యవసాయాధికారులు

# చేపాచేపా.. ఎలా ఎదుగుతావు

కొత్తగూడెం: 'చేపా చేపా ఎందుకు ఎదగలే..?' కాలం గడిచాక నీళ్లలో పోస్తే ఎలా పెరిగేది..? 'అధికారులూ.. ఎందుకింత ఆలస్యమైంది?'.. అదేం లేదు. గుత్తేదారు రావటమే తరువాయి.. 'గుత్తేదారు, గుతేదారు మీకేమైంది?' సమయానికి బిల్లులిస్తే చేపపిల్లల్ని నీళ్లలో వదిలేయటానికి మాకేం బాధ?'.. మొత్తంగా ఏడు చేపలా కథలా ఉంది ఉభయ జిల్లాల్లో చేపపిల్లల పంపిణీ తీరు. రెండేళ్ల క్రితం పంపిణీలో తీవ్ర జాప్యం చోటుచేసుకోగా గతేడాది పరిస్థితి కొంత ఫర్వాలేదు. ఈ ఏడాది పుష్కలంగా నీరున్నా, జలాశయాలు కళకళలాడుతున్నా ఇప్పటివరకూ చేపపిల్లల పంపిణీ టెండర్లు ఖరారు కాలేదు. ఆగస్టు రెండో వారం నుంచే ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నటు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గత నెలాఖరులో రూ. 123 కోట్లతో 90 కోట్ల పిల్లలను కొనుగోలుకు ఆర్థిక శాఖ అనుమతించింది. కానీ చేప పిల్లల పంపిణీ ఎప్పుడా అని ఖమ్మం, భద్రాదికొత్తగూడెం మత్స్య సహకార సంఘాలు ఎదురుచూస్తున్నాయి.

**గుత్తేదారులు ముందుకొస్తేనే..**

ఉచిత చేప పిల్లల పంపిణీకి ఏటా ఏప్రిల్ నెలాఖరులో టెండరు ప్రకటన విడుదల చేసి మే నెల రెండో వారంలో ప్రక్రియ పూర్తి చేసేవారు. జులైలో పంపిణీ ప్రారంభించి ఆగస్టు లోపు చెరువుల్లోకి విడుదల పూర్తి చేయాలి. గతేడాది ఆగస్టులో చేప పిల్లలను వదిలే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు వచ్చినా ఎలాంటి మార్గదర్శకాలు రాకపోవడం గమనార్హం. వచ్చే నెలలో టెండర్లు ఖరారు కానున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. గత రెండేళ్ల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఇప్పటికిప్పుడు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకొచ్చే పరిస్థితి లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ లెక్కన టెండర్లు పిలిచి, అవి ఖరారై, చెరువుల్లోకి పూర్తిగా వదిలే ప్రక్రియ పూర్తి కావాలంటే మరో రెండు నెలలు పట్టే అవకాశం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాలానుగుణంగా చేప పిల్లలు చెరువుల్లోకి విడుదల చేయకపోవటంతో మత్స్య దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఫలితంగా మత్స్య గ్రహణం కూడా ఆలస్యమయ్యే అవకాశం ఉంది. 'చేప పిల్లల పంపిణీకి సంబంధించి టెండర్లు పూర్తి కాలేదు. ప్రభుత్వం గుత్తేదారులను గుర్తిస్తే వారి నుంచి సేకరించి చెరువుల్లో వదిలే అవకాశం ఉంటుంది.' ఇంతియాజ్, మత్స్యశాఖ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం.

## కాలువ దాటే వేళ కాస్త జాగ్రత్త!

మెట్‌పల్లి: :చిత్రంలో కనిపిస్తోంది మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులోని కాకతీయ కాలువపై వంతెన. ఓవైపు రక్షణ గోడ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. మరమ్మతులకు సుమారు రూ.1.74 లక్షలు మంజూరైనా పనులు చేపట్టడం లేదు. సుమారు పది గ్రామాలకు చెందిన ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఆదమరిస్తే కాలువలో పడే ప్రమాదమున్నది వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సాగునీటి కాలువల మీదుగా ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఏళ్ల కిందట నిర్మించిన వంతెనలు పలు చోట్ల శిథిలావస్థకు చేరడం, రక్షణ గోడలు కూలడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది. హెచ్చరిక బోర్డులతో పాటు ప్రమాద నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారు. వినాయకచవితి రోజు మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ యువకుడు ఎస్సారెస్పీ కాలువలో గల్లంతైన నేపథ్యంలో రక్షణ చర్యల ఆవశ్యకత మరోసారి తెరపైకి వచ్చింది.

**కూలిన రక్షణ గోడలు**

ఇబ్రహీంపట్నం మండలం ఎర్రాపూర్ నుంచి వరద కాలువ, డబ్బా నుంచి కాకతీయ కాలువ ప్రారంభమై మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, జగిత్యాల, మల్యాల తదితర మండలాల మీదుగా వెళ్తుంది. వరద కాలువపై బండలింగాపూర్, విట్టంపేట, రాజేశ్వర్‌రావుపేట గ్రామాల రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి ఉపయోగించే వంతెన



పగుళ్లు బారి కుంగిపోయింది.

వెల్లుల్ల–పెద్దాపూర్ మధ్య పొలాల వద్దకు వెళ్లడానికి నిర్మించిన చిన్న వంతెనలకు ఇరువైపులా గోడలు కూలిపోయాయి. రైతులు, ప్రయాణికులు కాలువకు ఎడమ వైపు ఉన్న రహదారిని వినియోగిస్తుంటారు. వర్షాలకు రహదారి గుంతలమయం కావడంతో ప్రమాదం పొంచి ఉంది.

**సూచికలు లేక ఆందోళన**

వర్షాలతో కల్వర్టుల పైనుంచి వరద పారుతుండగా రక్షణ ఏర్పాట్లు, హెచ్చరిక సూచికలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**అయిదేళ్లలో నాలుగు ఘటనలు**

2021 సెప్టెంబరులో మెట్‌పల్లి మండలం రంగారావుపేటకు చెందిన యువకుడు ఎస్ఆర్ తండా శివారులోని కల్వర్టుపై నుంచి పారుతున్న వరద నీటిని దాటేందుకు యత్నించి కాలువలో పడి మృతి చెందారు. 2022 జనవరిలో వెల్లుల్ల శివారులో వంతెనపై ఎస్సారెస్పీ కాలువలోకి వాహనం దూసుకెళ్లిన ఘటనలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. 2024 అక్టోబరులో యువ వైద్యుడు విట్టంపేట శివారులోని వరద కాలువలోకి దిగి మృతి చెందారు. తాజాగా పెద్దాపూర్‌కు చెందిన యువకుడు ట్రాక్టర్‌తో సహా కాలువలో పడి గల్లంతయ్యారు.

## అంగన్‌వాడీల్లో ఆకుకూరలు

సిరిసిల్ల : చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీ దిశగా సర్కారు చర్యలు చేపడుతోంది. సేంద్రియ పద్ధతుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకానికి శ్రీకారం చుట్టనుంది. ఎంపిక చేసిన కేంద్రాలకు నిధులు మంజూరుతో పోషక విలువలతో కూడిన ఒక్కపూట భోజనం అందించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. అవాంతరాలను నిర్మూలించి సరైన పద్ధతిలో ఆకు, కూరగాయల తోటలు పెరిగితే జిల్లాలోని లబ్ధిదారులకు పోషక విలువలు అందనున్నాయి.

**12 మండలాల పరిధిలో..**

జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల ఐసీడీఎస్ పరిధిలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 3074 మంది గర్భిణులు, 3035 మంది బాలింతలతోపాటు 25 వేల మంది చిన్నారులు నమోదయ్యారు. 2018లో కేంద్రం అమలు చేసిన పోషణ్ అభియాన్‌లో భాగంగా సొంత భవనాలు కలిగిన కేంద్రాల్లో కూరగాయల సాగు చేపట్టారు. ప్రతికూల పరిస్థితులు, సాంకేతిక సమస్యలతో చాలావరకు సత్ఫలితాలు ఇవ్వలేదు. కోతులు, పశువుల దాడిలో చాలా వరకు ధ్వంసమయ్యాయి. మరోసారి పకడ్బందీగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటికల ఏర్పాటుకు సర్కారు సాయం అందించాలని నిర్ణయించింది. సొంత భవనాలు, అనుకూలమైన స్థలం ఉన్న చోట్ల పెరటి తోట నిర్వహణకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన స్థలాన్ని గుర్తించి సేంద్రియ పద్ధతుల్లో ఆకు కూరలు, కూరగాయలు సాగుకు చర్యలు తీసుకుంటున్నారు. 12 మండలాల పరిధిలో నీటి లభ్యత, విద్యుత్తు సరఫరా, స్థల అనుకూలత ఉన్న 157 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేశారు. రూ.10 వేల నిధులతో ఆయా కేంద్రాల్లో టమాట, బెండ, తోటకూర, మెంతి, పాలకూరతోపాటు నిర్వాహకుల ఆసక్తి మేరకు విత్తనాలను సరఫరా చేయనున్నారు. మొదటగా భూమి చదును ఇతర



పనులకు రూ.5 వేల చొప్పున కేటాయించనున్నారు.

**కోతులతో సమస్య**

గతంలో ఏర్పాటు చేసిన పెరటి తోటలపై కోతులు దాడి చేసేవి. కేంద్రాల్లో పిల్లల కోసం పండిస్తున్న కూరగాయలను తుంచి తినేవి. అప్పటితో పోలిస్తే గ్రామాల్లో కోతుల సంఖ్య ఇప్పుడు విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం అందిస్తున్న నిధులతో కోతులు తోటలపై పడకుండా మొదటగా పనులు నిర్వహించాల్సి ఉంది. వలలతో కంచె ఏర్పాటు చేస్తే తాత్కాలికంగా మాత్రమే పనిచేస్తోంది. పిల్లలు ఉండే ప్రాంతంలో బయట దొరికే వలలను కాపాడటం కొంత కష్టమే. శాశ్వత ప్రతిపాదికన సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. లేనిపక్షంలో పోషణ్ వాటికలలో భాగంగా తోటలు పెంచినా కోతుల దాడికి ఫలితం దక్కకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాలు 587
సొంత భవనాలు 158
అద్దె భవనాల్లో 152
పాఠశాల ప్రాంగణాల్లో 177

# ఉష్ణోగ్రతలు పెం'చెట్లు' నరికివేత



హైదరాబాద్: జీహెచ్ఎంసీలోని పట్టణ జీవ వైవిధ్య (యూబీడీ) విభాగం, విద్యుత్తుశాఖల నిర్లక్ష్యంతో పచ్చదనం ఆవిరవుతోంది. అధికారులు మొక్కలు నాటడంపై చూపుతోన్న శ్రద్ధ.. వాటిని కాపాడటంపై ఉంచట్లేదు. నిర్వహణను గాలికొదిలేశారు. రకరకాల కారణాలతో ఇష్టానుసారంగా కొమ్మలను నరికేస్తున్నారు. అశాస్త్రీయ ప్రూనింగ్ వల్లే.. గాలివానలకు వందలాది వృక్షాలు నేలరాలుతున్నాయి. గడిచిన ఏడాదిలో 4 వేల చెట్లు కూలాయి. ఇప్పటికైనా కొమ్మల తొలగింపునకు 'సమ తూకం' విధానాన్ని అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే నగరంలో వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు.

**అప్పట్లో ఉద్యమంలా నాటి..**

ఖాళీ స్థలాలు, కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని భూములు, కార్యాలయాల్లో, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలకు కేటాయించిన భూములు, రహదారుల పొడవునా చెట్లు నాటే కార్యక్రమం 1990 నుంచి 2005 మధ్య పెద్దఎత్తున జరిగింది. అప్పట్లో ఎంసీహెచ్, హుడా, అటవీశాఖ సంయుక్తంగా మొక్కలు నాటాయి. ఏడాది పొడవునా పచ్చగా ఉండే పెల్టోఫామ్ మొక్కలను ఎక్కువ సంఖ్యలో, నిద్ర గన్నేరు (రెయిన్ ట్రీ), గుల్మొహర్, తదతర జాతులను కొద్దిమొత్తంలో నాటారు. కంటోన్మెంట్‌లో, ఐడీపీఎల్ తదితర పరిశ్రమల్లో ఆనాటి మొక్కలు నేడు భారీ వృక్షాలయ్యాయి. పెల్టోఫామ్ జాతి చెట్లు అందంగా కనిపిస్తాయని, ఎక్కువ నీడనిస్తాయని నాటామని, కొమ్మలను ఒకవైపు మాత్రమే తొలగిస్తుండటంతో మరోవైపు బరువు పెరిగి, గాలి వానలకు విరిగిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు.

**బలమైన వేర్లు లేక..**

ఏదైనా చెట్టు ఎంత ఎత్తు పెరుగుతుందో.. భూమిలో అంతగా వేళ్లూనుకుపోతుంది. నగరంలో రోడ్ల పక్కన భవనాలు, వాటి పునాదులు, నాలాలు, సీసీ రోడ్లు, ఇతరత్రా అడ్డంకులతో చెట్లను బలంగా నిలిపే వేర్ల వ్యవస్థ బలంగా ఉండటం లేదు. దీంతో వృక్షాలు నేలకొరుగుతున్నాయి. చెట్లు కూలాయంటూ గతేడాది జులై నుంచి ఈనెల 21 వరకు కంట్రోల్ రూమ్‌కు వేలాది ఫిర్యాదులందాయి. 4 వేలకుపైగా చెట్లను తమ సిబ్బంది తొలగించారని హైడ్రా తెలిపింది.

**అనుభవం లేనివారితో పనులు..**

రోజుకు సాధ్యమైనన్ని ఎక్కువ నరకాలనే ధోరణిలో బల్దియా, విద్యుత్తుశాఖలు కొమ్మలను తొలగిస్తున్నాయి. చెట్టు బరువు అన్నివైపులా సమానంగా ఉండేలా చూసుకోవాలి. అనుభవం, అవగాహన లేని గుత్తేదారులు, సిబ్బంది ప్రూనింగ్ ప్రక్రియ చేపట్టడంతో పచ్చదనం బలవుతోంది. పెల్టోఫామ్‌తో పోలిస్తే.. గుల్మొహర్ చెట్టు కొమ్మలు బలహీనంగా ఉంటాయని, అందువల్ల.. రోడ్ల పక్కన వాటిని ప్రస్తుతం నాటట్లేదట. పౌరులు సైతం.. వాహనాల పార్కింగ్‌కు సమస్యగా ఉందని, ఇంట్లో ఆకులు రాలుతున్నాయని, రోడ్డువరకు ర్యాంపులు నిర్మించుకునేందుకు, దుకాణాల ఏర్పాటుకు, కీటకాలు, ఇతరత్రా కారణాలతో అనధికారికంగా నరుకుతున్నారు.

# వ్యాధుల దాడి.. రోగుల తాకిడి




హైదరాబాద్: వానలతో వ్యాధులు పంజా విసురుతున్నాయి. ముఖ్యంగా జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులతోపాటు ఆహారం, నీటి కాలుష్యం వల్ల డయేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు దాడి చేస్తున్నాయి. ఇప్పటికే 10 వేలకుపైగా డయేరియా కేసులు నమోదయ్యాయి. టైఫాయిడ్ జ్వర బాధితులు పెరుగుతున్నారు. గాంధీ ఆసుపత్రికి రోజుకు 1600 వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నారు. సోమ, మంగళ, బుధవారాల్లో ఆ సంఖ్య 2 వేలకు చేరుతోంది. ఉస్మానియా ఆసుపత్రిలోనూ అదే పరిస్థితి. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో ఆ సంఖ్య 700 దాటుతోంది. పిల్లలు, పెద్దలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. వరదల కారణంగా మురుగు నీరు తాగునీటి పైపుల్లోకి చేరే ముప్పు పొంచి ఉంటుంది. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. నల్లాల్లో మురుగు నీరు రావడం.. ఘాటైన వాసన ఉంటే.. అలాంటి నీటిని పట్టుకోవద్దని సూచిస్తున్నారు. వానలతో దోమల వృద్ధి వల్ల డెంగీ కేసులు సైతం పెరుగుతున్నాయి. ఇంటి చుట్టూ నీరు నిల్వకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రాథమిక సేవలు అరకొర.. గ్రేటర్ వ్యాప్తంగా 300కుపైగా అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలున్నాయి. 80 శాతం ప్రాథమిక ఆరోగ్య సమస్యలకు ఇక్కడే చికిత్స అందించవచ్చు. రక్త ఇతర పరీక్షలు నిర్వహించాలి. కొన్నింటిలో అరకొర సేవలతో చిన్న జ్వరానికి కూడా గాంధీ, ఉస్మానియాలాంటి పెద్దాసుపత్రుల బాట పడుతున్నారు. పలు బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీల్లో వైద్యులు 11 గంటలు దాటిన తర్వాత దర్శనమిస్తున్నారు. కొన్నింటిలో వైద్యుల కొరతతో పక్క సెంటర్ల బాధ్యతలు సైతం అప్పగించారు. ఎలాంటి ఆహారం తీసుకోక ముందే కొన్ని టెస్టులు చేయాలి. అయితే పది గంటలు దాటినా ల్యాబ్ టెక్నీషియన్లు రాకపోవడంతో రోగులు వెనుతిరుగుతున్నారు. ఇలాంటి వారంతా ఇక్కడ సేవలపై నమ్మకం లేక పెద్దాసుపత్రుల బాటపడుతున్నారు.

# నిధుల సేకరణకు బాండ్లు

హైదరాబాద్: మౌలిక వసతుల ప్రాజెక్టులు, ఇతర కార్యక్రమాలకు నిధుల సేకరణలో భాగంగా హెచ్ఎండీఏ ముమ్మర కసరత్తు చేస్తోంది. దాదాపు రూ.30 వేల కోట్ల వరకు డెట్ మార్కెట్ నుంచి సేకరించాలని భావిస్తోంది. జాతీయ బ్యాంకులు, ఇతర రుణ సంస్థల నుంచి ఈ నిధులు సమీకరించనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే అడ్వైజర్ కం మర్చెంట్ బ్యాంకర్‌ను నియమించేందుకు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ) కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. 7 జిల్లాల పరిధిలో పెద్ద ఎత్తున భూములతోపాటు నగరంలో పలు భవనాలున్నాయి. వీటిని హామీగా పెట్టి రుణ సేకరణకు కసరత్తు నడుస్తోంది. ముఖ్యంగా నిర్ణీత వడ్డీతోపాటు గడువులోపు తిరిగి చెల్లించేలా బాండ్ల ద్వారా సేకరించాలనేది యోచన. ఈ రుణాలకు ప్రభుత్వమే గ్యారంటీ ఇవ్వనుంది.

**సమస్య నుంచి బయట పడేలా..**

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో పలు ప్రాజెక్టులకు రూపకల్పన జరిగింది. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు ఒక ఎలివేటెడ్ కారిడార్, ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం వరకు మరో కారిడార్ రానుంది. పనులు, భూసేకరణకు సంబంధించి పరిహారం చెల్లింపునకు రూ.5 వేల కోట్లపైనే అవసరం. ఇక ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు 41.5 కిలోమీటర్ల మేరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు, భూసేకరణకు దాదాపు రూ.4 వేల కోట్లు అవసరం ఉంది. వీటితోపాటు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు రూ.వేల కోట్లు నిధులు అవసరం. నగరంలో చేపట్టే ఇతర మౌలిక వసతుల కోసం వందల కోట్ల నిధులు వెచ్చించాలి. ఈ తరుణంలో నిధుల సమీకరణ అవశ్యమని ప్రభుత్వం భావిస్తోంది. ఆ బాధ్యతలను హెచ్ఎండీఏకు అప్పగించింది. త్వరలో ఈ బాండ్ల వ్యవహారం ఒక కొలిక్కి రానున్నట్లు హెచ్ఎండీఏ వర్గాలు తెలిపాయి.

# చెరువులకు హద్దులు నీటి మూటలు!

హైదరాబాద్: నగరం, శివారు ప్రాంతాల్లో చెరువులు, జలవనరుల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పేరుతో హద్దులు నిర్మిస్తామంటూ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. ప్రతి చెరువు, జలవనరులకు సంబంధించిన వివరాలను వారు ఇంకా సిద్ధం చేస్తూనే ఉన్నారు. రెండు జిల్లాల్లోని చెరువుల్లో 60శాతానికిపైగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఐటీకారిడార్.. ఉప్పల్, మేడ్చల్ చుట్టూ విస్తరించడంతో ఆక్రమణలు, కబ్జాలకు గురికాకుండా గ్రామ నక్షలు, డిజిటల్ సర్వేలు నిర్వహించి వాటి విస్తీర్ణాన్ని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను నిర్ణయించాలనుకున్నారు. ప్రతి చెరువుకు జియోట్యాగ్‌ను ఏర్పాటు చేసి హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలనుకున్నారు. రెండు జిల్లాల్లో 2,094 చెరువులుండగా వీటిలో దాదాపు 60 శాతం మాత్రమే ప్రాథమికంగా సర్వే చేశారు. జియో ట్యాగింగ్ చేసేందుకు, సర్వే నిర్వహించేందుకు అధికారులు లేకపోవడంతో అక్కడితోనే నిలిపేశారు. తూతూమంత్రంగా చర్యలు.. చెరువులు, జలవనరులను ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతోపాటు ఆయా భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక బృందాలను రెండు జిల్లాల్లో ఏర్పాటు చేశారు. ఈ బృందాల్లో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్‌తో పాటు హైడ్రా అధికారులున్నారు. ఈ బృందాలు రియల్ వెంచర్లకు సమీపంలోని చెరువులపైనే దృష్టి కేంద్రీకరించాయి.

## ఏమార్చి.. పట్టాలు మార్చేసి

పెద్దపల్లి : జిల్లాలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. రాజకీయ పలుకుబడితో గ్రామకంఠం, శిఖం భూములనూ వదలడం లేదు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూదస్త్రాల శుద్ధీకరణలో స్థానిక రెవెన్యూ సిబ్బంది తమ బంధువులు, కుటుంబ సభ్యుల పేరిట ఆన్‌లైన్ చేసుకుని దర్జాగా పట్టాహక్కులు పొందారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**ఖాళీ స్థలం కనిపిస్తే చాలు..**

జిల్లాలో పెద్దపల్లి, మంథని రెవెన్యూ డివిజన్ల పరిధిలో 14 మండలాల్లోని 214 గ్రామాల్లో 33,334.14 ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నాయి. జిల్లాలో పరిశ్రమలు, రాజీవ్ రహదారి, ప్రధాన రహదారుల వెంట పట్టణాలు, గ్రామాల్లో విలువైన ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయి. కొందరు రాజకీయ పలుకుబడితో దస్త్రాలను మార్చేస్తున్నారు. అసైన్డ్ కమిటీ ఆమోదం లేకుండానే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సేత్వార్ కంటే అధిక విస్తీర్ణంలో బినామీ పట్టాలు సృష్టించి క్రయవిక్రయాలు చేపడుతున్నారు. రోజు రోజుకూ భూముల ధరలు పెరగడంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

**ఆయా మండలాల్లో ఇలా..**

కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్లలో ఓ ఉద్యోగి ప్రభుత్వ భూమిని కబ్జా చేసి పట్టా హక్కులు పొందారు. స్థానిక ప్రజలు ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లో తొలగించారు. హద్దులు పాతినా ఫలితం లేదు. యథావిధిగా కబ్జా కొనసాగుతోంది.



ఓదెల మండలం పొత్కపల్లిలో విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన కట్టడాలు, నిర్మాణాలపై అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. కబ్జాపై చర్యలు తీసుకోవడంలో నాన్చుతున్నారు. ఎలిగేడు మండలం ముప్పిరితోటలో ప్రభుత్వ భూములను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఇష్టారీతిగా అక్రమ పట్టాలు పొందుతున్నారు. జూలపల్లి మండలం చీమలపేటలో విలువైన గుట్ట స్థలాలను కబ్జా చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు.

కమాన్‌పూర్ మండలం గుండారంలోని ఓ సర్వే నెంబరులో విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. గతంలో పంపిణీ చేసిన భూములు చేతులు మారుతున్నాయి.

ప్రజావాణిలో ప్రభుత్వ స్థలాల కబ్జాపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 112 ఫిర్యాదులురాగా వీటిని స్థానిక రెవెన్యూ అధికారులు విచారణకు పంపించారు. వీటిలో పావలా వంతు కూడా హద్దులు నిర్ణయించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## స్కాడా.. ఏదీ నీ జాడ?

కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.కోట్ల ఖర్చుతో శుద్ధి చేసిన తాగునీటి సరఫరా వివరాలను తెలుసుకోవడానికి ప్రణాళికలు చేసినా పూర్తి స్థాయిలో అమల్లోకి రాలేదు. నాలుగేళ్ల కిందట స్కాడా (సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్) విధానం ప్రారంభించారు. పలు చోట్ల ఫ్లో మీటర్లను బిగించి నీటి శుద్ధి కేంద్రం నుంచి సంపు, రిజర్వాయర్ వరకు, అక్కడి నుంచి ఇళ్ల నల్లాల వరకు ఎంతమేర నీటిని వినియోగిస్తున్నారనే విషయం తెలుస్తుంది. నీటి వృథానూ అరికట్టేందుకు అవకాశమూ కలుగుతుంది.

19 చోట్ల మీటర్లు..

నగరవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో 19 ఫ్లో మీటర్లు బిగించారు. ఫిల్టర్‌బెడ్‌లో రావాటర్, క్లియర్ వాటర్ తెలుసుకోవడంతోపాటు ఇక్కడే రెండు డివిజన్ల ఎనిమిది ఫ్లో మీటర్లను బిగించారు. శాతవాహన విశ్వవిద్యాలయం గుట్టపై ఉన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, హైలెవల్ జోన్‌లోని జ్యోతినగర్, ఎస్సారార్, రాంనగర్, మల్కాపూర్ రోడ్డు, అంబేడ్కర్‌నగర్‌లలో.. లోలెవల్‌లోని మార్కెట్, రాంపూర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, భగత్‌నగర్, గౌతమినగర్ రిజర్వాయర్‌లలో వీటిని ఏర్పాటు చేశారు.

**పని చేసేది ఇలా..** రిజర్వాయర్లు దగ్గర ఉండే ఔట్‌లెట్ పైపులైనుకు అయస్కాంతంతో కూడిన ఫ్లో మీటర్ పరికరాన్ని బిగిస్తారు.

ఇక్కడే సిమ్‌కార్డుకు అనుసంధానం చేస్తారు. ఇది జీపీఎస్‌లా పని చేస్తుంది. కార్యాలయంలో ఏర్పాటు చేసే కంప్యూటర్ల ద్వారా డేటాను పరిశీలిస్తారు. ఏ ట్యాంకు నిండింది.. ఏయే ప్రాంతాల్లో నిండలేదు.. ఎన్ని గంటల వరకు తాగునీరు సరఫరా చేశారు. అనే విషయాలు తెలుస్తాయి.

ఎంతమేర శుద్ధ జలం పంపిణీ, వృథా జరిగిందనే లెక్కలు తెలుసుకునే వీలుంది. **పట్టింపేది?** రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన స్కాడా ఫ్లో మీటర్లు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని చోట్ల పని చేస్తున్నా.. పర్యవేక్షించే వారు లేరు. బిగించిన ఏజెన్సీ రెండేళ్లు నిర్వహణ చూసుకోగా ఇప్పుడు గడువు ముగిసింది. సిమ్‌లు పని చేయడంలేదు. వైరింగ్ కూడా పాడైంది. ఇప్పటికైనా పరిశీలించి మరమ్మతులు చేసి వినియోగిస్తే ప్రభుత్వానికి ఉపయోగకరంగా ఉంటుంది.

**కొటేషన్ ఆహ్వానించాం**

స్కాడా నిర్వహణకు కొటేషన్లు ఆహ్వానించాం. ఎంతమంది వచ్చారో తెలుసుకొని.. అంచనాలు తయారు చేసి నిర్వహణ కోసం టెండర్ పిలవాల్సి ఉంది. లచ్చిరెడ్డి, డీఈఈ, నగరపాలిక

## నిఘా నేత్రాల నడుమ బోధన

జమ్మికుంట : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష సమయంలో, కారిడార్లకు, కాలేజీకి వెళ్లే రోడ్డుపై కనిపించే సీసీ కెమెరాలు.. ఇకపై తరగతి గదుల్లో కూడా నిఘా పెట్టనున్నాయి. ఆ సీసీ కెమెరాలను ఇంటర్మీడియేట్ బోర్డు హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానిస్తున్నారు. తద్వారా రాష్ట్రంలోని కళాశాలల తరగతి గదుల్లో బోధన నిర్వహణ, విద్యార్థుల హాజరు తీరు ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు వీలుకానుంది. జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. ఏడింట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయిదు కళాశాలల్లోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశారు. మిగతా కళాశాలల్లో కూడా పనులు జరుగుతున్నాయి.

తరగతి గదుల సంఖ్యను బట్టి..

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 4,540 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదుల సంఖ్య బట్టి కళాశాలకు 13 నుంచి 17 వరకు నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే జిల్లా కేంద్రంలో మూడు, జమ్మికుంట, హుజూరాబాద్, వీణవంక, చిగురుమామిడి కళాశాలల్లో అమర్చారు. తాజా విధానంతో విద్యార్థుల సంఖ్య తగ్గితే బోర్డు ఉన్నతాధికారులు ఆయా కళాశాలలకు సూచనలు చేయటం సులువు అవుతోంది.

మెగా పేరెంట్స్ టీచర్స్ కమిటీల ఏర్పాటు

చదువులో వెనకబడ్డ విద్యార్థులను మెరుగు పర్చేందుకు మెగా తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు నిర్ణయించారు. త్వరలోనే కళాశాలల వారీగా ఈ సమావేశాలు నిర్వహించనున్నారు.

విద్యార్థుల ఉన్నతి కోసమే

విద్యార్థుల ఉన్నతి కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలల తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలోని 7 కళాశాలల్లో ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు విద్యార్థుల పర్యవేక్షణ, తరగతులకు ఏ మేరకు హాజరవుతున్నారనే వివరాల్లో పర్యవేక్షణ పెరుగుతోంది. గంగాధర, డీఐఈవో

# కొత్త వైద్యులొస్తేనే పాత చిక్కులు తొలిగేది..!

ఖమ్మం : వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను ఏళ్లుగా నిపుణుల కొరత వేధిస్తోంది. ముఖ్య విభాగాల్లో వైద్యులు లేకపోవడంతో రోగులకు 24గంటల సేవలు లభించడం లేదు. కొన్నిచోట్ల కనీసం డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు కూడా లేకపోవడంతో బాధితులు ఇతర ఆస్పత్రులు, ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో చికిత్సలు లభించక రోగుల ప్రాణాలకు ముప్పువాటిల్లుతుంది. ప్రస్తుత జ్వరాల సీజన్లో ఓవైపు డెంగీ కేసులు భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో వైద్య నిపుణుల నియామకానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గతానుభవాల దృష్ట్యా అర్హులు విధుల్లో చేరి, ఖాళీలన్నీ భర్తీ అయితేనే ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది.

**ఎక్కడెక్కడ, ఏఏ విభాగాల్లో..**

జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, నేలకొండపల్లి, మధిర, తిరుమలాయపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. అన్నిచోట్లా వైద్యుల కొరత నెలకొంది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్తీషియా, ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ విభాగాల్లో నిపుణులు లేరు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టుల్లో ఖాళీలతో నాడీపట్టే నాథుడు కరవయ్యారు. నిజానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పోల్చితే వీటిలో మెరుగైన సేవలందాలి. జిల్లా ఆసుపత్రిపై భారం పడకుండా ప్రత్యేక నిపుణులు, శస్త్రచికిత్స



వైద్యులు అందుబాటులో ఉండాలి. గ్రామీణుల అవసరాలు తీర్చాలి. ఉన్నత సేవలు అటుంచి సాధారణ జ్వరం, దగ్గు వంటి చిన్నపాటి సమస్యలకూ చికిత్స అందడం లేదు. చిన్నపిల్లలకు సకాలంలో రోగ నిర్ధారణ, చికిత్సలు లభించడం లేదు. స్త్రీ సంబంధిత సమస్యలకు, ప్రసవాలు, గర్భిణులు, తల్లులకు అవసరమైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. నిపుణుల కొరతతో శస్త్ర చికిత్సలు నిండుకున్నాయి. ఏది ఏమైనా తాత్కాలిక ప్రాతిపదిక స్థానంలో శాశ్వత పద్ధతిలో సిబ్బందిని నియమిస్తే సమస్యకు పూర్తి స్థాయి పరిష్కారం లభిస్తుంది.

**దరఖాస్తులు ఆహ్వానించాం**

డా. రాజశేఖర్‌గౌడ్, టీవీవీపీ ఆస్పత్రుల సమన్వయాధికారి

జిల్లాలోని అన్ని ఆస్పత్రులు ఆరు గైనకాలజీ, మూడు అనస్తీషియా, రెండు ఆప్తాల్మాలజీ, రెండు పీడియాట్రిక్, ఈఎన్‌టీ, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్‌లో ఒక్కోటి, ఒక సివిల్ సర్జన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. అర్హులైన వైద్యులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో ఈ నెల 6న ఐడీవోసీలోని జిల్లా ఆస్పత్రుల ప్రధాన కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలి. ప్రత్యేక నిపుణులకు రూ.లక్ష, సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఎంబీబీఎస్)కు రూ.52,351 చొప్పున నెలవారీ వేతనం చెల్లిస్తారు. ఆసక్తి కలిగిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# సేవల్లో నాణ్యత భక్తులకు భరోసా

భద్రాచలం : దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో భక్తులకు ఆన్‌లైన్‌లో పరోక్షంగా.. ఆఫ్‌లైన్ ద్వారా ప్రత్యక్షంగా సేవలు అందుతున్నాయి. ఏడాదికి 24 లక్షల మంది దర్శనానికి వస్తుండగా వార్షిక ఆదాయం సుమారు రూ.80 కోట్లకు చేరింది. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో రద్దీ బాగానే ఉంటోంది. ఇలాంటి చోట అందించే సేవలకు త్వరలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్(ఐఎస్‌ఓ) ధ్రువీకరణ పొందేందుకు అవసరమైన ప్రక్రియ ఆరంభమైంది. ఐఎస్‌ఓ అనేది అంతర్జాతీయ ప్రభుత్వేతర స్వతంత్ర సంస్థ. నాణ్యత, భద్రత, సామర్థ్యం పనితీరును నిర్ధారించేందుకు ఈ సంస్థకు నిపుణులు రూపొందించిన మార్గదర్శకాలు ఉన్నాయి. వాటికి అనుగుణంగా ఉంటేనే ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ఇది ఉంటే అదో గొప్పగా పరిగణిస్తారు. ప్రమాణాలు పకడ్బందీగా ఉన్నాయన్న భరోసా ఉంటుంది.

**యాదగిరిగుట్ట తరహాలో...**

సాధారణంగా పెద్దపెద్ద వ్యాపార సంస్థలు, కర్మాగారాలు తమ వినియోగదారుల ఆదరణ పొందేందుకు ఇలాంటివి పొందుతుంటాయి. దేవాదాయశాఖ సైతం తమ భక్తులకు అందించే సేవల విశిష్టతను విశ్వవ్యాప్తం చేసేందుకు ఈ సంస్థ సూచించే ప్రమాణాలను పాటిస్తున్నాయి. ఇప్పటికే యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఐఎస్‌ఓ గుర్తింపు వచ్చింది. వేములవాడ రాజన్న ఆలయానికి త్వరలో ఈ సర్టిఫికెట్ కేటాయించే వీలుంది. వారం కిందట ఈ ప్రతినిధులు భద్రాచలం రామాలయాన్ని సదర్శించి కొన్ని సూచనలు చేశారు. అన్నదానం, ప్రసాదాల తయారీ, శేష వస్త్ర దుకాణం, వివిధ కౌంటర్లలో రికార్డుల నిర్వహణతో పాటు పారిశుద్ధ్య చర్యలనూ పరిగణలోకి తీసుకున్నారు. మరోసారి ఈ బృందం వచ్చి సమగ్ర పరిశీలన చేసి సర్టిఫికెట్ కేటాయించనుందని భావిస్తున్నారు.

**హక్కులు.. ఆహార భద్రత**

ఈ దేవస్థానంలోని ధ్రువమూర్తుల చిత్రాలపై రామాలయానికి మే 23న కాపీరైట్స్ లభించాయి. ప్రధాన కోవెలలో సీతారామ లక్ష్మణుల వారి విగ్రహాలు దర్శనమిస్తాయి. ఇందులో అలంకరణ ఛాయాచిత్రం, అలంకరణ లేకుండా మరోచిత్రం ఎక్కువగా ముద్రణలో, జ్ఞాపికల్లో కనిపిస్తుంటాయి. అనుమతి లేకుండా ఎవరైనా ఈ ఫొటోలను ముద్రించినా.. వీటిని వ్యాపారం కోసం విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు రామాలయానికి హక్కులు వచ్చాయి. ప్రసాదాలు, అన్నదాన విభాగాలపై మరింత పారదర్శకత ఉండేందుకు ఫుడ్ సేఫ్టీ ధ్రువీకరణను పొందారు.

**కాగిత రహిత పాలన దిశగా...**

భక్తుల సౌకర్యం కోసం ఆన్‌లైన్‌తో పాటు డిజిటల్ సేవలు అందిస్తున్నారు. అలాగే కార్యాలయ నిర్వహణలోనూ కాగిత రహిత పాలనలో భాగంగా వేగంగా దస్త్రాల పరిష్కారానికి 'ఈ-ఆఫీస్' వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. ఇది పూర్తిగా కార్యాలయ వ్యవహారాలకు సంబంధించిన పారదర్శకతను చాటేందుకు ఏర్పాటు చేసిన ప్రక్రియ. ఇందులో మొదటగా అకౌంట్స్ విభాగంలో ఈనెల 1న ఆన్‌లైన్ ప్రారంభమైంది. ఇలా మరో పది విభాగాల్లో ఆన్‌లైన్ అమలు చేయనున్నారు. ఇందుకు కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు సరిపోవు. మరో 20 కొనేందుకు రూ.15 లక్షలు అవసరమని అంచనా. కంప్యూటర్ పరిజ్ఞానం లేని సిబ్బందికి శిక్షణ ఇచ్చే వీలుందని ఆలయ వర్గాలు తెలిపాయి.

# ఆయకట్టు కన్నీరు..!



సూర్యాపేట : సగం కూడా నిండని ఈ జలాశయం మద్దిరాలలోని మార్కమ్మ చెరువు. 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వనరు 80 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తుంది. ఇటీవల కురిసిన వానలకు ఆశించిన మేర వరద చేరలేదు. బోర్లు, బావులపై ఆధారపడి వరిసాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. వానాకాలం 122 రోజుల్లో 64 రోజులు కరిగిపోయాయి. ఈమధ్య కాలంలో జిల్లా వ్యాప్తంగా సగటున 16 రోజుల వర్షమే కురిసింది. నేటికీ వాగులు, వంకలు పొంగిపొర్లేలా వాన కురవకపోవడంతో చిన్ననీటి వనరుల్లోకి ఆశించిన మేర నీరు రాలేదు. దీంతో ఆయకట్టులోని చాలా మంది రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. బోర్లు, బావుల ఆధారమున్న కర్షకులు మాత్రమే నాట్లు వేస్తున్నారు. ఆగస్టు చివరి వారం వరకు నాట్లు వేసే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురిసి వనరులు నిండి మత్తళ్లు పోసినప్పుడే ఆయకట్టు రెండు పంటలకు పుష్కలంగా సాగునీరందుతుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అప్పుడే చేపల పెంపకానికి అనుకూలంగా ఉంటుందని... వర్షాభావ పరిస్థితులు ఎదురైతే తమకు ఉపాధి కష్టతరంగా మారుతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సగం కూడా నిండలే**

తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) వివరాల ప్రకారం జూన్ 1 నుంచి ఆదివారం నాటికి జిల్లా వ్యాప్తంగా 271.3 మిల్లీమీటర్ల సగటు సాధారణ వర్షపాతానికి 220 మి.మీ. కురిసి సాధారణ వర్షపాతం నమోదైంది. నీటిపారుదలశాఖ అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం 60 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే 1,225 చెరువుల్లో 947 వనరులు 0-50శాతం, 274 చెరువులు 50-100శాతం మేర నిండాయి. నాలుగు మాత్రమే అలుగు పారుతున్నాయి.

16 రోజుల పాటు కురిసిన వర్షాలకు 23 మండలాల్లో మోతె మండలంలో సాధారణం 213.4 మి.మీ.కుగాను 270.8 మి.మీ.తో అధిక వర్షపాతం నమోదైంది. 11 మండలాల్లో సాధారణ సగటు వర్షపాతం నమోదు కాగా 11 మండలాల్లో లోటు నమోదైంది.

జిల్లా వ్యాప్తంగా 4.82 లక్షల ఎకరాల్లో వరిసాగు అవుతుందని వ్యవసాయాధికారుల అంచనా. ప్రస్తుతానికి 2.70 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. ఇంకా సమయం ఉండటంతో మరో లక్ష ఎకరాల్లో నాట్లు పడే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.


**తప్పని ఆందోళన**

వర్షాలు ముఖం చాటేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల వర్షాలతో చెరువుల్లోకి కొంత మేర వరద వచ్చింది. దీంతో బావులు, బోర్లలో భూగర్భ జలాల వృద్ధికి దోహదపడుతున్నా.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో ఆందోళన మొదలైంది.

**ఎన్‌ఎస్పీ నీటితోనే సాగు**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఎన్‌ఎస్పీ ప్రాజెక్టు పంటలకు జీవం పోసింది. రైతులందరూ దానిపై ఆధారపడి నాట్లు వేస్తున్నారు. ఆ నీటిని విడుదల చేయకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. వర్షాలు కురిస్తేనే అన్నదాతలకు ప్రయోజనం.

# చలానా అధికారికం.. ఖర్చులు అ'ధనం'



సూర్యాపేట :సూర్యాపేట నియోజకవర్గంలోని ఓ తహసీల్ కార్యాలయంలో ఇటీవల తండ్రి పేరిట ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిని తన కుమార్తెకు తెలియకుండా కుమారుడి పేరిట పట్టా చేయించాడు. నిబంధనల ప్రకారం ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో పాటు కుటుంబ సభ్యుల సంతకాలతో కుమారుడికి గిఫ్ట్ డీడ్(వారసత్వం) కింద పట్టా చేయాల్సి ఉంది. కుమార్తె ప్రేమ వివాహం చేసుకుని వెళ్లిపోవడంతో ఈ వ్యవహారాన్ని మధ్యవర్తి ద్వారా గుట్టు చప్పుడు కాకుండా పట్టా చేయించాడు. అందుకు ఎకరానికి రూ.10 వేల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. వ్యవసాయ భూములకు సంబంధించి తహసీల్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు వసూళ్ల పర్వం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్‌కు ఒక రోజు ముందే బుక్ చేసుకోవాల్సి ఉంది. నిర్దేశిత సమయం మేరకు తహసీల్ కార్యాలయానికి చేరుకున్నట్లయితే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కార్యాలయం, స్లాట్ బుక్ విధానం తదితర ఖర్చుల పేరిట రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో మధ్యవర్తిది ప్రధాన పాత్ర.

**రిజిస్ట్రేషన్లకు వసూళ్ల పర్వం**

జిల్లాలో 23 మండలాలు ఉండగా అందులో రోజుకు 70 నుంచి 80 వరకు భూ క్రయ విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అందులో ఆన్‌లైన్‌లో చలానా చెల్లించినా ఆపరేటర్లు చేసే వసూళ్లలో ఉన్నతాధికారులకూ వాటాలు ఉంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో స్లాట్ బుక్ చేస్తే సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల తహసీల్ కార్యాలయాల తనిఖీలు, ఏసీబీ దాడుల నేపథ్యంలో ఈ తతంగం మరింత గోప్యంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**సమస్యలతో మరింత జాప్యం**

జిల్లా అంతట కూడా పాస్ పుస్తకం ముద్రించే ప్రింటర్లు చెడిపోయాయి. అర్వపల్లిలో మాత్రమే పని చేస్తుంది. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేస్తున్నారే కాని పట్టా పుస్తకంలో ప్రింట్ మాత్రం ఇవ్వటం లేదు. నేరేడుచర్ల తహసీల్ కార్యాలయంలో పట్టాదారు పాస్‌బుక్ ప్రింటర్ మరమ్మతులకు తీసుకువెళ్లి ఏడాది దాటినా ఇంతవరకు తిరిగి రాలేదు. జులై నెలలో 128 మంది స్లాట్‌లు బుక్ చేసుకోగా 125 మంది రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా మూడింటికి వారు రాక ఆగాయి.

**చర్యలు తీసుకుంటాం**తహసీల్ కార్యాలయాల్లో భూ రిజిస్ట్రేషన్లకు అదనంగా వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. బాధితులు లిఖిత పూర్వకంగా ఆధారాలతో ఫిర్యాదు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రాంబాబు, అదనపు కలెక్టర్, సూర్యాపేట

# సర్వేకు సర్వర్ చిక్కులు!




నకిరేకల్: జిల్లాలో విస్తృతంగా అమలైన స్వచ్ఛ భారత్ కార్యక్రమాలపై పౌరుల అభిప్రాయాలు సేకరించే కేంద్ర ప్రభుత్వ ఫీడ్‌బ్యాక్ సర్వే సర్వర్ చిక్కులతో ముగిసింది. పది రోజుల నుంచి మండల, గ్రామ స్థాయిల్లో అధికారులు, సిబ్బంది 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ-25' ఫీడ్‌బ్యాక్ సర్వే యాప్‌ను స్థానికుల చరవాణుల్లో డౌన్‌లోడ్ చేయించి వారు సర్వేలో భాగస్వాములయ్యేలా చేశారు. సర్వర్ సమస్యలతో నెట్‌వర్క్ ఎర్రర్ రావడంతో దీనిలో ఎక్కువ మంది పాల్గొనలేకపోయారు.

**20 శాతం మందితోనే ముగింపు**

పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఉపాధి క్షేత్ర సహాయకులు, అంగన్‌వాడీ టీచర్లు ప్రతి గ్రామంలో 150 మంది స్థానికుల చరవాణిల్లో యాప్ డౌన్‌లోడ్ చేయించి ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయించాలని లక్ష్యంగా విధించారు. ఉదయం 7 నుంచి 9, రాత్రి 7 గంటల తర్వాతే యాప్ ఓపెన్ కావడంతో జిల్లాలో 20 శాతం మందే సర్వేలో పాల్గొనడం గమనార్హం. ఎక్కువ మంది దీనిలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు అందిస్తే స్వచ్ఛభారత్ కార్యక్రమాలను మరింత పటిష్ఠంగా అమలు చేసి మార్పులు చేర్పులకు వీలుంటుంది.

**అడిగిన అంశాలు ఇవీ..**

గ్రామంలో అన్ని ఇళ్లకు మరుగుదొడ్లు ఉన్నాయా.
బహిరంగ మల విసర్జన ఉందా.
మరుగుదొడ్ల మలాన్ని కాల్వలు, నాలా, నది, చెరువుల్లోకి మళ్లిస్తున్నారా.
ఘన వ్యర్థాల రవాణా
ఇంటింటికి రోజు చెత్త సేకరిస్తున్నారా.
?గ్రామం మొత్తంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై మీ అభిప్రాయం.
మురుగు నీటిని తరలించడానికి ఉన్న ఏర్పాట్లు.
చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేసే ప్రాంతాలు
వ్యర్థాలు దహనం చేసిన ఘటనలు.
ఐదేళ్లలో పారిశుద్ధ్య పరిస్థితుల్లో మీరు గమనించిన మార్పు.
గ్రామంలో చేపట్టిన చర్యలపై సంతృప్తిగా ఉన్నారా
భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలు.

జిల్లాలో 868 గ్రామ పంచాయతీల్లో 1,30,200 మందితో యాప్ డౌన్‌లోడ్ చేయించి వారి నుంచి అభిప్రాయాలు నమోదు చేయించాలన్నది లక్ష్యం. సర్వే ముగియగా.. 26,468 (20.32 శాతం) మంది నుంచి మాత్రమే అభిప్రాయాలు సేకరించారు. సర్వర్ సమస్యలతోనే సర్వేలో ఎక్కువ మంది నుంచి ఫీడ్‌బ్యాక్ రాబట్టలేకపోయామని స్వచ్ఛభారత్ మిషన్ అధికారి ఒకరు వివరించారు.

# కంట పడితే కటకటాలే!

తూప్రాన్: నేరాల నియంత్రణలో భాగంగా తూప్రాన్‌లో తొలిసారిగా ఏఐ కెమెరాలు ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పట్టణంలో ఒక్కోదానికి రూ.1.50 లక్షలు వెచ్చించి తొమ్మిది కెమెరాలను బిగించారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలు, ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకునే ప్రాంతాల్లో వినియోగంలోకి తీసుకొచ్చారు. పురపాలిక నిధులు రూ.6 లక్షలు, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా రూ.7.50 లక్షలు నిధులు సమీకరించారు. త్వరలోనే జిల్లాలోని మరిన్ని పట్టణాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలోనూ తూప్రాన్ పట్టణంలోని పలు కాలనీల్లో సుమారు రూ.2 కోట్లతో వివిధ రకాల కెమెరాలను ఏర్పాటు చేయగా ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి.

**తప్పించుకునే అవకాశమే లేదు**



ఏఐ కెమెరాలు వాహనాల నంబర్ ప్లేట్లలోని సంఖ్యను స్పష్టంగా(చీకట్లో అయినా కూడా) కనిపెడుతోంది. నంబరు కొడితే వాహనం ఆ కెమెరాలో ఎన్నిసార్లు నిక్షిప్తం అయిందో కూడా పసిగడుతోంది. ఎంత మంది ప్రయాణిస్తున్నారో గుర్తిస్తోంది. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో నిందితులు తప్పించుకునే అవకాశమే లేదు. మొదట్లో తూప్రాన్‌లో ఏర్పాటు చేసిన నాలుగు కెమెరాల పనితీరు బాగుండటంతో నూతనంగా నర్సాపూర్ చౌరస్తా, పోతరాజ్‌పల్లి కమాన్, నాగులపల్లి వంతెనతో పాటు రెండు ప్రధాన కూడళ్ల వద్ద వీటిని అమర్చారు.

**నిరంతర పర్యవేక్షణ: శివానందం, ఎస్సై, తూప్రాన్**

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఏఐ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం. మొదటగా తూప్రాన్‌లో నాలుగు కెమెరాలు ఏర్పాటు చేశాం. ఫలితం కనిపించడంతో దాతల సహాయంతో మరో అయిదు అమర్చాం. నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాం. నిరంతరం పర్యవేక్షణ చేస్తూ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

# దండిగా నిధులు.. అడుగుపడని పనులు

సంగారెడ్డి : అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 25 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో ఒక్క కేంద్రానికి మాత్రమే సొంత భవనం ఉంది. మిగతా చోట్ల అద్దె గదుల్లో నిర్వహణ ఇబ్బందిగా మారింది. కంది మండలం వడ్డెనగూడ తండా, ఎర్దనూర్ తండా, బేగంపేట గ్రామ గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేవు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాల్లోని గదుల్లో వీటిని నిర్వహిస్తున్నారు.ఉపాధి పథకం ద్వారా రూ.10.36 కోట్లు మంజూరు

గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఏడాది రూ.10.36 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేసింది. నిధులొచ్చి రెండు నెలలైనా జిల్లాలో ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు. స్థలాలు గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాల్సి ఉండగా ఆ దిశగా అడుగులు పడటం లేదు. ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు, ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి రూ.8 లక్షల చొప్పున మంజూరు చేశారు.

**అద్దె భవనాల్లో ఇబ్బందులు**

జిల్లాలో 1504 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 577 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. మిగతావి స్థానిక పాఠశాలల శిథిల గదులు, అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

జిల్లాలో ప్రస్తుతం 631 పంచాయతీలు ఉండగా.. 208 పంచాయతీలు అద్దె గదులు, ప్రభుత్వ పాఠశాలల భవనాల్లో నిర్వహిస్తుండటం ఇబ్బందిగా మారింది.

నిధుల కేటాయింపులిలా.. (2025-2026)
మంజూరైన పంచాయతీ భవనాలు: 27
నిధుల కేటాయింపు: రూ.5.40 కోట్లు
అంగన్‌వాడీ భవనాలు: 62
నిధుల మంజూరు: రూ.4.96 కోట్లు

త్వరలో పనులు చేయిస్తాం

జిల్లాలో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ఈ ఏడాది మే నెలలో ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయి. వాటికి స్థల సేకరణ కొనసాగుతోంది. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.యుగంధర్, పీఆర్, ఈఈ

# మూతపడిన పాఠశాలలు తెరచుకునేనా?

సంగారెడ్డి : విద్యార్థులు లేకపోవడంతో చాలా చోట్ల పాఠశాలలు మూతపడ్డాయి. కొన్ని చోట్ల ఏళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఇలాంటి పాఠశాలల సమీపంలోని విద్యార్థుల వివరాలు సేకరించి.. వాటిని తెరిపించేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

**ఖేడ్, అందోలులో అధికం**

జిల్లాలో విద్యార్థులు లేకపోవడంతో 68 పాఠశాలలు మూతపడ్డాయి. వీటిలో ఎక్కువగా ప్రాథమిక పాఠశాలలే ఉన్నాయి. కొన్ని చోట్ల విద్యార్థులు తక్కువగా ఉండటంతో పక్క పాఠశాలల్లో విలీనం చేశారు. బదులు మూసేయడంతో ఉపాధ్యాయ పోస్టులు కూడా రద్దయ్యాయి. మూతబడిన పాఠశాలలు నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. ఏళ్లుగా పాఠశాలల గదులు వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. మొదట ఈ గదులను శుభ్రం చేయించాలని అధికారులు ఆదేశించారు. తర్వాత సమీపంలోని విద్యార్థులను గుర్తించి వీటిలో చేర్పించాలి. పక్క పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై ఇక్కడికి నియమిస్తారు. అన్ని పాఠశాలలు తెరిపించేలా ఎంఈవోలు చొరవ తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థులు చేరితే పుస్తకాలు, రాత పుస్తకాలు, సమ దుస్తులతో పాటు.. మధ్యాహ్న భోజనాన్ని కూడా అమలు చేస్తారు. మూతపడిన పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి.. త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

# పత్తి అమ్మకాలకు సాంకేతిక దన్ను

ఆదోని : పత్తి కొనుగోళ్లలో అక్రమాలను నిరోధించేలా సాంకేతికతను వినియోగించుకోవాలని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నిర్ణయించింది. ఇందుకోసం సరికొత్తగా 'కపాస్ కిసాన్ యాప్'ను తెరపైకి తీసుకొస్తోంది. దీనిద్వారా రైతులు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకుని పత్తి అమ్మకాలు చేసుకునేలా అవకాశం కల్పించారు. వాస్తవానికి గతేడాదే దీనిని అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ సరైన ప్రచారం లేకపోవడంతో ఆచరణ సాధ్యం కాలేదు. ఈ ఏడాది పత్తి సీజన్‌లో దీనిని పకడ్బందీగా అమలుచేయాలని సంస్థ ప్రతినిధులు సంకల్పించారు.

**నమోదు ఇలా..**'కపాస్ కిసాన్ యాప్'ను ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత చరవాణికి ఓటీపీ నంబరు వస్తుంది.. దీనిని నమోదు చేయాలి. అనంతరం రైతు తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆధార్ సంఖ్య, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాసుపుస్తకం నంబరు, ఎన్ని ఎకరాల్లో పత్తి సాగు చేశారు.. ఎప్పుడు అమ్మాలనుకున్నారన్న తేదీని రైతులే ఎంపిక చేసుకునే వెసులుబాటును సీసీఐ కల్పించింది.

**మద్దతు ధర రూ.8,110**

2025-26 ఆర్థిక సంవత్సరంలో పత్తి ధర క్వింటా రూ.8,110 మద్దతు ధరగా సీసీఐ ప్రకటించింది. గతేడాది (2024-25) క్వింటా రూ.7,521గా ఉండేది. ఈసారి క్వింటాపై రూ.589 పెంచింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి సాధారణ సాగు 2.34 లక్షల హెక్టార్లు కాగా 2.17 లక్షల హెక్టార్లలో సాగైంది. ఎకరాకు ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల పత్తి దిగుబడి రావొచ్చని అంచనా. ఉమ్మడి జిల్లాలో గతేడాది ఆరు పత్తి కొనుగోలు కేంద్రాలను సీసీఐ ప్రారంభించింది. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయంలో మాత్రమే వ్యాపారం జరిగింది. 17 వేల మంది రైతుల నుంచి 4.04 లక్షల క్వింటాళ్లను నిర్వాహకులు కొనుగోలు చేసి రైతులకు రూ.297 కోట్ల



మేర చెల్లింపులు చేశారు. పత్తి కొనుగోళ్లలో ఆదోని ప్రాంతమే కీలకం కానుంది. గతేడాది ఏడు వేల మంది రైతుల నుంచి 1.70 లక్షల క్వింటాళ్ల వరకు పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. ఈసారి ఎన్ని కేంద్రాలు ఏర్పాటుచేస్తారన్నది త్వరలో తేలనుంది. ఇందుకోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహణ కమిటీ వేసిన తర్వాత కేంద్రాలను ఎంపిక చేస్తారు. గతేడాది పరిశ్రమల కేంద్రంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈసారి ఎలాంటి విధానం అనుసరిస్తారన్నది వేచి చూడాల్సి ఉంది.

**అంతర్జాల విధానం ఉన్నా..**

ఇప్పటికే అంతర్జాల విధానం అమలులో ఉన్నప్పటికీ అక్రమాలు మాత్రం ఆగడం లేదు. సీసీఐ కేంద్రాల్లో నమోదు సేవలు ఏర్పాటుచేసి రైతులను చైతన్యపరిచినప్పటికీ దళారుల బెడద వదలడం లేదు. పలువురు అక్రమార్కులు రైతుల వద్ద తక్కువ ధరకే పత్తి కొనుగోలు చేసి వారి పేరుతో సీసీఐ కేంద్రాల్లో ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. గతేడాది సైతం పలుచోట్ల అక్రమాలు జరగ్గా.. విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు.

# బకాయి.. ఎందుకా 'బడా'యి

విజయనగరం : 'ఇటీవల చీపురుపల్లి నియోజకవర్గంలోని ఓ బ్రాంచి పరిధిలో బకాయిలు వసూలు చేసేందుకు ఓ అధికారిణి తన సిబ్బందితో వెళ్లారు. ఈక్రమంలో ఓ నాయకుడు 15 మందిని వెనకేసుకొచ్చి బెదిరించాడు. నా ఇంటికే వస్తావా అంటూ దౌర్జన్యానికి దిగాడు. ఇలాంటి ఘటనలే మరో రెండు చోట్ల జరిగాయి.' జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో మొండి బకాయిలు పేరుకుపోవడానికి గల కారణాల్లో ఇవి కొన్ని. ఈ నేపథ్యంలో కొరడా ఝుళిపించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం రెండు జిల్లాల్లో రూ.91.56 కోట్ల మేర బకాయిలు ఉండిపోయినట్లు తెలుస్తోంది. బడా నాయకుల వద్ద పెద్ద మొత్తాల్లో డబ్బులు ఉండిపోయాయన్న ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చాలామందికి అందించారు. వారి నుంచి చెల్లింపులు నిలిచిపోయాయి. వసూళ్లకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. రికవరీ కోసం నోటీసులు జారీ చేస్తున్నా పురోగతి లేకుండా పోతోంది. కూటమి ప్రభుత్వం రాకతో నాన్ అఫీషియల్




కమిటీలు ఏర్పాటు చేసింది. దీంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**ఎస్టీయేతర రుణాల్లోనే..**

పంట, ఎస్టీయేతర రుణాలకు ఏడాది, టెర్మ్ చెల్లింపులకు ఆరు నెలల వరకు గడువు ఉంటుంది. ఆ తరువాత చెల్లించకపోతే మొండి బకాయిగా పేర్కొంటారు. ఎస్టీయేతర రుణాల్లో ఎక్కువగా పేరుకుపోయాయి. నిబంధనల ప్రకారం తొలుత రుణగ్రహీతలకు ఫారం-2 జారీ చేస్తారు. స్పందించకపోతే చర ఆస్తులను జప్తు చేస్తారు. అనంతరం స్థిర ఆస్తులను సీజ్ చేసేందుకు ఫారం-6 ఇస్తారు. చివరగా భూముల వేలానికి ఫారం-8, 9 ఇవ్వాలి. ఈ ప్రక్రియలేవీ జరగడం లేదు. బకాయిదారులు వాయిదా కోరుతుండడం, ఉద్యోగులు, సిబ్బందిని పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది.

దౌర్జన్యాలకు దిగితే కేసులు .. రాజకీయాలకు అతీతంగా వసూళ్లకు చర్యలు తీసుకుంటాం. సెప్టెంబరులోగా కట్టకపోతే ఆస్తులు వేలం వేస్తాం. ఉద్యోగుల మీద దౌర్జన్యాలకు దిగితే పోలీసు కేసులు పెడతాం. ఈమేరకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

కిమిడి నాగార్జున, డీసీసీబీ ఛైర్మన్

# కాటికి.. 'కష్టాలే' నేటికి



భీమవరం : వయ్యేరు(యనమదుర్రు)ను ఆనుకుని ఉన్న తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ, అత్తిలి మండలంలో వరిఘేడు గ్రామాల్లో శ్మశానవాటికలు లేక వయ్యేరు కాలువగట్టును ఆనుకుని అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో గట్టుపైకి నీరు చేరితే శవాన్ని తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని, గోతులు తవ్వినా నీరు వచ్చేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తున్నది డంపింగ్ యార్డు కాదు. సిద్ధాంతం వశిష్ఠ గోదావరి గట్టు. దీనిని ఆనుకునే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. దక్షిణ కాశీగా పేరొందడంతో 20 గ్రామాల ప్రజలు ఇక్కడికే వస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల చెత్తను ఇక్కడే డంపింగ్ చేస్తుండటంతో దహన సంస్కారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు అంటున్నారు. బతికున్నంత కాలం ఎన్ని కష్టాలు పడినా ఆఖరి మజిలీలోనూ అవస్థలు తప్పడం లేదు. చాలా గ్రామాల్లో శ్మశానవాటికలు లేకపోవడంతో కాలువ గట్లు, రహదారులపైనే దహన సంస్కారాలు చేస్తున్నారు. వర్షాకాలంలో మృతదేహాలను మరుభూమికి తరలిస్తున్న వారి బాధలు వర్ణనాతీతం. మనిషి చనిపోయాడన్న బాధకంటే అంత్యక్రియలు చేసేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైకుంఠధామాల్లో అంత్యక్రియలు నిర్వహించేందుకు షెడ్డు, భవనం ఉండాలి. వచ్చిన వారు కూర్చునేందుకు బల్లలు, స్నానం చేసేందుకు నీటి సౌకర్యం ఉండాలి. చాలాచోట్ల శ్మశానాలు లేకపోగా, ఉన్నవాటిలో వసతులు లేవు. మూడేళ్ల కిందట నరసాపురంలో వశిష్ఠ గోదావరిని ఆనుకుని రూ.5 కోట్లతో మోక్షధామం నిర్మిద్దామని పనులు మొదలుపెట్టినా వివిధ కారణాలతో నిలిచిపోయింది. పనుల కోసం తెచ్చిన ఇసుక, ఇటుక, ఇనుము, ఇతర సామగ్రి కొంతమంది పట్టుకెళ్లిపోయారు.

పాలకోడేరు మండలం, కొండేపూడి గ్రామానికి చెందిన హిందూ శ్మశానవాటికకు పంట కాలువను దాటుకుని వెళ్లాలి. మృతదేహాలను పడవలు, బోట్లపై తీసుకెళ్లాలి. వర్షాకాలంలో నీరు పోటెత్తినప్పుడు బోట్లు తిరగబడిన సందర్భాలున్నాయి.

**వరదొలొస్తే అవస్థే**

మొగల్తూరు మండలం నెల్లిపల్లవపాలెంలో శ్మశానవాటికకు వెళ్లేందుకు దారిలేదు. తోటలు దాటుకుని వెళ్లాలి. భీమవరం మండలం గొల్లవానితిప్పలో యనమదుర్రు డ్రెయిన్‌పై, పాలకోడేరు మండలం మోగల్లులో గోస్తనీ కాలువగట్టుపై అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. గోదావరికి వరదలొచ్చినప్పుడు నరసాపురంలో బుడ్డిగవానిరేవు దగ్గర శ్మశానవాటిక ముంపుబారిన పడుతోంది.

**వసతుల కల్పనకు అవకాశం**

ఉపాధి హామీ పనుల్లో భాగంగా శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంది. బర్నింగ్ ఫ్లాట్‌ఫామ్, వేచి ఉండే గదితో పాటు స్నానాలకు, సామగ్రి భద్రపరచు, ఆచార వ్యవహారాలు నిర్వహించుకునేందుకు వసతులు సమకూరతాయి. దీనికి ఆయా గ్రామాల నుంచి ప్రతిపాదనలు పంపించాలని డ్వామా పీడీ అప్పారావు తెలిపారు.

# ప్రతి గేటు వద్ద వంతెన



ఆకివీడు : ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన విద్యుదీకరణ, డబ్లింగ్ లైన్లు తదితర పనులు పూర్తయిన తర్వాత పాసింజర్, గూడ్సుతో పాటు వేగంగా నడిచే రైళ్ల రాకపోకల సంఖ్య పెరిగింది. దీంతో తరచు రైల్వే గేట్లు మూయాల్సి వస్తుంది. ఆ సమయంలో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని పరిష్కరించే దిశగా 2027 నాటికి అన్ని చోట్లా వంతెనల నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించింది. దీంతో రాష్ట్రంలో కొన్ని నెలలుగా దఫదఫాలుగా ఆ శాఖ అధికారులు రైల్వే గేట్లున్న ప్రాంతాలను పరిశీలించి ఆర్‌యూబీ(దిగువ), ఆర్వోబీ(పైవంతెన)ల్లో ఏ నిర్మాణానికి అనుకూలమనే అంశాలను ఆరా తీస్తున్నారు. స్థానిక పరిస్థితులు, ట్రాఫిక్ రద్దీ, స్థల లభ్యతను దృష్టిలో పెట్టుకుని స్థానికులు, అధికారులతో చర్చిస్తున్నారు. కనీసం రెండు వరుసల మార్గంతో నిర్మించేందుకు అనువుగా స్థల సేకరణ చేసేలా అంచనా వేసి వాటి తయారికీ కృషి చేస్తున్నారు.

12 చోట్ల.. పశ్చిమ, ఏలూరు, కృష్ణా జిల్లాల పరిధిలోని మండవల్లి, కైకలూరు, ఆకివీడు, ఉండి, భీమవరం, కుముదవల్లి తదితర ప్రాంతాల్లోని సుమారు 12 రైల్వే గేట్లను విజయవాడ నుంచి వచ్చిన రైల్వే ఎస్ఎస్ఈ ఎస్.శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారుల బృందం పరిశీలించింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. విజయవాడ డివిజన్ పరిధిలోని గూడూరు-అనకాపల్లి స్టేషన్ల మధ్య 432 రైల్వే గేట్లు ఉన్నాయి. వాటికి సంబంధించి ఇప్పటికే సుమారు 200 గేట్ల పరిశీలన పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. వీరవాసరం రైల్వే గేటును అధికారులు పరిశీలించారు. ఆర్వోబీ నిర్మాణంతో నష్టపోయే ప్రైవేటు, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులకు రైల్వే శాఖ పరిహారం అందిస్తుందన్నారు. వారి వెంట ఆర్అండ్‌బీ డీఈ బీవీ.రమణ, ఏఈ డీఎస్ఎన్.మూర్తి, ట్రాన్స్‌కో ఏఈ ఆర్‌వీ.అప్పారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వల్లీహారిక తదితరులు ఉన్నారు.

# బాల్యం మురిసింది.. తెలుగుదనం విరిసింది!



కలిదిండి : బాల్యం మురిసింది. తేనెలొలుకు తెలుగు పదాల మాధుర్యం రుచి తెలిసింది. బడి ఆవరణలు తెలుగు పలుకుల మృదు సవ్వడితో పులకరించాయి. ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో శుక్రవారం నిర్వహించిన 'తెలుగు భాషా దినోత్సవం'లోని తీయని అనుభూతులివి. జీవితం సార్థకత కావాలంటే మాతృభాషను నరనరాన జీర్ణించుకోవాలని కలిదిండి ఎంఈవో-2 అనిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆరుతెగలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 'తెలుగు గొప్పదనం' అంశంపై నిర్వహించిన వ్యాస రచన, పద్య పఠన పోటీల్లో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాస రచనలో జి.భార్గవి, జి.సురేంద్రకుమార్, పద్య పఠనలో సీహెచ్ యశ్విత, ఎ.జ్యోత్స్నప్రియలను విజేతలుగా ప్రకటించారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం నున్న శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విజేతలకు బహుమతులందించారు. పెదపాలపర్రు.. జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు వెలుగులు ప్రసరించాయి. పద్య పఠనం పోటీల్లో భాగంగా కమ్మని తెలుగు పద్యాలు వల్లించడానికి చిన్నారులు పోటీ పడ్డారు. క్లిష్టతరమైన పద్యాలను సులభంగా.. స్పష్టంగా పలుకుతూ మైమరపించారు. మధురమైన గేయాలు ఆలపించారు. తెలుగు తల్లి వేషధారణలో బి.మాధురి ప్రదర్శించిన తెలుగు తల్లి ఆత్మకథ ఆలోచింపజేసింది. దీపిక, ప్రవల్లిక, సుహానా సుల్తానా, రుఖియా, కరిష్మా విజేతలుగా నిలిచారు. విశ్రాంత డీవైఈవో వెంకటేశ్వరరావు, హెచ్.ఎం. ఎన్.ఎల్. రాజేశ్వరి, తెలుగు ఉపాధ్యాయిని సుజాత విజేతలకు బహుమతులు అందించారు. ఆగిరిపల్లి.. జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యవహార భాషా ఉద్యమకర్త గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ఒకరిని మించి ఇంకొకరు అక్షర బాణాలు సంధించారు. రామ్మూర్తి పంతులుపై భక్తి, తెలుగుపై అనురక్తిని రగిలించారు. 40 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో కారుకొండ లక్ష్మి, జంగం లహరి, మకాణి లిఖితా రాణి ప్రతిభను చాటారు. హెచ్.ఎం పి.పుష్పలత, తెలుగు ఉపాధ్యాయులు వై.రాజేశ్వరి, వి.అగస్టీన్ విజేతలను అభినందించారు.

# పేరు గొప్ప.. తీరు డబ్బా!

నరసాపురం : పశ్చిమగోదావరి జిల్లాలో చించినాడ నుంచి లోసరి వరకు దాదాపు 42 కిలోమీటర్ల మేర ఉన్న 216వ నంబరు జాతీయ రహదారి అధ్వానంగా మారింది. చిట్టవరం- లోసరి మధ్య ఈ మార్గంలో తరచూ గుంతలు ఏర్పడుతున్నాయి. రాత్రి వేళ ఇవి వాహన చోదకుల పాలిట ప్రమాదకరంగా మారుతున్నాయి. దిగమర్రు- నరసాపురం మధ్య ఏర్పడిన గుంతలో పడటంతో ఇటీవల పట్టణానికి చెందిన ద్విచక్ర వాహన చోదకుడికి కాలు విరిగింది. ఈ రహదారికి మరమ్మతులు చేసినా కొన్ని రోజులకే రాళ్లు పైకి లేచి గుంతలు పడుతున్నాయి. ఈ సమస్యను జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు(మచిలీపట్నం) ఏఈ వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు.

నరసాపురం- దిగమర్రు మధ్య 216వ నంబరు జాతీయ రహదారిపై గుంత ఏర్పడటంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో స్థానికులు ప్రమాద సూచికగా ఇలా ఓ రేకు డబ్బా ఉంచారు.

# పరుగు వేగాన.. పారాది వంతెన

బొబ్బిలి: వేగావతి నదిపై బొబ్బిలి మండలం పారాది వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు వర్షాకాలంలోనూ శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే మార్చి నాటికి పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఏడు పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. ఇరువైపులా రోడ్డును కలిపే పిల్లర్ల పనులు జరుగుతున్నాయి. మట్టి కోతకు గురికాకుండా మరింత పటిష్ఠంగా చేపడుతున్నారు. ఇవి పూర్తయ్యాక స్లాబుకు సంబంధించిన పనులు మొదలు పెడతారు. అనంతరం స్లాబు ప్రారంభించాల్సి ఉంది. వంతెన మొత్తం వ్యయం రూ.13.40 కోట్లలో.. ఇంతవరకు రూ.6.30 కోట్ల మేర పనులు జరిగినట్లు నివేదికల్లో పేర్కొంటున్నారు.

గతేడాది అక్టోబరులో పనులు ప్రారంభమయ్యాయి. ఇంతవరకు 55 శాతం మేర పూర్తయినట్లు చెబుతున్నారు. కీలకమైన బేస్‌మెంట్, పిల్లర్ల నిర్మాణాలు చేపట్టారు. బిల్లుల్లో జాప్యం లేకుండా ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే బేబినాయన భరోసా ఇవ్వడంతో వేగం పెంచారు. శ్లాబులు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాలు



సహకరిస్తే వేగవంతమయ్యే అవకాశముంది. పనులు చేపట్టిన ప్రదేశంలో పాత విద్యుత్తు స్తంభాలు, నియంత్రికల తొలగింపునకు రూ.63 లక్షలు, అప్రోచ్ రోడ్లు, కాజ్ వే నిర్మాణానికి రూ.కోటి ఖర్చుచేశారు. ఇటీవల ఆయా బిల్లులను ప్రభుత్వం విడుదల చేసింది. ఇంకా మిగిలినవి చెల్లించాల్సి ఉంది.సకాలంలో పూర్తికి చర్యలు.. వంతెన పనులను నిర్దేశిత వ్యవధిలోగా పూర్తిచేస్తాం. పిల్లర్ల నిర్మాణం పూర్తిచేశాం. వర్షాలు పడుతున్నా పనులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. నాణ్యతలో రాజీ లేకుండా చేపడుతున్నాం.అప్పలరాజు, ఏఈ, ర.భ.శాఖ, బొబ్బిలి సెక్షన్

# పశువుల బీడు.. మేసేశారు చూడు!

వెలిగండ్ల : కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్ల మండలం పాపిరెడ్డిపల్లిలో మూగ జీవాల కోసం కేటాయించిన భూములపై అక్రమార్కుల కన్ను పడింది. యథేశ్ఛగా ఆక్రమించుకుని వాటాలు పంచుకునేందుకు సిద్ధమైన సమయంలో గ్రామస్థులు, పశువుల కాపరులు అడ్డుకున్నారు. గ్రామంలోని సర్వే నంబరు 104-2లో వారం రోజులుగా రాజకీయ పలుకుబడి కలిగిన కొందరు యంత్రాలతో చెట్లు మొత్తం తొలగించి చదును చేశారు. ఈ విషయమై గ్రామస్థులు వీఆర్వోకు తెలియజేసినా.. పట్టించుకోలేదు. దీంతో పది మంది కలిసి నాకింత నీకింత అంటూ.. మొదట 20 ఎకరాలను ఆక్రమించి వాటిని ఇప్పటికే వాటాలు వేసుకున్నారు. అదే విధంగా కూడా మరో పది ఎకరాల భూమిని చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకుని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

**అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థుల ఆవేదన**

సర్వే నంబరులో 104-2లో పశువుల బీడు భూమిగా దస్త్రాల్లో నమోదై ఉందని.. ఆక్రమణదారులు దొంగ పట్టాలు సృష్టించి కాజేసేందుకు ఇలా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. రెవెన్యూ అధికారులకు తెలియజేస్తే డొంక తిరుగుడు సమాధానాలు చెబుతూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతల కాలం నుంచి బీడు పొలంలోనే పశువులను మేపుకొంటూ.. ఇక్కడే ఉన్న కుంటల్లో నీళు తాగించే వాళ్లమని, ఆక్రమణదారులు గడ్డి, చెట్లను తొలగించి, నీటి



కుంటలను యంత్రాలతో పూడ్చి వేసినట్లు తెలిపారు. సుమారు రూ.కోటి విలువ చేసే భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రెవెన్యూ అధికార్లు పశువుల బీడు భూమిని కాపాడాలని కోరారు. ఈ విషయమై వెలిగండ్ల తహసీల్దార్ వాసును వివరణ కోరగా... భూ ఆక్రమణపై గ్రామస్థులు ఫిర్యాదు చేశారన్నారు. కొంత మేర ఆక్రమణకు గురైందని, సంబంధిత వ్యక్తులతో మాట్లాడితే తెలియక ఆ భూమిలోకి వచ్చామని చెబుతున్నారన్నారు. అందుకే రికార్డులు పరిశీలించే వరకు ఎలాంటి పనులు చేయవద్దని హెచ్చరించామన్నారు. సెంటు కూడా పశువుల బీడు భూమిని వదలబోమని ఆయన స్పష్టం చేశారు.


# పండుటాకులకు భరోసా!

ఒంగోలు : వయోభారం, అనారోగ్య సమస్యలతో జీవితాన్ని సాగిస్తున్న వృద్ధులకు ప్రభుత్వం ఆరోగ్యభాగ్యం కల్పిస్తోంది. ఉచితంగా ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకు 70 ఏళ్ల వయసుపైబడిన వారందరూ అర్హులు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మూడు ఆరోగ్య బీమా పథకాలను ప్రవేశపెట్టింది. వీటిలో 70 ఏళ్లు నిండినవారికి ప్రధానమంత్రి వయోవందన యోజన పేరుతో రూ.5 లక్షలు వరకు ఉచిత వైద్యం, 70 ఏళ్ల వయసులోపు వారికి కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి కలిపి పీఎం జన ఆరోగ్య యోజన ద్వారా రూ.5 లక్షలు వరకు వైద్యం. మూడోది గిరిజనుల కోసం వనరబుల్ ట్రైబల్ గ్రూప్ పేరుతో పథకం ప్రవేశపెట్టారు. వయోవృద్ధుల పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మిగిలిన పథకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చి లబ్ధి పొందుతున్నారు.ప్రయోజనం ఇది: కార్డు ద్వారా రూ.5 లక్షల విలువైన వైద్యం ఉచితంగా పొందవచ్చు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో దేశంలో ఎక్కడైనా వైద్యం ఉచితంగా లభిస్తుంది. ఆయా ఆసుపత్రులకు వెళ్లినప్పుడు వైద్య మిత్రను కలిసి కార్డు ఇస్తే ఆన్‌లైన్‌లో చూసి అనుమతిస్తారు. ఈ విషయమై జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ ఏఎన్ఎంల ద్వారా రిజస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. ఇప్పటివరకు 5,100 మంది నమోదు చేసుకున్నారన్నారు. సొంతంగా ఎన్‌రోల్ చేసుకునేవారు వెబ్‌సైట్ ఓపెన్ చేసి వివరాలు నమోదు చేయాలి. 80 శాతం వివరాలు సరిపోతే (మ్యాచ్) ఆటోమ్యాటిక్‌గా వెంటనే కార్డు వస్తుంది. లేనిపక్షంలో నేషనల్ హెల్త్ అథారిటీ పరిశీలనకు వెళ్లాక మంజూరు చేస్తారు.వయోవృద్దులకు వరం...: 70 ఏళ్లు నిండిన వారు జిల్లాలో 1,88,722 మంది ఉన్నట్లు లెక్కలు తేల్చారు. ఆ వయసు వారిలో ఎక్కువ మంది ఏదోఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నవారే. పిల్లలు అందుబాటులో లేక, సొంతగా ఆసుపత్రులకు వెళ్లలేక, ఆర్థికపరమైన సమస్యలతో వైద్యం అందుకోలేక బాధపడుతూ భారంగా బతుకు బండిని ఈడ్చుకొస్తున్నారు.అలాంటి వారికి సాంత్వన కలిగించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వయోవందన యోజన ప్రవేశపెట్టింది. అర్హులైనవారు సచివాలయంలో ఏఎన్ఎంను కలిసి ఆధార్‌కార్డు చూపించి పేర్లు నమోదు చేసుకోవాలి. వీరికి రెండు మాసాల వ్యవధిలో గుర్తింపు కార్డు వస్తుంది. సొంతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

జిల్లాలో అర్హులైన వయోవృద్ధులు : 1,88,722

## త్వరలో భూహక్కు పత్రాలు

హిందూపురం : జిల్లాలో ఇప్పటి దాకా అన్ని విధాల భూ రీసర్వే పూర్తైన గ్రామాల భూ యజమానులకు హక్కు పత్రాలు–బీపీపీ(పట్టాదారు పాసు పుస్తకాలు) పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కాకుండా.. రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో తయారు చేసిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తారు. వైకాపా అధినేత జగన్ తన ప్రభుత్వ హయాంలో ప్రచార పిచ్చి మూలంగా.. ప్రజా ధనాన్ని మంచినీరులా ఖర్చు చేసి భూ యజమానులకు చెందిన పట్టాలపై సైతం ప్రతి పేజీలోనూ తన బొమ్మ, పార్టీ రంగులు ముద్రించి ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే రైతులు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తింది. జిల్లాలో చాలా గ్రామాల్లో భూ యజమానులు ఆ పత్రాలను సైతం తీసుకోడానికి నిరాకరించారు.




తాజాగా.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పట్లో ఇచ్చిన పత్రాలను పూర్తిగా రద్దు చేసి, వాటి స్థానంలోనే రాజముద్రతో కొత్త పుస్తకాలు ముద్రించి ఇస్తోంది.

**నిశితంగా పరిశీలన**

వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లాలో 198 గ్రామాల్లో రీసర్వే జరిగినా కొన్ని గ్రామాలకే పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలో 32 మండలాలు ఉన్నా.. అన్ని విధాల సర్వే పూర్తి అయిన 28 మండలాల్లో 120 గ్రామాల భూ యజమానులకు 60,399 మందికి ఇవ్వనున్నారు. ఈ పుస్తకాలన్నీ ఇప్పటికే ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో సిద్ధంగా ఉన్నాయి. వాటిలో ఏవైనా తప్పులు, పొరపాట్లు ఉన్నాయేమో నిశితంగా పరిశీలన చేస్తున్నారు. విస్తీర్ణం, సర్వే నంబరు, పేర్లు, సరిహద్దులు.. వంటి వాటిని పరిశీలిస్తున్నారు. ఏవైన తప్పులు దొర్లితే సరి చేస్తున్నారు. మరోవైపు.. తక్కిన గ్రామాల్లోనూ రీసర్వే కొనసాగుతోంది.

## రైతులు'పట్టు'బిగిస్తున్నారు!

హిందూపురం : దాదాపు నెల రోజులుగా బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు హిందూపురం మార్కెట్లో నిలకడగా ఉండటంతో పట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలమైనా పట్టుపురుగుల పెంపకానికి వాతావరణం సహకరిస్తుండటంతో అధిక దిగుబడి సాధిస్తున్నారు. గతంలో వర్షాకాలం వచ్చిందంటే పట్టుపురుగులు రోగాల బారిన పడి రైతులు నష్టపోయేవారు. ప్రస్తుతం పట్టుపరిశ్రమ అధికారులు వర్షాకాలంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై అవగాహన కల్పిస్తుండటంతో అందుకు అనుగుణంగా రైతులు చర్యలు తీసుకొంటున్నారు. వర్షాకాలంలో పండించిన గూళ్లు నాణ్యతగా లేవని గతంలో రీలర్లు తక్కువ ధరకు కొనుగోలు చేసేవారు. అయితే ప్రస్తుతం నాణ్యమైన గూళ్లను రైతులు



మార్కెట్కు తీసుకొస్తుండటంతో రీలర్లు కూడా వీటిని కొనుగోలు చేయటానికి పోటీ పడుతున్నారు.

**నేడు రీలర్లకు క్షేత్ర ప్రదర్శన**

స్థానిక పట్టుగూళ్ల మార్కెట్లో రీలర్లకు అవగాహన కల్పించేందుకు 'నా పట్టు నా అభిమానం' కింద ప్రాంతీయ పట్టు సాంకేతిక పరిశోధన కేంద్రం ద్వారా క్షేత్ర ప్రదర్శన ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పట్టు రీలర్లు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

మార్కెట్లో ధరలు (రూ.లలో)

గరిష్ఠం : 706
కనిష్ఠం : 458
సాధారణం : 648

మార్కెట్కు వచ్చిన పట్టుగూళ్లు: 3.5 టన్నులు
రైతులు: 28 మంది

## వడ్డించారు.. విస్మరించారు..!

చిత్తూరు : మనవాడేనని వడ్డించారు.. వృథా వృథే మిగిలింది. ఇదీ వైకాపా నేతలతో అంటకాగిన ఎస్పీడీసీఎల్ అధికారుల నిర్వాకం. గత వైకాపా ఐదేళ్ల పాలనలో విద్యుత్తు శాఖ అక్రమాలకు వేదికైంది.. జిల్లాకు చెందిన అప్పటి విద్యుత్తు శాఖ మంత్రి అండదండలతో వైకాపాతో అంటకాగిన అధికారులు అవసరం లేకున్నా ఇష్టానుసారంగా పరికరాలు కొనుగోలు చేశారు. వైకాపా పెద్దలకు కోట్లాది రూపాయలు దోచిపెట్టి మరికొంత నిధులు అంటకాగిన అధికారులు స్వాహా చేశారు. జగనన్న కాలనీ గృహాలకు విద్యుత్తు సర్వీసులకు పరికరాల కొనుగోలే ఇందుకు ఉదాహరణ. వైకాపా ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో గృహల నిర్మాణాలకు అనుగుణంగా విద్యుత్తు పరికరాలు అందజేస్తారు. గృహ నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్తు సర్వీసుకు సంబంధించి 30 మీటర్ల వైరు, ఎంసీబీ పరికరం, మీటరు బోర్డు అందజేశారు. అవసరం లేనప్పటికీ ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 80 వేల గృహాలకు మూడు వస్తువులు టెండర్ల ద్వారా రూ.2,100 చొప్పున కొనుగోలు చేసినట్లు లెక్కచూపి రూ.16.80 కోట్లు దండుకున్నారు. కొనుగోలు చేసిన కొన్ని నెలలకే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టింది. కోట్ల విలువైన పరికరాలు విద్యుత్తు శాఖ గోదాముల్లో అప్పటినుంచి వృథాగా పడి ఉన్నాయి. మీటరు బోర్డులపై జగనన్న లోగో తొలగించారు.. మీటరు బోర్డులు, సర్వీసు వైర్లు, ఎంసీబీ పరికరం గోదాముల్లో వృథాగా పడిఉన్నాయి. గృహ సర్వీసులకు వినియోగిస్తున్నాం.. అంగన్వాడీ కేంద్రాలు, నూతన గృహసర్వీసు వినియోగదారులకు వినియోగి స్తున్నాం. నిరుపయోగంగా వదిలేయం.– అమరబాబు, ఈఈ, కన్స్ట్రక్షన్ విభాగం

# ఉచిత సీటంటే చిన్నచూపు



నర్సీపట్నం : కార్పొరేట్ ఉచిత విద్య ప్రహసనంగా మారింది. జిల్లాలో ఇప్పటికే రెండు విడతల్లో పేద విద్యార్థులకు ఫ్రీ సీట్లు కేటాయించారు. ఇప్పుడు మూడో విడతలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో కొన్ని నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్రవేశాలు కల్పించకుండా తిరస్కరిస్తున్నాయి. సాంకేతిక సమస్యలతో తల్లికి వందనం పథకం వర్తింపునకు అవరోధంగా మారాయి.

విద్యా హక్కు చట్టం నిబంధనలతో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు కొన్ని రోజులుగా చర్యలు చేపడుతున్నారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ విద్యాలయాల్లో 25 సీట్ల చొప్పున కేటాయిస్తున్నారు. ఇప్పటికే రెండు దశల్లో పలు స్కూళ్లలో ప్రవేశాలకు అనుమతించారు. ఇప్పుడు నిబంధనలు సడలించి మూడో విడత అవకాశం ఇస్తున్నారు.

ఇంతకుముందు మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలల్లో చేరే అవకాశం కల్పించారు. ఇప్పుడు మూడోసారి పరిధిని పెంచి ఐదు కిలోమీటర్లలోపు వరకు చేరేందుకు వెసులుబాటు కల్పిస్తున్నారు.

**81 పాఠశాలలకు నోటీసులు** : జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు 350 ఉన్నాయి. వీటిలో తొలివిడత ప్రవేశాలు పూర్తయ్యాక 272, రెండో విడతలో 276 సీట్లు మిగిలిపోయాయి. పాఠశాలల యాజమాన్యాలు 81 మందిని చేర్చుకోలేమంటూ తిరస్కరించాయి. ఆయా పాఠశాలలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. కోర్టు జీవో ఉందంటూ యాజమాన్యాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

**రెండు విధాలా నష్టం..:** కొందరు తల్లులకు ఫ్రీ సీట్లు కేటాయించినట్లు సమాచారం అందింది. తీరా స్కూళ్లలో చేరేటప్పుడు వివిధ కారణాలు చూపుతూ ఆ విద్యార్థులు అనర్హులుగా పేర్కొన్నారు. సాంకేతిక లోపంతో తప్పుగా సమాచారం వచ్చిందని యాజమాన్యాలు చెప్పాయి. తమకు ఫ్రీ సీటు

అదృష్టం లేదని తల్లులు సరిపెట్టుకున్నారు. ఇలాంటి వారికి తల్లికి వందనం సొమ్ము మంజూరైనట్లు ఆన్లైన్లో వివరాలు నమోదైనా ఇప్పటికీ వీరి ఖాతాలకు నగదు జమకాలేదు. తాము రెండు విధాలా నష్టపోయామని తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్కు సమగ్ర నివేదికను ఇప్పటికే పంపామని, త్వరలో పరిష్కారమయ్యే అవకాశముందని శిక్షా ఏపీసీ జయప్రకాష్ చెబుతున్నారు.

# వృత్తి నైపుణ్యం.. అభ్యున్నతికి అవకాశం!



నర్సీపట్నం : వృత్తి నైపుణ్యాల పెంపు ద్వారా ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు పడేలా ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ సన్నద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో వృత్తి పనివారికి శిక్షణతోపాటు వ్యాపార అవకాశాలకు తోడ్పాటు అందించనున్నారు. ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో మట్టిపాత్రలకు మళ్లీ ఆదరణ లభిస్తోంది. మారుతున్న అవసరాలను పరిగణనలోకి తీసుకుని మట్టిపాత్రల తయారీకి సాంకేతికతను జోడించి విద్యుత్తుతో నడిచే చక్రాన్ని (పోర్టర్ వీల్) కుమ్మరులకు ఉచితంగా ఇస్తారు. ఆకట్టుకునేలా వివిధ పాత్రల తయారీకి పది రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా మట్టి పాత్రల తయారీనే ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలను ఇప్పటికే గుర్తించారు. నర్సీపట్నం మండలంలోని వేములపూడి ఖాదీ సొసైటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల్లో శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. తొలి విడతలో 120 మందిని ఎంపిక చేయనున్నారు. ఇప్పటివరకు కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన వారికే ఉపకరణాలను ఉచితంగా ఇచ్చేవారు. ఈ ఏడాది నుంచి ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారికీ ఇవ్వాలని నిర్ణయించారు. మంజూరైన వాటిలో 80 కుమ్మరులకు, 20 ఎస్సీలకు, 20 ఎస్టీలకు ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన వారు తయారు చేసిన వస్తువులు కేవీఐసీ విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ తదితర నగరాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో విక్రయించేలా అవకాశం కల్పిస్తారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలోని గిరిజనులకు నాలుగు వందల తేనెపెట్టెలను ఉచితంగా ఇవ్వనున్నారు. వీటితోపాటు తేనెటీగలనూ పంపిణీ చేస్తారు. ఒక్కో లబ్ధిదారుకు పది పెట్టెలు ఇస్తారు. ఈ ప్రాజెక్టుకు రూ.20 లక్షలు కేటాయించారు. శ్రీకాకుళం జిల్లా రాజాం ప్రాంతంలో 20 మంది ప్లంబర్లకు ఉచితంగా పరికరాలు అందజేయనున్నారు.

**బలోపేతం చేయడమే లక్ష్యం**

వృత్తి పనివారలను బలోపేతం చేయడం ద్వారా పేదరిక నిర్మూలనే లక్ష్యం. శిక్షణ ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయి. తద్వారా వారంతా ఆర్థిక స్వావలంబన సాధిస్తారు. వృత్తిపనివారలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ద్వారానూ 35 శాతం గ్రాంట్తో రుణాలు పొందవచ్చు. బియ్యం మిల్లులు, టెంట్హౌస్లు, జీడి ఆధార పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవచ్చు.

– సుబ్రహ్మణ్యం, గ్రామోద్యోగ వికాస్ యోజన నోడల్ అధికారి, విశాఖపట్నం

# ఆరోగ్య కవచం.. అందక కష్టం



ఆదోని : గర్భిణులు, చిన్నారుల సంరక్షణను దృష్టిలో పెట్టుకొని జాతీయ, రాష్ట్ర స్థాయి ఇమ్యునైజేషన్ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలి. చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెంచి, ప్రాణాంతక వ్యాధులు దరి చేరకుండా టీకాలు దోహదపడతాయి. క్షయ, మెదడు వ్యాపు, న్యూమోనియా వంటి వ్యాధులు ప్రారంభ దశలోనే అడ్డుకుంటాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న టీకాలకు కొరత వచ్చింది. ఉమ్మడి జిల్లాలో మూడు సర్వజన ఆస్పత్రులు.. మూడు ప్రాంతీయ ఆస్పత్రులతో పాటు 16 సీహెచ్సీలు, 87 పీహెచ్సీలు, 50 వరకు అర్బన్ ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ఏడాదికి వివిధ రకాల టీకాలు వేసుకునే వారి సంఖ్య లక్ష వరకు నమోదవుతుంది.

వార్డు, గ్రామ కేంద్రంగా సచివాలయ ఏఎన్ఎంలు ఇంటింటికి తిరిగి టీకాలు వేస్తున్నారు. గర్భం దాల్చినపుడు, ప్రసవించిన వెంటనే ఇద్దరి వివరాలూ అంతర్జాలంలో నమోదు చేస్తారు. కొన్ని చోట్ల వేయకపోయినా.. వేసినట్లు సిబ్బంది నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఎక్కడ ఎలా ఉందంటే**

సరఫరాలో లోపాల కారణంగా టీకాలు సకాలంలో అందడం లేదు. ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో రెండు వారాలుగా బీసీజీ, పోలియో వ్యాక్సిన్ కొరత వేధిస్తోంది. రోజు 20కి పైగా చిన్నారులు ఓపీ ఉంటుంది.

ఆదోనిలోని హవన్నపేట అర్బన్ ఆరోగ్య కేంద్రంలో బీసీజీ, ఓపీవీ నిల్వలు అయిపోయాయి. ఇక్కడి కేంద్రం పరిధిలో ఎనిమిది వార్డులపై ప్రభావం చూపుతోంది. నెలకు ఒక్కో కేంద్రంలో సుమారు వందకు పైగా చిన్నారులు టీకాలు వేసుకుంటుంటారు.

ఆళ్లగడ్డ పట్టణంలో రెండు అర్బన్ కేంద్రాలుంటే ఒక్క దానిలో ఐపీవీ, రోటా వ్యాక్సిన్ కొరత ఉంది.

కౌతాళం మండలంలోని ఓ పీహెచ్సీ కేంద్రంలో గతం వరకు పెంటావాలెంట్ వ్యాక్సిన్ కొరత ఉండేది. దీంతో సిబ్బందితో తెప్పించుకుని సేవలందిస్తున్నారు.

**పుట్టినప్పటి నుంచి మొదలు**

పుట్టిన వెంటనే 24 గంటల లోపు బీసీజీ, ఓపీవీ, హైపటైటిస్–బి

ఆరు వారాలకు ఓపీవీ–1, పెంటావాలెంట్–2, రోటా–1, ఎఫ్ఐపీవీ–1.

పది వారాలకు ఓపీవీ–2, పెంటావాలెంట్–2, రోటా–2.

14 వారాలకు ఓపీవీ–3, పెంటావాలెంట్–3, రోటా–3, ఎఫ్ఐపీవీ–2. 9 నెలలకు తట్టు, రుబెల్లా(ఎం.ఆర్)–1, విటమిన్ ఎ–1

16–24 నెలలకు టీటీ మొదటి బూస్టర్ మోతాదు, ఓపీవీ–బూస్టర్ మోతాదు, తట్టు, రుబెల్లా(ఎం.ఆర్)–62. 5–6 ఏళ్లకు డీపీటీ, రెండో బూస్టర్ మోతాదు. 10 నుంచి 16 ఏళ్లకు టీడీ వేయించాలి.

గర్భిణులకు టీడీ–1: గర్భం దాల్చిన తొలి రోజుల్లో, నాలుగు వారాలకు టీడీ–1, టీడీ–2, చివరి గర్భధారణ తర్వాత మళ్లీ మూడేళ్ల లోగా గర్భం దాలిస్తే.. 2– టీడీ బూస్టర్ వేయించుకోవాలి.

## ఆక్రమణదారుల 'అద్దె'రువు

కర్నూలు : నగరంలోని బీక్యాంపులో 20 ప్రభుత్వ గృహాలను ఓ మహిళ ఆక్రమించుకున్నారు. అందులో నాలుగింటిని తన అవసరాల కోసం వినియోగించుకుంటూ మిగిలిన 16 గృహాలను అద్దెకిచ్చింది. ప్రతినెలా రూ.70 వేలకుపైగా అద్దె వసూలు చేస్తున్నారు. వైకాపాకు చెందిన ఓ కార్పొరేటర్.. ఐదు క్వార్టర్లను ఆక్రమించుకున్నారు. ఆయన బావమరిది మరో 16 వరకు ఆక్రమించి అద్దెకిచ్చేశారు. రెవెన్యూ శాఖలో ఓ ఉన్నతాధికారి వద్ద డ్రైవర్గా పనిచేస్తున్న ఓ వ్యక్తి ఏకంగా 15 వసతిగృహాలను కబ్జా చేశారు. తన బంధువులు, తెలిసినవారికి పప్పు బెల్లాల్లా పంచేశారు.

490 వరకు ప్రభుత్వ క్వార్టర్లు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు చెబుతున్నా ఇంకా ఎక్కువ ఉన్నట్లు అంచనా. నాయకుల పేర్లు చెప్పి కొందరు భవనాలను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని క్వార్టర్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మరికొన్నింటిలో జూద శిబిరాలు నిర్వహిస్తుండటం గమనార్హం.

**123 ఎకరాల్లో విస్తరణ**

కర్నూలు నగర నడిబొడ్డులో రహదారులు, భవనాల శాఖ పరిధిలో 123 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఏ, బీ, సీ క్యాంపుల పరిధిలో 953 ఇళ్లు (క్వార్టర్లు) ఉన్నాయి. అక్కడున్న భూమిలో సగానికిపైగా స్థలం కబ్జాదారుల చెరలోనే ఉంది. ఆ భూమి విలువ ప్రస్తుత మార్కెట్



విలువ ప్రకారం రూ.2 వేల కోట్లకుపైగా ఉంటుందని అంచనా.

కర్నూలు రాజధానిగా ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం భవనాలు నిర్మించారు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఆ ప్రాంతంలోని మొత్తం ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ.3,690 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

దశాబ్దాలుగా ఆ భవనాలను పట్టించుకోకపోవడంతో చాలావరకు శిథిలావస్థకు చేరాయి. వర్షమొస్తే ఉరుస్తుండటం.. కూలిపోయేలా ఉండటంతో పలువురు ఉద్యోగులు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇదే అదనుగా ప్రైవేటు వ్యక్తులు ఆ భవనాలను కబ్జా చేశారు.

**ఖాళీ చేయకుంటే కఠినచర్యలు**

ఏ, బీ, సీ క్యాంపుల్లోని క్వార్టర్లలో ఉన్నవారికి ఆర్అండ్బీ అధికారులు రెండు నెలల కిందటే తాఖీదులిచ్చారు. కొందరు మరికొంత గడువు కోరగా అనుమతినిచ్చినప్పటికీ ఎవరూ ఖాళీ చేయలేదు. తాజాగా వచ్చే నెల ఏడో తేదీలోపు ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గడువు మీరిన తర్వాత ఇంకనూ నివసిస్తున్నవారి భవనాలకు విద్యుత్తు కనెక్షన్లు తొలగిస్తారు. నీటి సరఫరా ఆపేయడం.. ఇంట్లోని సామగ్రి తరలించడం తదితర చర్యలు తీసుకోనున్నారు.

## 'భూ'చోళ్ల బురిడీ

నంద్యాల : జిల్లా కేంద్రం నంద్యాలలో భూమాఫియా చెలరేగిపోతోంది. ప్రజాప్రతినిధుల అండదండలతో కొందరు అక్రమార్కులు.. భూయజమానులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. రూ.కోట్ల విలువైన భూములకు నకిలీ పత్రాలు తయారుచేయడం, తమకు విక్రయించినట్లు చూపి వివాదాలు సృష్టిస్తున్నారు. ఆ తర్వాత పంచాయితీలు చేసి రూ.లక్షలు దండుకుంటున్నారు. నంద్యాల శివారులోని నూనెపల్లి పరిధిలో 89 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న భూమిని తమకు అమ్మారంటూ ఇటీవల కాలంలో ఒకరు ఆందోళన చేశారు. దీంతో కంగుతిన్న భూయజమాని వారు చూపిన పత్రాలను తనిఖీ చేయించగా నకిలీవని తేలింది. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్రమాల గుట్టు రట్టైంది. నూనెపల్లి పంచాయతీ పరిధిలో సుమారు 89 సెంట్ల స్థలాన్ని ప్రసాదరెడ్డి అనే వ్యక్తి 2018లో తన భార్య రమాదేవి పేరుమీద కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ భూమి, నిర్మాణాల విలువ రూ.20 కోట్ల వరకు ఉంది. ఆ భూమి ప్రస్తుత



యజమానురాలు రమాదేవి.. రమణ అనే వ్యక్తితో డెవలప్మెంట్ అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. జనవరి నుంచి పనులు మొదలుపెట్టారు. బ్యాంకుల్లోనూ రుణాలు తీసుకున్నారు.

**రూ.56 లక్షలు చెల్లించానంటూ..**

అదే భూమిని కబ్జా చేసేందుకు మరో వ్యక్తి ప్రయత్నించడం గమనార్హం. ఆ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు తాను రూ.56 లక్షలు చెల్లించానంటూ ఓ వ్యక్తి ఒప్పంద పత్రాన్ని చూపడంతో బాధితులు, ఆమె భర్త మళ్లీ పోలీసులను ఆశ్రయించారు. ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పిన వ్యక్తి 2023లో విశాఖ శివాజీపాలెం ప్రాంతానికి చెందిన అరుణకుమారి అనే స్టాంపు వెండరు నుంచి స్టాంపు పేపరు కొనుగోలు చేసినట్లు.. అదేరోజు నంద్యాలలో విక్రయ ఒప్పంద అగ్రిమెంటు కుదుర్చుకున్నట్లు చూపారు. అదేసమయానికి విశాఖ నుంచి స్టాంపు పేపరు కొనుగోలు చేసి.. అదేరోజు నంద్యాలకు తీసుకురావడం అసాధ్యమే. కాగా నంద్యాలకు చెందిన వారికి తాను స్టాంపు పేపర్లను విక్రయించలేదని అరుణకుమారి లిఖితపూర్వకంగా తెలియజేయడంతో అక్రమం వెలుగుచూసింది.

**నకిలీ పత్రాలతో మాయ**

సదరు భూమిని.. తమకు విక్రయించేందుకు యజమాని ఒప్పందం కుదుర్చుకున్నారంటూ ముగ్గురు వ్యక్తులు తెరపైకి వచ్చారు. కొంత నగదు ఇచ్చామన్నారంటూ ఒక ఒప్పంద పత్రం చూపడంతో ఆమె హతాశురాలయ్యారు. తాను ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదని.. తన సంతకాలు ఫోర్జరీ చేశారంటూ బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో గుట్టు రట్టైంది. ఒప్పందం చేసుకున్న వ్యక్తులు ఉపయోగించిన స్టాంపు పేపరును తమ కార్యాలయంలో కొనుగోలు చేయలేదని సబ్ రిజిస్ట్రార్ లిఖితపూర్వకంగా ఇవ్వడంతో భూమి కొనుగోలు అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. ఓ ప్రజాప్రతినిధి అనుచరులమని చెప్పి రాజీ చేసుకోవాలని వారిపై ఒత్తిడి చేస్తుండడంతో బాధితురాలి భర్త.. మంత్రి ఫరూఖ్ను ఆశ్రయించారు. ఆయన పోలీసులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నంద్యాలలో ఇతర నియోజకవర్గాల నాయకులు పంచాయితీలు చేయడం వివాదాస్పదంగా మారింది.

# తడ'బడి'న ప్రయోగం




కొత్తచెరువు : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలవైపు అడుగులు వేసేలా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. వీటికి ఇంటర్‌నెట్, త్రీడీ ప్రింటర్, రోబోటిక్స్, మెకానిక్ పరిశోధనకు అవసరమైన పరికరాలను సమకూర్చారు. విద్యార్థుల ఆలోచనలకు పదును పెడుతూ దిశానిర్దేశం చేయడానికి శిక్షకులను నియమించారు. ఈ ప్రయోగశాలల ద్వారా సొంత పరిశోధనలే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ప్రయోగాల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది.

**నిర్వహణకు రూ.2.08 కోట్లు**

కొత్తచెరువు బాలురు, తాడిమర్రి ప్రభుత్వ పాఠశాల, కదిరి, హిందూపురం సోషల్ వెల్ఫేర్ బాలురు, బాలికల కళాశాలలు, సీకేపల్లి, నల్లచెరువు, అమడుగూరు, రామగిరి, ధర్మవరం ఆదర్శ పాఠశాలలు, లేపాక్షి జవహర్ నవోదయ, చిలమత్తూరు బీసీ వెల్ఫేర్, హిందూపురం ప్రైవేటు పాఠశాలలో అటల్ టింకరింగ్ ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. ఒక్కో దానికి పరికరాలకు రూ.10 లక్షలు, నిర్వహణకు రూ.2 లక్షలు మొదటి విడతలో మొత్తం రూ.12 లక్షల చొప్పున మంజూరు చేశారు. రెండో విడతలో మరో రూ.4 లక్షలు అందించారు. జిల్లాలోని 13 ప్రయోగశాలలకు మొత్తం రూ.2.08 కోట్లు వెచ్చించారు.

**ఆశించిన ఫలితం శూన్యం**

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అత్యాధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేసినా ఫలితం శూన్యం. విద్యార్థుల్లో ఉత్సాహం ఉన్నా పర్యవేక్షణ లోపం కారణంగా ప్రోత్సాహం కరవైంది. దీంతో గత ఐదేళ్లుగా శాస్త్ర విజ్ఞాన ప్రదర్శనలకు కనీస స్థాయిలో కూడా ప్రాజెక్టులు వెళ్లకపోవడం గమనార్హం. ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో ల్యాబ్‌లకు పరికరాలను మంజూరు చేశారు. అయితే వాటిలో ఏమిచ్చారో తెలియని పరిస్థితి.

**నోడల్ టీచర్లు స్పందిస్తే సత్ఫలితాలు**

తనూజ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి

అటల్ ల్యాబ్‌లలో వారంలో ఒక పాఠశాలలో శిక్షకుడు హాజరై విద్యార్థులకు తరగతి నిర్వహిస్తున్నారు. ఆతరువాత నోడల్ టీచర్లు బాధ్యత తీసుకుని విద్యార్థులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో ప్రాజెక్టులు ప్రదర్శనకు రాలేదు. త్వరలో 13 ల్యాబ్ నిర్వాహకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లా: సత్యసాయి

అటల్ ల్యాబ్‌లు : 13

ప్రారంభం : 2021 ఒక్కో ల్యాబ్ ఏర్పాటు, నిర్వహణ వ్యయం : రూ.16 లక్షలు వెచ్చించిన మొత్తం : రూ.2.08 కోట్లు

# పట్టాలు సృష్టించి.. నట్టేట ముంచి

కర్నూలు : ఓర్వకల్లులో రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి కొందరు దొంగ పట్టాలు సృష్టించి విక్రయించారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరగ్గా తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఓర్వకల్లు పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయ సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమికి కొందరు అక్రమంగా పట్టాలు పుట్టించి అమ్మేశారు. సర్వే నంబరు 471/సిలో రెండెకరాలు, 614లో మూడెకరాలు, ఆదర్శ పాఠశాల సమీపంలో రెండెకరాలు, తహసీల్దారు కార్యాలయం ఎదురుగా సర్వే నంబరు 532/సిలో రెండెకరాల భూమికి పట్టాలు సృష్టించారు.

**సీల్, స్టాంపులు తయారుచేసి..** తహసీల్దారు కార్యాలయ సీల్, స్టాంపును తయారుచేసి పట్టాలపై ముద్రలు వేశారు. తహసీల్దారుగా గతంలో పనిచేసిన కృష్ణవేణి సంతకా న్ని ఫోర్జరీ చేశారు. ప్రభుత్వ స్థలంలో అనధికారిక లేఅవుట్ వేశారు. సెంటు రూ.2.50 లక్షలు, మరికొన్ని రూ.1.50 లక్షల చొప్పున అమ్మేశారు.

**ఒప్పందాలు చేసుకుని..**

కొన్ని ప్లాట్లు విక్రయించేందుకుగాను 2019 నుంచి ఒప్పందాలు కుదుర్చుకోవడం ప్రారంభించారు. ఎంత భూమిని.. ఎంత మొత్తానికి విక్రయిస్తున్నామన్న విషయాన్ని ఒప్పంద పత్రాల్లో రాసుకున్నారు. వీటికి 2019, 2020, 2021, 2022లో కుదుర్చుకున్నారు. 2006, 2011లో పట్టాలను జారీ చేసినట్లు చూపడం గమనార్హం. ఓర్వకల్లు మండలంలో 2011లో పేదలకు పట్టాలిచ్చారు. ఆ



సంవత్సరంలో పట్టాలిచ్చినట్లు చూపితే ఎవరికీ అనుమానం రాదన్న ఉద్దేశంతో 2011లోనే పట్టాలిచ్చినట్లు చూపారు. వాస్తవానికి ఆ సంవత్సరంలో సర్వే నంబరు 532/సిలో పట్టాలు పంపిణీ చేశారు. నకిలీ పట్టాల్లో మాత్రం ఆ సర్వే నంబరు వేయలేదు.

**బాధితులకు మళ్లీ దొంగ పట్టాలు**

ఓర్వకల్లులో సర్వే నంబరు 614లోని ప్రభుత్వ భూమిని జూనియర్ కళాశాలకు ప్రభుత్వం కేటాయించింది. దీనిని ఆ కళాశాల ప్రిన్సిపల్ స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిలో స్థలాలు కొన్నవారు తాము మోసపోయినట్లు గుర్తించారు. స్థలాలు అమ్మినవారిని నిలదీశారు. దీంతో మరోచోట స్థలాలిస్తామని నచ్చజెప్పారు. వేరేచోట ఉన్న ప్రభుత్వ స్థలానికి తాజాగా మళ్లీ దొంగ పట్టాలు పుట్టించి బాధితుల చేతిలో పెట్టారు. నకిలీ పట్టాల వ్యవహారం వివాదాస్పదం కావడంతో కొందరు కొనుగోలుదారులు అక్రమార్కులను నిలదీశారు. దీంతో సుమారు 15 మందికి డబ్బులు వెనక్కి ఇచ్చేశారు.

# విద్యుక్తధర్మం విస్మరించారు!

కర్నూలు : ఇంట్లో వెలుగులు నింపుతూ.. పొలంలో పంటలకు తడులు అందించే విద్యుత్తే పలు కుటుంబాల్లో చీకట్లు నింపుతోంది. వివిధ ప్రమాదాల్లో మనుషుల ప్రాణాలు పోతున్నాయి. కొన్ని సందర్భాల్లో పశువులు మృత్యువాత పడుతున్నాయి. బాధిత కుటుంబాలు తీవ్రంగా నష్టపోయినా.. వారికి పరిహారం అందించి న్యాయం చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. బాధితులకు అవగాహన లేకపోవడంతో పరిహారానికి దూరమవుతున్నారు. విద్యుత్తు ప్రమాదాల్లో ఆయినవారిని, జీవనాధారమైన పశువులను కోల్పోయిన ఎందరికో ఇప్పటికీ ప్రభుత్వ సాయానికి దూరంగా ఉన్నారు.

**సాయానికి ఎదురుచూపులు**

కర్నూలు జిల్లాలో 2023- 24, 2024- 25 జులై వరకు 53 మంది మృతి చెందినట్లు అధికారులకు సమాచారం అందింది. 33 బాధిత కుటుంబాలకు పరిహారం అందింది. మరో 20 కుటుంబాలకు అందాల్సి ఉంది. 35 పశువులు మృతిచెందగా 19 కుటుంబాలకు నష్ట పరిహారం మంజూరైంది. 16 కుటుంబాలకు కావాల్సి ఉంది.

నంద్యాల జిల్లాలో 30మంది మరణించగా 17 కుటుంబాలకే పరిహారం అందింది. 25 పశువులు మృత్యువాత పడ్డాయి. వీటిలో 12పశువులకు సంబంధించి బాధితులకు ఆర్థిక సాయం అందింది. మిగతా బాధితులకు పరిహారం అందించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

**చెల్లింపులు ఇలా..**

విద్యుత్తు ప్రమాదంలో వ్యక్తి మరణిస్తే రూ.5 లక్షలు పరిహారం వస్తుంది.



ఇందులో రూ.4 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. రూ.లక్ష నేరుగా అందిస్తారు. క్షతగాత్రులకు చికిత్స నిమిత్తం పరిహారం ఇస్తారు.

పశువులు మరణిస్తే ఒక్కోదానికి రూ.40 వేలు, గొర్రెలు, మేకలకైతే రూ.7 వేలు చొప్పున చెల్లిస్తారు. ఈ ప్రక్రియ జరగక ముందు విద్యుత్తుశాఖ విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాల్సి ఉంది.

**అవసరమైన పత్రాలు**

విద్యుత్తు ప్రమాదాల్లో నష్టపోయిన కుటుంబాలు పరిహారం పొందాలంటే కింది పత్రాలను సమర్పించాలి.

ఎఫ్ఐఆర్ నకలు పంచనామా పత్రం పోస్ట్‌మార్టం రిపోర్టు

మరణ ధ్రువీకరణ పత్రం న్యూస్‌పేపర్ క్లిప్పింగ్ ఆధార్‌కార్డు(మనుషులకైతే) బ్యాంకు ఖాతా పుస్తకం

**త్వరగా నిధులు మంజూరు చేస్తాం: ఎం.ఉమాపతి, ఎస్ఈ**

కర్నూలు జిల్లా ఎప్పటికప్పుడు బాధిత కుటుంబాలకు పరిహారం అందిస్తున్నాం. సకాలంలో ధ్రువపత్రాలు అందించకపోవడం.. అవి సరిగ్గా లేకపోవడం వంటి కారణాలతో కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కోసం స్థానిక విద్యుత్తు కార్యాలయంలో అధికారులను సంప్రదించాలి.

# మూసుకున్నాయ్ కళ్లు.. లేచాయ్ అక్రమ అంతస్తులు!



విశాఖపట్నం: అతనో వైకాపా నాయకుడు.. ప్రభుత్వ భూమిని ప్రైవేటుగా చూపించి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నాడు. అంతేకాకుండా ప్లాన్‌ను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా కట్టేస్తున్నాడు. అయినా జీవీఎంసీ అధికారులు కళ్లు మూసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ వైకాపా నాయకుడి హవా కొనసాగుతుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

**రూ.అరకోటి స్థలం హాంఫట్:** జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో సర్వే నెంబరు 91లో ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని గతంలో ఏపీఐఐసీకి అప్పగించారు. ఈ పక్కనే సర్వే నెంబరు 92/2లో ప్రైవేటు భూమి ఉంది. ప్రభుత్వ భూమిలోని సుమారు 97 గజాల స్థలాన్ని ప్రైవేటుగా చూపించి అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టారనే ఆరోపణలున్నాయి. దాని విలువ సుమారు రూ.అర కోటి ఉంటుందని అంచనా. ఇక్కడ భవన నిర్మాణానికి 2013లో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు అనుమతులు జారీ చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో 2016లో బిల్డర్ పనులు నిలిపేశాడు. తర్వాత వైకాపా ప్రభుత్వం రావడంతో ఆ నాయకుడు రోజుల వ్యవధిలో రెండస్తులు నిర్మించేశాడు. మళ్లీ అభ్యంతరాలు తెరపైకి రావడంతో పనులు నిలిచిపోయాయి.

**సర్వేలో వాస్తవాల వెల్లడి:**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. డిజిటల్ సర్వే చేసిన సర్వేయర్ నివేదిక సైతం కమిషనర్‌కు ఇచ్చారు. నిర్మాణం జరిగిన భవనం సర్వే నెంబరు 91, 92–2లో ఉందని, రికార్డుల ప్రకారం 91 సర్వే నెంబరులోని 7.93 ఎకరాల పోరంబోకు భూమిని ఏపీఐఐసీకి కేటాయించినట్లు తేల్చారు. వైకాపా నాయకుడి భవన నిర్మాణం సర్వే నెంబరు 91 పరిధిలో ఉందంటే, ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లేనని భావిస్తున్నారు.

**ప్లాన్‌కు ఎలా అనుమతులు ఇచ్చారు?:** కేవలం 12 అడుగుల రోడ్డులో ఆ నిర్మాణానికి అనుమతులిచ్చారు. భవనం దక్షిణం వైపు రోడ్డు కోసం, సెట్‌బ్యాక్‌లకు కలిపి 5.74మీటర్ల స్థలం, మిగిలిన మూడు వైపులా రెండేసి మీటర్ల చొప్పున స్థలం వదలాలనే నిబంధనలను ఇక్కడ పాటించలేదు. ఇండస్ట్రియల్, నివాసాల మధ్య బఫర్ జోన్ ఉండాలి. ఇక్కడ ఎలాంటి బఫర్ జోన్ లేకుండా ఏపీఐఐసీ భూములను ఆనుకుని నిర్మాణం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో టీపీవోపై ఆరోపణలు వస్తున్నాయి. భారీగా డబ్బులు అందడం వల్లే నిబంధనలను ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై గాజువాక జెడ్సీ శేషాద్రి వివరణ కోరగా సర్వే నివేదికను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# హెచ్చెల్సీ.. భద్రం!



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వ పాలనలో కూలిన వంతెనలు.. బలహీన గట్లతో అధ్వానంగా తయారైన జిల్లా జీవనాడి హెచ్చెల్సీ పటిష్టం దిశగా అడుగులు వేస్తోంది. జగన్ సర్కారు పైసా నిధులు విదల్చకపోవడంతో హెచ్చెల్సీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు అత్యవసర పనులకు రూ.35 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో కొత్త రూపు సంతరించుకొంటోంది.

**నాడు శిథిలం.. నేడు పటిష్టం**

గత ఐదేళ్ల పాలనలో హెచ్చెల్సీ పరిస్థితి దినదిన గండంగా తయారైంది. జీవో 365 తీసుకొచ్చి అసంపూర్తి ఆధునికీకరణ పనులు నిలిపివేసింది. ఫలితంగా నాగలాపురం, డి.హెన్నూరు, మీనహళ్లి, కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్, నాగేపల్లి వద్ద పాత వంతెనలు కాలం చెల్లి కూలిపోయాయి. పంట పొలాలకు, ఇతర ప్రాంతాలకు రాకపోకలు నిలిచి రైతులు, ప్రజలు అవస్థలు పడ్డారు. యర్రగుంట వద్ద యూటీ, మైలాపురం తదితర చోట్ల గండ్లు పడి నీరు వృథా కావడంతో పాటు హెచ్చెల్సీలో ప్రవాహం నిలిచిపోయి సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏ క్షణాన ఎక్కడ గట్టు తెగుతుందో, వంతెన కూలుతుందోనన్న భయంతో రైతులు గడిపారు.

**వంతెనలు త్వరలోనే అందుబాటులోకి..**

కూటమి ప్రభుత్వం హెచ్చెల్సీని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధికి సంకల్పించింది. అధికారంలోకి వచ్చిన 10 రోజుల్లోనే రూ.కోటితో పనులు చేపట్టి ఆయకట్టుకు నీరు అందించారు. అత్యవసర పనులకు రూ.35 కోట్లు మంజూరు చేశారు. మూడు నెలల కిందట పనులు ప్రారంభించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ సహకారంతో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకొని యూటీ, లైనింగ్ వంతెనల నిర్మాణ పనులు 80 శాతం మేర పూర్తి చేశారు. పీఏబీఆర్, ఎంపీఆర్ రెగ్యులేటర్ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. నీటి రాకతో కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ పనులు నిలిపివేశారు. 165 కి.మీ. మీనహళ్లి వంతెన ప్రారంభించలేదు. మల్లికేతి, నాగలాపురం, నాగేపల్లి వంతెనలు త్వరలోనే అందుబాటులోకి రానుండటంతో రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# బిల్లుల్లో అ'ధనం'.. రవాణా భారం

ఆత్మకూరు : అరకొర వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఎరువుల విషయంలోనూ సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం కంపెనీలు నిర్ణయించిన ధరకు డీలర్లు ఎరువులను విక్రయించాలి. కానీ కొందరు డీలర్లు బిల్లుపై అదనంగా రవాణా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి డీలరు దుకాణం వద్ద ధరల పట్టిక ప్రదర్శించాలి. పలు ప్రాంతాల్లో పేరుకు ధరల పట్టిక ఉన్నా వాటిపై ధరలు కనిపించవు. కొన్ని దుకాణాల వద్ద బోర్డులను మూలన పెట్టేశారు. అయినా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

**నగదు వెనక్కి ఇప్పించి..** ఆత్మకూరుకు చెందిన ఓ రైతు పట్టణంలోని డీలరు వద్ద 4 సంచుల పొటాష్ కొనుగోలు చేయగా రూ.6,200 బిల్లు వేశారు. రవాణా ఛార్జీల పేరిట రూ.200 అదనంగా వసూలు చేశారు. రైతు ఆరా తీయగా రవాణా ఛార్జీలు మీరే చెల్లించాలని



డీలరు చెప్పారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లగా రూ.200 వెనక్కి ఇచ్చారు.

**తనిఖీలు అవసరం**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా సరిపడా లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్ఎస్‌కేలు, సొసైటీలకు వచ్చిన యూరియా నిమిషాల్లో అయిపోతుండటంతో రైతులు బారులుదీరుతున్నారు. యూరియా కొనుగోలు చేసే సమయంలో కొందరు ప్రైవేటు డీలర్లు ఏదో ఒక ఎరువు అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ధరలు పెరిగిన నేపథ్యంలో పాతవాటిని కొత్త ధరలతో చూపే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. బిల్లులను సైతం సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది.

# ప్రతిభకు పట్టం.. విజ్ఞాన్ మంథన్

డోన్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, దేశంలో సీఎస్ఐఆర్, ఐఎస్ఆర్‌వో, బార్క్, డీఆర్‌డీవో ప్రముఖ జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలను చూసే అవకాశం, ఇంటర్న్‌షిప్, ఉపకార వేతనం పొందే అవకాశాన్ని కలిగిస్తోంది.


**కేంద్ర సంస్థల ఆధ్వర్యంలో..**

కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ట్రైనింగ్, శాస్త్ర, సాంకేతిక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో పరీక్ష ఉంటుంది. దేశవ్యాప్తంగా 6 నుంచి 11వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో పరీక్ష రాయవచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వీవీఎం అధికారిక వెబ్‌సైట్‌లో రూ.200 రుసుం చెల్లించి వివరాలను నమోదు చేసుకోవాలి.

**వివిధ స్థాయిల్లో పరీక్ష**

వివిధ స్థాయిల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, గణితం, సామాన్యశాస్త్రం, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి, సత్యేంద్రనాథ్ బోస్ జీవిత చరిత్ర, లాజికల్ థింకింగ్, రీజనింగ్ తదితర సబ్జెక్టుల్లో బహుళైచ్ఛిక విధానంలో ప్రశ్నలు ఉంటాయి.

వీవీఎం పరీక్షకు సంబంధించి విద్యార్థులు మొదట పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో అంతర్జాలం ద్వారా పరీక్ష రాయవచ్చు. విద్యార్థి ఇంటి నుంచే ఆన్‌లైన్ విధానంలో, చరవాణి, ట్యాబ్, డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌ల ద్వారా పాల్గొనవచ్చు. ఆంగ్లం, హిందీతో పాటు 9 ప్రధాన ప్రాంతీయ భాషల్లో పరీక్షను నిర్వహిస్తారు. విద్యార్థులు తమ



ఆసక్తిని బట్టి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థాయిని బట్టి ధ్రువపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేస్తారు.

దరఖాస్తు, పరీక్షల వివరాలు ఇలా..

దరఖాస్తు గడువు: సెప్టెంబరు 30

నమూనా పరీక్షలు: సెప్టెంబరు 1 నుంచి.

పాఠశాల స్థాయి పరీక్ష: అక్టోబరు 28 నుంచి 30వ తేదీ వరకు.

జిల్లా స్థాయిలో..: నవంబరు 19వ తేదీన.

రాష్ట్రస్థాయిలో..: డిసెంబరు 21 లేదా 28 లేదా జనవరి 4వ తేదీల్లో ఏదో ఒక రోజు.

జాతీయ స్థాయి పరీక్ష: 2026 మే నెలలో.

ప్రధానోపాధ్యాయుల కృషి అవసరం : వి.కుమార్‌బాబు, వీవీఎం జిల్లా సమన్వయకర్త, నంద్యాల

విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని కలిగించి నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు వీవీఎం పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి. సందేహాలుంటే 9491342263 చరవాణిని సంప్రదించాలి.

చురకలు




# రైల్వేజోన్ అడుగులు... వడివడిగా..!

విశాఖపట్నం: దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యకలాపాలను త్వరితగతిన పట్టాలెక్కించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. తాత్కాల్కికంగా సిరిపురంలో వీఎంఆర్‌డీఏకు చెందిన డెక్ భవనంలో జోన్ జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఇది వరకే జీఎం సందీప్ మాథుర్ భవనాన్ని పరిశీలించారు. త్వరలో ఫర్నీచర్, ఇంటీరియర్ పనులకు టెండర్లు పిలవనున్నారు. 45 రోజుల్లోగా పూర్తిచేసి దసరా నాటికి జీఎం కార్యాలయాన్ని అధికారికంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం.

**రెండంతస్తుల్లో ఏర్పాటు..:** ప్రస్తుతం ముడసర్లోవ ప్రాంతంలో జీఎం కార్యాలయం శాశ్వత భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అది పూర్తయ్యేలోపు 'డెక్' భవనం నుంచి సేవలందించనున్నారు. ఇందులో మొదట ఒక ఫ్లోర్‌ను పరిశీలించగా సరిపోదని భావించిన అధికారులు రెండు ఫ్లోర్లను తీసుకోవాలని నిర్ణయించారు. దాదాపు 41వేల చదరపు అడుగుల స్థలాన్ని ఉపయోగించుకోనున్నారు. ఇందులోనే సుమారు 450 కార్లు, 600 ద్విచక్ర వాహనాలను నిలిపేలా పార్కింగ్ స్థలం ఉండడంతో ఈ భవనానికే ప్రాధాన్యమిచ్చారు.

**హెచ్‌వోడీల కార్యాలయాలు ఇక్కడే..:** జీఎం కార్యాలయంతో పాటు అనుబంధంగా 15 మంది ప్రిన్సిపల్ హెచ్‌వోడీల కార్యాలయాలు



అక్కడే రానున్నాయి. ఇప్పటికే దక్షిణ కోస్తా జోన్ ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (పీసీఎంఈ)గా అమిత్‌గుప్తాను నియమిస్తూ రైల్వేబోర్డు ఉత్తర్వులిచ్చింది. కొద్ది రోజుల్లోనే టెలికాం, సివిల్, కమ్యునికేషన్ ఇతర విభాగాల ప్రిన్సిపల్ హెచ్‌వోడీల నియామకం చేపట్టనుంది. వీరికి అదనంగా మరో 30మంది అధికారులు, వెయ్యి మంది ఉద్యోగులు ఇందులో కార్యకలాపాలు చేపట్టనున్నారు.

గతంలో భువనేశ్వర్ కేంద్రంగా ఏర్పడిన తూర్పుకోస్తా జోన్ పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందు రెండేళ్ల పాటు తాత్కాలిక భవనంలోనే సాగింది. ఆ తర్వాత శాశ్వత భవనంలోకి తరలింది. అదే తరహాలో దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలు కూడా తాత్కాలిక భవనంలో కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు. ముందుగా ఉద్యోగుల సర్దుబాటు, ఆస్తుల పంపకాలు చేపట్టాలి. ఆ తర్వాత పూర్తిస్థాయిలో జోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి.

**క్షేత్రస్థాయి సిబ్బంది**

మారే అవకాశం: సవరించిన రైల్వేజోన్ డీపీఆర్‌కు రైల్వేబోర్డు ఇటీవల ఆమోదం తెలిపింది. అందులో కొత్తగా జీఎం పోస్టు మినహా మరే పోస్టులపై స్పష్టత ఇవ్వలేదు. అయితే కొత్త జోన్ ప్రధాన కేంద్రం, విశాఖ డివిజన్‌కు అవసరమైన సిబ్బంది కోసం చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఆయా సెక్షన్లలో ఎక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అక్కడే అన్న విధానంలో కేటాయించారు. క్షేత్రస్థాయి సిబ్బందిని మార్చే అవకాశం ఉంది. అధికారుల కోసం నివాసాలను అద్దెకు తీసుకోవాలనే ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# అప్పన్న అన్నదానం.. దాతలకు భాగస్వామ్యం

సింహాచలం : అన్ని దానాల కన్నా.. అన్నదానం ఎంతో పవిత్రమైనదని భారతీయ సంస్కృతి చెబుతోంది. ఆకలితో ఉన్న వారికి కడుపునిండా ఆహారం అందించడంలో వచ్చే తృప్తి మరెందులోనూ ఉండదంటే అతిశయోక్తి కాదు. అందుకే అప్పన్న స్వామి నిత్యప్రసాదానికి భారీగా భక్తులు విరాళాలు ఇవ్వడానికి ముందుకొస్తుంటారు. 1989లో ఆగస్టు 14న సింహాచలం దేవస్థానం ఉద్యోగుల విరాళాలతో ప్రారంభమైన అన్నప్రసాద పథకం 36 ఏళ్లుగా నిర్విరామంగా కొనసాగుతోంది. ప్రకృతి విపత్తుల్లో సైతం అప్పన్న అన్నదానం నుంచి అన్నార్తులకు ఆహారం సరఫరా చేసిన ఘనత ఉంది.

**దాతలకు ప్రాధాన్యం:** అన్నప్రసాద పథకానికి విరాళాలు సమర్పించే దాతలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నారు. దాతలను నాలుగు కేటగిరీలుగా విభజించారు.

రూ.10 వేలు పైబడి విరాళాలు అందించిన దాతలకు ధ్రువపత్రంతో పాటు విరాళం కార్డు అందజేస్తారు. ఈ కార్డు ద్వారా దాత కుటుంబ సమేతంగా ఏడాదిలో ఒకసారి స్వామి దర్శనం చేసుకోవచ్చు. విరాళం అందజేసిన రోజున అంతరాలయంలో దర్శనం కల్పించి వేద పండితులతో ఆశీర్వచనం చేయిస్తారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలతో సత్కరిస్తారు. భక్తులు కోరిన రోజున ఏడాదిలో ఒకరోజు వారి గోత్రనామాలతో భక్తులకు అన్నదానం చేస్తారు. ఆ రోజు దాతల వివరాలను బోర్డుపై ప్రదర్శిస్తారు. భక్తులు విరాళాలు సమర్పించేందుకు సింహగిరిపై మూడు చోట్ల విరాళాల కౌంటర్లున్నాయి. దర్శనం ఆలయం వెలుపలకు



వచ్చే మార్గం, పీఆర్వో కార్యాలయంతో పాటు అన్నప్రసాద భవనం వద్ద ఈ కౌంటర్లున్నాయి. విరాళాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం 93987 34612 నంబర్‌లో సంప్రదించవచ్చు.

**బ్యాంకులో 36.45 కోట్ల డిపాజిట్లు:** సింహాద్రి అప్పన్న స్వామికి భక్తులు విరాళాల రూపంలో సమర్పించిన రూ.36,45,41,720 ప్రస్తుతం బ్యాంకులో డిపాజిట్ల రూపంలో ఉంది. దీనిపై సుమారు రూ.2 కోట్ల మేర వడ్డీ వస్తుంది. ఈ మొత్తంతో ఏడాదంతా భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తారు. భక్తులు సమర్పించిన విరాళాలను ఇతర అవసరాలకు వినియోగించరు. రూ.10 వేలు పైబడి వచ్చిన విరాళాలను శాశ్వత పథకం కింద బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తారు. నెలకు లక్ష మంది చొప్పున ఏటా 12 లక్షల మందికి ఉదయం, రాత్రి అన్నప్రసాదం అందిస్తున్నారు.

మహారాజ పోషకులు – రూ.లక్ష పైబడి విరాళ దాతలు

రాజ పోషకులు – రూ.50 వేలు పైగా

పోషకులు – రూ.10 వేలు దాటి

దాతలు – రూ.1,116 ఆపై విరాళమిచ్చిన వారు

# భూ సమస్యలు తీర్చేదెవరు?



అనంతపురం : జిల్లాలో భూ సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. చిన్న సమస్యలు సైతం పరిష్కారానికి నోచుకోని దుస్థితి నెలకొంది. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లోనూ సింహ భాగం అర్జీలు భూ సమస్యలపైనే దాఖలు అవుతున్నాయి. ఏళ్లకొద్దీ బాధితులు కాళ్లరిగేలా తిరుగుతున్నా స్పందించే నాథుడే కరవయ్యాడు. నిషేధిత 22ఏ, చుక్కల భూములే కాదు.. అసైన్డ్, మ్యుటేషన్ వంటి సాధారణ సమస్యల దస్త్రాలు సైతం మండల, డివిజన్ రెవెన్యూ కార్యాలయాలు దాటడం లేదు. ఫ్రీ హోల్డ్ భూముల వ్యవహారం దారుణంగా మారింది. నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న క్షేత్ర రెవెన్యూ అధికారులపై కొరఢా ఝుళిపించాల్సిన జిల్లా అధికారులు మెతక వైఖరి అవలంబిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

**'ఫ్రీహోల్డ్' పై తేల్చరే..**గత వైకాపా ప్రభుత్వంలో భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్న ఉద్దేశంతో ఫ్రీ హోల్డ్ భూముల క్రయ, విక్రయాలను పూర్తిగా ఆపేశారు. కనీసం 20 ఏళ్లకుపైగా అనుభవంలో ఉన్న అసైన్డ్ భూముల యజమా నులకు శాశ్వత హక్కులు కల్పిస్తామంటూ 2023 డిసెంబరు లో అప్పటి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఈ ప్రక్రియలో భారీ ఎత్తున గోల్‌మాల్, రూ.కోట్లల్లో ముడుపులు చేతులు మారాయన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. జిల్లాలో 36 వేల ఎకకరాలను ఫ్రీ హోల్డ్ చేసినట్లు నిర్ధారణ కాగా.. ఇందులో 24 వేల ఎకరాలు సక్రమం అని, మిగతా 12 వేల ఎకరాల్లో అక్రమాలు జరిగినట్లు తేలింది. దాదాపు ఏడాది కావస్తున్నా ఈ భూములపై ఏమీ తేల్చలేదు.

**22ఏ, చుక్కల్లో అంతులేని నిర్లక్ష్యం**

22ఏ, చుక్కల భూముల దస్త్రాలు కొందరు రెవెన్యూ అక్రమార్కులకు కల్పతరువుగా మారాయి. వీటిని పరిష్కరించాలంటే రూ.లక్షల్లోనే బేరసారాలు సాగుతాయి. అన్ని సక్రమంగా ఉన్నా ఏదొక కొర్రీతో దస్త్రాలను పక్కన పెడుతున్నారు. ఈ తరహా దస్త్రాలు జిల్లాలో 5,191 ఉన్నట్లు తేలింది. అత్యధికంగా కళ్యాణదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ, అనంత గ్రామీణం, గుత్తి, రాప్తాడు, గార్లదిన్నె, గుంతకల్లు, రాయదుర్గం మండలాల్లో దస్త్రాలు పరిష్కారానికి నోచుకోలేదు. అనంత రెవెన్యూ డివిజన్‌లోనే ఎక్కువగా మూలనపడ్డాయి.

**అటకెక్కిన అసైన్డ్, మ్యుటేషన్**

1954కు ముందు డి.పట్టా, అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలపై నిషేధం విధించారు. దీంతో తాత ముత్తాతల కాలం నాటి భూములను అమ్ముకోలేని దుస్థితి ఉంది. ఒక్క అసైన్డ్ భూమి జిల్లాలో 2.23 లక్షల ఎకరాలు ఉంది. 78 వేల మంది యజమానులు ఆ భూమి క్రయ, విక్రయాలు కాని.. తల్లిదండ్రుల నుంచి కొడుకు, కుమార్తెలకు మార్పిడి (మ్యుటేషన్) చేయించుకోలేని పరిస్థితి ఉంది. ప్రతి సోమవారం వందలాది మంది భూ బాధితులు అర్జీలు ఇస్తున్నా స్పందన శూన్యం.

# భూముల లెక్క.. ఇక పక్కా

అనంతపురం : సాధారణంగా పంటల వివరాలను మాత్రమే ఈ–పంట కింద నమోదు చేసేవారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఏడాది సాగులో లేని భూములను కూడా ఈ–పంట కింద నమోదుకు శ్రీకారం చుట్టాయి. గత వైకాపా ప్రభుత్వం రూపొందించిన యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫారం (యూడీపీ) యాప్‌ను రద్దు చేశారు. ప్రస్తుతం జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) ద్వారా ఖరీఫ్–2025లో 'ఈ–పంట డిజిటల్ క్రాప్ సర్వే' పేరుతో కొత్త యాప్‌ను రూపొందించారు. ఈ సర్వేతో సాగు భూముల వివరాలు కచ్చితంగా, పారదర్శకంగా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చారు.

**పంటల సర్వే పరిశీలనకు ప్రత్యేక చర్యలు**

వ్యవసాయ పంటలకు మండల వ్యవసాయాధికారి, ఉద్యాన పంటలకు ఉద్యాన అధికారి, ప్రభుత్వ/వ్యవసాయేతర భూములకు తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు. ఆయా భూములు, పంటల సాగు, భూమి రికార్డులు పరిశీలిస్తారు. వారు తిరస్కరించిన రికార్డులను సరైన కారణాలు చూపుతూ ఆన్‌లైన్ నమోదు చేయాలి. తిరస్కరించిన భూముల రికార్డుల ఆధారంగా రైతు సేవా కేంద్రాల సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేయాలి. రీసర్వే చేసిన రికార్డులను డివిజన్ వ్యవసాయాధికారి, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆమోదించాలి.

ఎకరా కన్నా తక్కువ భూమి ఉంటే జియోట్యాగ్ చేసి ఫొటో తప్పనిసరిగా తీయాలి. పంట ఉన్నా లేకపోయిన ప్రతి ఎకరా ఫొటో తీయాల్సిందే. మండలంలోని ప్రతి రైతు సేవా కేంద్రం, సిబ్బంది రెవెన్యూ గ్రామాలకు తిరిగి మ్యాపింగ్ చేయాలి. వారి ఫోన్లను మ్యాప్ చేసుకోవాలి. అప్పుడే యాప్ పని చేస్తోంది.

ఏపీఐఐసీ భూముల్లో సాగు చేసిన పంటల సర్వే వివరాలను సంయుక్త కలెక్టర్ అనుమతి తర్వాతే నమోదు చేయాలి.

**మార్గదర్శకాలు ఇలా..**

ఎన్ఐసీ వెబ్‌ల్యాండ్ ద్వారా సాగు చేయలేని, ప్రభుత్వ భూములను తొలగిస్తారు. సాగుకు యోగ్యమైన భూముల వివరాలను మాత్రమే సర్వేకు అనుసంధానం చేస్తారు.

వెబ్‌ల్యాండ్ నుంచి ఏదైన ప్రభుత్వ భూమి లేదా అభ్యంతరకర సర్వే నంబరు, ఖాతా నంబరు డౌన్‌లోడ్ అయితే.. అటువంటి సర్వే, ఖాతా నంబరుతో వ్యవసాయ భూమి కాకుండా వ్యవసాయేతర భూమిగా పరిగణించి నమోదు చేస్తారు.

గతేడాది బహువార్షిక/ ద్వివార్షిక పంటలకు ఫార్వర్డ్ ఆప్షన్‌ను రద్దు చేశారు. ఆయా పంటలను సర్వే చేసి తాజాగా జియో ఫెన్సింగ్ ఫీల్డ్ సర్వే చేసి ఫొటో తీస్తారు.

ప్రతి రెవెన్యూ గ్రామంలో రికార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, ప్రతి ఎకరా జియో ఫెన్సింగ్‌తో ఫీల్డ్ సర్వే, ఫొటో తప్పనిసరిగా తీయాలి.

వెబ్‌ల్యాండ్, అటవీ భూముల్లో పంటలున్నా.. లేకపోయినా ఫీల్డ్ సర్వే చేయాలి.

ప్రతి ప్లాట్ ఫీల్డ్ సర్వే చేసి అనుమతించబడిన 20 మీటర్లలో జియో ఫెన్సింగ్ ఫొటో తీయాలి.

బీడు భూములను మూడు రకాలుగా వర్గీకరించారు. అందులో ఐదేళ్లకుపైగా సాగు చేయని భూములు, 1–5 ఏళ్ల మధ్య సాగు చేయనివి, ఈ ఏడాది సాగు చేయలేనివి. పొలం గట్టుపై చెట్లు, పంట సర్వే తప్పనిసరి చేయాలి.

# ఆటల కోటకు బీటలు..!



విశాఖపట్నం: **అప్పట్లో..:** పాఠశాలలో చివరి గంట కొట్టగానే ఇంటికి పరుగున వెళ్లి.. పుస్తకాల సంచి విసిరేసి.. చీకటి పడేదాకా స్నేహితులతో కలసి ఆరుబయట ఆటలు ఆడుకునేవారు. ఆదివారం, సెలవు రోజుల్లో అయితే.. ఆటలో పడితే ఆకలి కూడా గుర్తుండేది కాదు.

**మరిప్పుడో..:** ఉదయం లేచిన దగ్గరి నుంచి పుస్తకాలు, ఫోన్లతోనే కాలం గడుపుతున్నారు. చాలా పాఠశాలల్లో ఆటల కోసం ఒక పీరియడ్ ఉంటుందనే సంగతి మరచిపోయారు. సాయంత్రం హోంవర్క్ పూర్తయ్యాక.. ఫోన్ ప్రపంచంలో మునిగిపోతున్నారు. ఆటలు ఆడుకోవాలన్నా ఫోన్‌లోనే. 50శాతం తగ్గిన ఆటల సమయం: శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం చేసే క్రీడలకు చాలా మంది విద్యార్థులు దూరమవుతున్నారు. ఆటల ద్వారా పిల్లలు అనేక నైపుణ్యాలు, కొత్త విషయాలు నేర్చుకుంటారు. కానీ, కొన్నేళ్లుగా చదువుల ఒత్తిడి పెరుగుతోంది. ఫలితంగా ఆటకు కేటాయిస్తున్న సమయం తగ్గుతూ వస్తోంది. 'రైజింగ్ ది నేషన్ ప్లే కమిషన్' నివేదిక ప్రకారం ప్రస్తుత తరం పిల్లలు ఆరుబయట ఆడుకునే సమయం 50 శాతం తగ్గింది.

**పేరుకే మైదానాలు..:** జిల్లాలో 569 ప్రభుత్వ ఉన్నత పాఠశాలు ఉండగా, సుమారు 300 పాఠశాలల్లో మైదానాలున్నాయి. అక్కడ సరిపడా క్రీడా పరికరాలు లేక విద్యార్థులు సాధనకు దూరమవుతున్నారు. ఆటలకు సమయం కేటాయించట్లేదని, వ్యాయామ ఉపాధ్యాయులు సైతం నామమాత్రంగా పనిచేస్తున్నారనే విమర్శలున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, ఇతర ప్రత్యేక రోజుల్లో పోటీల వరకే క్రీడలు పరిమితమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1000కి పైగా ప్రైవేటు పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో ఆడుకోవడానికి మైదానం సదుపాయాలున్నవి చాలా తక్కువ. ఎక్కువ శాతం స్కూళ్లు అపార్ట్‌మెంట్లు, ఇరుకు భవనాల్లో ఉన్నాయి.

**ఆటస్థలాలు కనుమరుగు:** ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 30శాతానికి పైగా చిన్నారులకు రక్షిత బహిరంగ ఆట స్థలాలు అందుబాటులో లేవు. నగరంలో చాలా చోట్ల ఖాళీ స్థలాల్లో వాణిజ్య సముదాయాలు, ఇతర కార్యకలాపాలు మొదలయ్యాయి. బహిరంగ ప్రదేశాల్లో ఆడుకునే సురక్షిత వాతావరణం లేకపోవడంతో కొందరు తల్లిదండ్రులు పిల్లలను బయటకు పంపడానికి భయపడుతున్నారు. బాల్యంలో ఆటలు ఆడకపోతే భవిష్యత్తులో శారీరక, మానసిక సమస్యలు తలెత్తే ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.30వేలు: జిల్లాలోని పెద్ద పాఠశాలల్లో చంద్రపాలెం ఉన్నత పాఠశాల ఒకటి. ఇటీవల బడి మైదానాన్ని చదును చేశారు. నాణ్యత లేకపోవడంతో వర్షం పడితే చిత్తడిగా మారుతోంది. క్రీడా పరికరాలు పూర్తి స్థాయిలో లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాఠశాలల్లో క్రీడా పరికరాలకు రూ.30వేల వరకు ఇండెంట్ పెట్టుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెలలో ఆ మొత్తం వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

# పారిశ్రామిక నడవ పరుగు

నక్కపల్లి : పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా నక్కపల్లి పరిధిలో కారిడార్ పనులు ఊపందుకున్నాయి. మూడు నెలల్లో రోడ్డు నిర్మాణ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. తీరప్రాంత గ్రామాల్లో సేకరించిన భూముల్లో బల్క్‌డ్రగ్ పరిశ్రమతోపాటు ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకా నున్నాయి. ఇందుకు సంబంధించి భూముల కేటాయింపు చేపట్టగా, బల్క్‌డ్రగ్ పార్కు మౌలిక సదుపాయాల కల్పన పనులు జనవరిలో ప్రారంభమయ్యాయి. పరిశ్రమలు ఏర్పాటయ్యే ప్రాంతానికి చేరుకునేందుకు అవసరమైన రహదారి నిర్మాణాన్ని జాతీయ రహదారిపై కాగిత సమీపం నుంచి ర.భ.శా. అధికారు లు మే నెలలో చేపట్టారు. ఇందులో భాగంగా 20 ఎకరాలను ఏపీఐఐసీ సేకరించింది. రోడ్డు నిర్మాణానికి ఏడాది గడువున్నా.. అత్యవసరంగా పూర్తి చేయాల్సి ఉండటంతో పరిశ్రమల శాఖ ఉన్నతాధికారి, కలెక్టర్ తదితరులు తరచూ పరిశీలన చేస్తూ ప్రగతి నివేదికలను ప్రభుత్వానికి పంపుతున్నారు. ప్రస్తుతం చేపట్టిన పనుల్లో గ్రావెల్ రహదారి నిర్మాణం తుది దశకు చేరుకుంది. కల్వర్టుల నిర్మాణం జరుగుతోంది. పరిశ్రమల నీటి అవసరాల నిమిత్తం రహదారిని వెంబడి భారీ పైపులైన్లు వేస్తున్నారు. ఈ ఏడాది చివరిలోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నారు. ప్రస్తుతం కాగిత నుంచి పాటిమీద కూడలి వరకు రోడ్డు వేస్తున్నారు. అక్కడి నుంచి ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడలో జరుగుతున్న రహదారులకు అనుసంధానం చేయనున్నారు.

**గడువుకు ముందే పూర్తి**

పరిశ్రమల అవసరాల నిమిత్తం ఈ రహదారే ప్రధానమైనది. వేగంగా పూర్తి చేయాలన్న ఆదేశాలున్నాయి. మూడు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. వీవీ రమణ, ఆర్డీవో

# పదేళ్ల ప్రగతి

ఏర్పేడు : తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్) పదేళ్లలో ఆదర్శనీయ ప్రగతిని సాధించింది. ఏర్పేడు మండలం శ్రీనివాసపురం సమీపంలోని 253 ఎకరాల్లో ఏర్పడిన ఐసర్ వివిధ పరిశోధనలతో ప్రపంచ దేశాల్లో ఉత్తమ ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో పదోఏట ఆరో స్నాతకోత్సవాన్ని శాశ్వత ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య ఘనంగా నిర్వహించుకునేందుకు సిద్ధమైంది.

**వేల మందిని తీర్చిదిద్ది**

2015లో తిరుపతిలో అద్దె భవనంలో 80 మంది విద్యార్థులతో ఏర్పడిన ఐసర్‌లో ప్రస్తుతం 1,200 మంది విద్యార్థులు బీఎస్, ఎంఎస్ చదువుతున్నారు. పరిశోధనలు అందుబాటులో ఉండటంతో 150కి పైగా వివిధ ప్రాజెక్టులు తయారు చేశారు. దేశవిదేశాలకు చెందిన వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఇప్పటి వరకు 1400 మంది విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా వివిధ సంస్థల్లో పనిచేస్తుండటం గమనార్హం. పక్షులు, పాములు, వ్యవసాయం, రోగనిరోధక



మందులు తయారీపై దృష్టి సారించడంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. బయాలజికల్ డేటా సైన్స్, ప్రొఫెషనల్ మాస్టర్స్ ఇన్ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ, ఎం.ఎస్ రీసెర్చ్ వంటివి అదనంగా ప్రవేశపెట్టారు. కాగా దేశంలోనే మొదటిసారి ఈ ఏడాది ఎకనామిక్స్, స్టాటిస్టికల్ సైన్స్‌తో బీఎస్ ప్రారంభించడం గమనార్హం.

**255 మందికి పట్టాల ప్రదానం**

తిరుపతి ఐసర్‌లో 2024–25లో విద్య పూర్తి చేసుకున్న 255 మంది విద్యార్థులు పట్టాలు అందుకోనున్నారు. వీరిలో పీహెచ్‌డీ 22, ఐపీహెచ్‌డీ 08, ఎంఎస్ 03, బీఎస్–ఎంఎస్ 141, ప్రొఫెషనల్ మాస్టర్స్ 69, బీఎస్ 06, బీఎస్సీ 06 మంది ఉన్నారు.

**ఆకట్టుకునే అందాలు, మౌలిక సదుపాయాలు**

ఐసర్‌లో ఎటుచూసిన పచ్చదనంతో ఆకట్టుకుంటోంది. భవనాలపై శాస్త్రవేత్తల నామకరణం, సైన్స్ ఫార్ములా ఉండటంతోపాటు సాంకేతిక విధానంతో తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. ఇండోర్ స్టేడియం, వ్యాయామశాలలు, వసతిగృహాలు, సమావేశం మందిరాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. రూ.9.5 కోట్లతో ఎనిమిది వరుసల అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరిన్ని నిధులు రానుండడంతో ఐసర్ త్వరలోనే ఆదర్శవంతమైన అభివృద్ధిని సాధించనుంది.

# వసతులున్నా.. సేవలు అంతంతమాత్రమే..!

పలమనేరు : పలమనేరు ఏరియా ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు ఉ న్నా.. సేవలు మాత్రం అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ప్రభుత్వం రూ.56 కోట్లతో ఇక్కడ వంద పడకల కోసం భవనాన్ని సమకూర్చింది. అందులో ఆధునిక వైద్య సదుపాయాలు, పడకలు, గదులు ఉన్నాయి. రెండు ఆక్సిజన్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేశారు. అయితే సరిపడా వైద్యులు లేకపోవడంతో సేవలు అందడం లేదు.

**ఈ పోస్టులు ఖాళీగా..**వైద్యులు, సిబ్బంది మొత్తం 96 పోస్టులుండాలి కానీ 13 ఖాళీగా ఉన్నాయి. అందులో సివిల్ సర్జన్ స్పెషలిస్టు, డిప్యూటీ సివిల్ సర్జన్–2, సివిల్ అసిస్టెం ట్ సర్జన్–3, ఇతర సిబ్బంది 7 పోస్టులు ఖాళీ ఉ న్నాయి. ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు గదులు, వసతులున్నా.. సంబంధిత సిబ్బంది, వైద్యులు లేరు. ఓ స్వచ్ఛంద సంస్థ ఇక్కడ డయాలసిస్ కేంద్రం నిర్వహించడానికి సిద్ధంగా ఉండగా.. ఆ సంస్థను ఇక్కడికి తెప్పించడానికి ప్రభుత్వం చొరవ



చూపాల్సిన అవసరం ఉంది.

**సమస్యలివే...**ఆస్పత్రిలో అంబులెన్స్ ఎందుకూ ఉపయోగపడటం లేదు. కేవలం అది ప్రొటోకాల్ కోసం ఉంచిన అంబులెన్స్ కావడంతో దాన్ని రెగ్యులర్ రోగులను తరలించడానికి వీలుండదు. రెండు అంతస్తులు ఉన్న ఆసుపత్రికి ముఖ్యంగా లిఫ్ట సౌకర్యం లేకపోవడంతో రోగులు వార్డులకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

**సమస్యలు పరిష్కరిస్తాం**– మమతారాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్, పలమనేరు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తాం. లిఫ్ట సమస్యను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# ఆయు 'కటకటే'

ఉయ్యాలవాడ: కర్నూలు–కడప ప్రధాన కాలువ పరిధిలోని ఉప కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఫలితంగా నీరు ముందుకు సాగక పంటలకు నీరందడం లేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో సుమారు 60 కి.మీ. మేర ప్రధాన కాలువ విస్తరించి ఉంది. దీని పరిధిలో కొన్ని కిలోమీటర్ల మేర పెద్దఎత్తున ఉప కాలువలు నిర్మించారు.

**పొలాలకు నీరందక..**

ఉయ్యాలవాడ మండల పరిధిలోని ఇంజేడు–కొండుపల్లె గ్రామాల మధ్య దశాబ్దాల కిందట ఉప కాలువలు ఏర్పాటుచేశారు. ఆ తర్వాత నిర్వహణ లేకపోవడంతో రూపు కోల్పోతున్నాయి. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నీరు ముందుకు ప్రవహించడం లేదు. కాలువ లైనింగ్ దెబ్బతింటోంది. ఫలితంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసీ ప్రధాన కాలువ నుంచి కొండుపల్లె మీదుగా పెద్దయమ్మనూరు వరకు 7 కి.మీ. మేర ఉప కాలువ విస్తరించి ఉంది. దీని పరిధిలో 500 ఎకరాలకుపైగా ఆయకట్టు విస్తరించి ఉంది. ఏళ్ల తరబడి ఉప కాలువ నిర్వహణను పట్టించుకోలేదు. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. సమస్యను రైతులు విన్నవించినా ఎవరూ దృష్టి సారించలేదు. చివరికి పొలాలు బీళ్లుగా మారుతున్నాయి.

**నివేదికలు పంపితే..**

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సాగు నీటి ప్రాజెక్టులకు ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. పంట కాలువల బాగుపై ప్రత్యేక దృష్టి సారించింది. రూ.కోట్ల నిధులు కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు స్పందించి ప్రభుత్వానికి నివేదికలు పంపి నిధులు వచ్చేలా చూడాలని ఆయకట్టు రైతులు విన్నవిస్తున్నారు.

చురకలు



## ప్రతీ లుక్ ఒక స్టోరీ చెబుతుంది..

## అందాలతో ఆకట్టుకుంటున్న దంగల్ బ్యూటీ!

సెలబ్రిటీలు చాలామంది సోషల్ మీడియాని వేదికగా చేసుకొని.. తమ హాట్ అందాలతో సినిమా ఆఫర్లను, ఫాలోవర్లను పెంచుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో హీరోయిన్లు ఎంత గ్లామర్ గా ఫోటోలు షేర్ చేసుకుంటారో అందరికీ తెలిసిందే. ఈ లుక్స్ వల్ల ఫాలోవర్స్ పెరగడమే కాదు ఈ ఫోటోలు చూసి ఎవరైనా దర్శక నిర్మాతలకు, హీరోలకు నచ్చితే సినిమా ఛాన్స్ లు కూడా లభిస్తాయనే చిన్న ఆశ. అందుకే చాలామంది హీరోయిన్లు, హీరోయిన్లుగా ఇండస్ట్రీకి రావాలనుకునే కొత్త వాళ్లు కూడా సోషల్ మీడియానే ఆయుధంగా ఎంచుకుంటారు. అయితే తాజాగా బాలీవుడ్ బ్యూటీ ఫాతిమా సనా షేక్ మాత్రం మ్యాగజిన్ కవర్ పేజీకి ఇచ్చిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో.. అవి టాక్ ఆఫ్ ది టౌన్ గా మారిపోయాయి. ఈ ఫోటోలలో ఫాతిమా సనా షేక్ అందాల కి కుర్రకారు మతిపోతోంది. తాజాగా ఫాతిమా సనా షేక్ FACE మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ఫోటోలకు ఫోజులు ఇచ్చింది.ఇందులో నాలుగు రకాల విలక్షణమైన డ్రెస్సింగ్ స్టైల్స్ తో అలరించింది. ఫాతిమా నాలుగు విభిన్నమైన డ్రెస్సులు వేసుకోగా .. ఆ ఫోటోల్లో ప్రతి ఒక్క




ఫోటో చాలా అద్భుతంగా రావడమే కాకుండా ఈ ఫోటోస్ ప్రస్తుతం ఆమె అభిమానులని ఆకట్టుకుంటున్నాయి. పైగా ప్రతీ ఫోటో ఒక స్టోరీ చెబుతుంది అంటూ షేర్ చేసిన క్యాప్షన్ కూడా హైలెట్గా నిలిచింది. ఫాతిమా వేసుకున్న డ్రెస్ ల విషయానికి వస్తే.. టర్కోయిస్-ఎరుపు పైస్లీ ప్రింట్ లెహంగా, మరొకటి గోల్డ్ ఎంబెల్లిష్డ్ లెహంగా, గ్రీన్-గోల్డ్ బనారసి లెహంగా,ఇక నాలుగవది ఆక్వా బ్లు ఫ్లోరల్ సిల్క్ చీర..ఈ నాలుగు డ్రెస్సుల్లో కూడా ఫాతిమా చాలా అందంగా కనిపించడమే కాకుండా తన మత్తు కళ్ళతో చూసేవారికి మత్తెక్కిస్తోంది.. ఫాతిమా సనా షేక్ పర్సనల్ విషయాలు, సినిమాల విషయానికి వస్తే.. అమీర్ ఖాన్ నటించిన దంగల్ మూవీతో ఫేమస్ అయిన ఈ ముద్దుగుమ్మ.. అంతకుముందు కొన్ని సినిమాలు చేసినప్పటికీ అన్నింటికంటే ఎక్కువ గుర్తింపు దంగల్ ద్వారానే వచ్చింది. ఈ సినిమా వచ్చాక అమీర్ ఖాన్ తో ఫాతిమా డేటింగ్ చేస్తోంది అంటూ వార్తల్లో కూడా నిలిచింది. అంతేకాదు అమీర్ ఖాన్ ఫాతిమా సనా షేక్ తో డేటింగ్ చేయడం వల్లే తన రెండో భార్యకు విడాకులు ఇచ్చారనే రూమర్లు కూడా వినిపించాయి. ఇక ఈ రూమర్లన్నింటికీ చెక్ పెడుతూ అమీర్ ఖాన్ రీసెంట్గా తను మూడో పెళ్లి చేసుకోబోయే మహిళని కూడా పరిచయం చేశాడు. ఇక ప్రస్తుతం ఫాతిమా తమన్నా మాజీ ప్రియుడు అయినటువంటి విజయ్ వర్మతో డేటింగ్ చేస్తున్నట్టు రూమర్స్ వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో వీళ్లిద్దరూ ఎక్కువగా బయట కనిపించడంతోపాటు పబ్బులు, రెస్టారెంట్లు అంటూ తిరగడంతో వీరి మధ్య ఉన్న బంధం గురించి బీటౌన్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి ఈ బంధం పై కూడా వీరు క్లారిటీ ఇస్తారేమో చూడాలి. ఇటీవల ఆర్ మాధవన్ తో కలిసి ఆప్ జైసా కోయి అనే సినిమాలో నటించింది.

## నేషనల్ క్రష్ తప్ప ఇంకెవ్వరూ పోటీలో లేరా!

సౌత్ లో ఎన్ని సినిమాలు చేసినా? అంతిమంగా బాలీవుడ్ లో స్థిరపడాలి అన్నది ప్రతీ హీరోయిన్ కల. ఈనేపథ్యంలో నటీమణులంతా బాలీవుడ్ అంటే ఆసక్తి చూపిస్తుంటారు. సౌత్ భామలు సైతం బాలీవుడ్ అవకాశాల కోసమే ఎదురు చూస్తారు. వచ్చాయంటే సౌత్ లో ఎంత బిజీగా ఉన్నా వాటిని వదిలేసి మరీ వెళ్లిపోతుంటారు. అక్కడ వచ్చే ఆదాయం మిగతా పరిశ్రమలకంటే అధికంగా ఉంటుంది. సెలబ్రిటీ లైఫ్ మరింత రిచ్ గా ఉంటుంది. బాలీవుడ్ అంటే పెద్ద ఇండస్ట్రీ కూడా. తక్కువ సమయంలోనే ఎక్కువ సంపాదించే అవకాశం బాలీవుడ్ లో ఉంటుంది.

**అవకాశాలు కష్టమేనా:** అందుకే దక్షిణాది పరిశ్రమలో ఎన్ని సినిమాలు చేసినా చాలా మంది హిందీకి వెళ్లలేకపోయామనే నిరుత్సాహన్ని వ్యక్తం చేస్తుంటారు. సమంత, కీర్తి సురేష్, రష్మికా మందన్నా ఇప్పటికే బాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. శ్రీలీల కూడా హిందీకి ఎంట్రీ ఇచ్చింది. ఇంకా మరికొంత మంది భామలు ముంబై కి చేరుకున్నారు.



కానీ వీళ్లలో రష్మిక మదన్నా తప్ప ఇంకెవ్వరూ బాలీవుడ్ భామలతో పోటీ పడలేకపోతున్నారు? అన్నది వెలుగులోకి వచ్చింది. అవకాశాల కంటే ముందే మీడియా అటెన్షన్ డ్రా చేయడంలోనూ రష్మిక మినహా ఎవరూ కాంపిటీషన్ లో కనిపించలేదన్నది తాజా సమాచారం.

**ఎలివేషన్ ఏదీ వర్కౌట్ అవ్వలేదు:** ఉత్తరాది భామలతో పోలిస్తే దక్షిణాది భామలు గ్లామర్ ఎలివేషన్ పరంగా ఎంత మాత్రం పోటీ ఇవ్వలేక పోతున్నారు. అందులో సక్సెస్ అయిది రష్మిక మాత్రమేనని మిగతా వారంతా అక్కడ కల్చర్ కు అల వాటు పడలేకపోతున్నారు. సమంత రెండుళ్లగా బాలీవుడ్ లోనే ఎక్కువగా తిరుగుతోంది. సినిమాలు చేయకపోయినా? అమ్మడి ఫోకస్ అంతా అక్కడే ఉంది. వీలైనంత వరకూ ఎక్స్ పోజ్ అయ్యే ప్రయత్నం చేస్తుంది. కానీ సామ్ ఎలివేషన్ ఏది? వ్యక్తిగత హైప్ తీసుకు రావడం లేదు.

**రష్మిక మాత్రమేనా:** కీర్తి సురేష్ కూడా నిబంధనలు సడలించిందనే ప్రచారం తప్ప అక్కడ భామలకు ధీటుగా ముందుకెళ్ల లేకపోతుంది. ముంబై బ్యూటీ పూజా హెగ్డే పెట్టాల్సిన ఎఫెర్ట్ అంతా ఎప్పుడో పెట్టేసింది. కానీ ఆ బ్యూటీ కూడా కాంపిటీషన్ లో లేదు. తెలుగు అమ్మాయి శ్రీలీల కూడా అక్కడ కల్చర్ కు అలవాటు పడటం అంత సులభం కాదు. వీళ్లందరిలో ఉన్నంతలో రష్మిక బెటర్ గా కనిపిస్తుంది. బాలీవుడ్ నవతరం భామలకు మంచి పోటీగా నిలుస్తుంది. మీడియా అటెన్షన్ డ్రా చేయగల్గుతుంది. కొత్త అవకాశాలు అందుకో గల్గుతుంది. ఇదంతా ఎలా సాధ్యమైందంటే? పోటీని తట్టుకుని ముందుకెళ్లింది కాబట్టే అన్నది గ్రహించాలి.




## మ్యూజిక్ లెజెండ్ డ్రీమ్ నెరవేరిన వేళ!



మ్యూజిక్ లెజెండ్ ఏ.ఆర్ రెహమాన్ ఇప్పటి వరకూ ఎన్నో సినిమాలకు సంగీతం అందించారు. తమిళం, హిందీ, తెలుగు సినిమాల్లో తనదైన ముద్ర వేసారు. భారతీయ సంగీతానికే వన్నె తెచ్చిన సంగీత దిగ్గజం ఆయన. రెహమాన్ సంగీతమంటే ఆ సినిమాకే ఓ బ్రాండ్. హాలీవుడ్ లో సైతం సత్తా చాటిన సంగీత సంచ లనం. అంతటి లెజండరీ ఓ మూకీ చిత్రాన్ని ఓ డ్రీమ్ ప్రాజెక్ట్ గా ప్రకటించడం విశేషం. ఎలాంటి సంభాషణలు లేకుండా హావభావాలు, నేపథ్య సంగీతంతో సాగే చిత్రమే ఉఫ్ ఏ సియాపా. దీన్ని ఓ మూకీ చిత్రంగా చెబుతాం. ఇదొక కామెడీ చిత్రం. తెరపై కేవలం పాత్రలు మాత్రమే కనిపిస్తాయి. ఈ సినిమా రెహమాన్ సంగీతం అందించడం కాక తన డ్రీమ్ నెరవేరిందని సంతోషం వ్యక్తం చేసారు. ఇప్పటి వరకూ రెహమాన్ ఎన్నో భాషల్లో ఎన్నో సినిమాలకు పని చేసారు. కానీ ఏ సినిమా గురించి ఇంత గొప్ప గా మాట్లాడింది లేదు. తొలిసారి ఓ మూకీ సినిమాకు అందించిన ఆనందం తనకు మరే సినిమా కలిగించలేదన్నారు. ఇలాంటి సినిమాలు సంగీతం అందించడం అన్నది ప్రతీ సంగీత దర్శకుడు ఓ కలగా భావిస్తారన్నారు. ఎలాంటి సంభాషణలు లేకుండా కేవలం స్కోర్ తోనే సినిమా చేయడం ఎవరికైనా ఓ కొత్త అనుభూతిని పంచుతుంది. ఇలాంటి సినిమాలకు పనిచేసే అవకాశం అందరికీ రాదన్నారు. తనకు రావడం అదృ ష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అప్పట్లో విశ్వనటుడు కమల్ హాసన్ నటించిన పుష్పక విమానం మూకీ చిత్రమే. ఈ సినిమా అప్పట్లో గొప్ప విజయం సాధించింది. ఆ తర్వాత మళ్లీ ఇలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఇంత కాలానికి ఉఫ్ యే సియాపే రాబోతుంది. మరి ఈ సినిమాకు ఎలాంటి స్పందన ఉంటుందో చూడా లి. ఈ సినిమా స్టోరీ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతుంది. ఇప్పటికే ఈ సినిమాకు మంచి బజ్ వచ్చింది. పుష్పక విమానం తర్వాత వస్తోన్న మూకీ చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. సినిమాకు రివ్యూలు కూడా పాజిటివ్ గా వచ్చాయి. దీంతో థియేట్రికల్ గానూ సినిమా మంచి విజయం సాధిస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సెప్టెంబర్ 5న ఈ చిత్రం విడుదలవుతుంది.

## అఖండ 2.. బాలయ్య కెరీర్ లోనే ఇది టాప్!



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ వరుస హిట్లతో ఫుల్ జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ఆరు పదుల వయసులో కూడా తన సినిమాలతో అలరిస్తున్నారు. యాక్టింగ్ తో మెప్పిస్తున్నారు. ఇప్పుడు అఖండ-2 మూవీలో యాక్ట్ చేస్తున్నారు. స్టార్ అండ్ మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను.. ఆ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 2021లో వారిద్దరి కాంబినేషన్ లో వచ్చిన అఖండ.. ఓ రేంజ్ లో హిట్ అయింది. బాక్సాఫీస్ ను ఒక్కసారిగా షేక్ చేసింది. బాలయ్య కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. దీంతో అఖండ-2 అనౌన్స్మెంట్ రావడమే లేట్.. ఆడియన్స్ తో పాటు అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. టీజర్ అయితే వాటిని ఫుల్ గా పెంచేసింది. బాలయ్య, బోయపాటి కాంబోలో మరో బ్లాక్ బస్టర్ లోడింగ్ అని అంతా ఫిక్స్ అయ్యారు. అయితే దసరా కానుకగా సినిమాను సెప్టెంబర్ 25వ తేదీన రిలీజ్ చేస్తామని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. ఆ తర్వాత వాయిదా పడుతుందని వార్తలు వచ్చినా రెస్పాండ్ అవ్వలేదు. రీసెంట్ గా అనుకున్నట్లే మూవీ రిలీజ్ పోస్ట్ పోన్ చేశారు. డిసెంబర్ 5న రిలీజ్ చేస్తారని వార్తలు వస్తుండగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ ను కంప్లీట్ చేస్తున్నారు. అదే సమయంలో ఒప్పందాలను ఖరారు చేసుకుంటున్నారు. అయితే అఖండ-2 డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను పొందేందుకు పలు ఓటీటీ పడుతున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అమెజాన్ దక్కించుకుందని టాక్ వచ్చింది. కానీ ఇప్పుడు జియో హాట్ స్టార్.. అఖండ సీక్వెల్ రైట్స్ ను సొంతం చేసుకుందని సమాచారం. రూ.85 కోట్లకు దక్కించుకుందని తెలుస్తోంది. సంక్రాంతి సెలవుల సీజన్ లో డిజిటల్ స్ట్రీమింగ్ కు అందుబాటులో ఉండేలా డిసెంబర్లో చిత్రాన్ని విడుదల చేయాలని వారు జియో హాట్ స్టార్ నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారని వినికిడి. అయితే అదే జరిగేలా ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాగా.. అఖండ-2 డిజిటల్ డీల్.. బాలయ్య కెరీర్ లో అతిపెద్ద ఒప్పందంగా తెలుస్తోంది. ఇటీవల కాలంలో తెలుగు చిత్రానికి జరిగిన అతిపెద్ద డిజిటల్ ఒప్పందాల్లో కూడా ఒకటని చెప్పాలి. ఏదేమైనా డివోషనల్ టచ్ తో యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఆ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై పై రామ్ ఆచంట, గోపి ఆచంట గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మరి ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

## ఉస్తాద్ సర్ ప్రైజ్.. అల్ట్రా స్టైలిష్ లో పవర్ స్టార్

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు ప్రతి సంవత్సరం అభిమానులకు ఒక పండుగ వాతావరణమే. ఈసారి కూడా మేకర్స్ ముందుగానే ఫ్యాన్స్ కోసం స్పెషల్ గిఫ్ట్ రెడీ చేశారు. పవన్ లైనప్ లో ఉన్న సినిమాల్లో ఒకటైన ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసి హైప్ రెట్టింపు చేశారు. ఈ కొత్త పోస్టర్‌లో పవన్ కళ్యాణ్ పూర్తిగా అల్ట్రా స్టైలిష్ లుక్‌లో దర్శనమిచ్చారు. బ్లాక్ అండ్ బ్లాక్ కాస్ట్యూమ్ వేసుకుని పవన్ ఇచ్చిన డ్యాన్స్ ఫోజ్ కింగ్ లా కనిపించింది. బ్యాక్‌డ్రాప్‌లో ఉన్న క్లాక్ సెట్ అద్భుతమైన గ్రాండ్ లుక్‌ను తీసుకొచ్చింది. పవన్ స్టైల్, బాడీ లాంగ్వేజ్, అటిట్యూడ్ ఇవన్నీ కలిపి ఈ పోస్టర్‌ను నెక్స్ట్ లెవెల్‌లోకి తీసుకెళ్లాయి. ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ఈ పోస్టర్‌నే ఫుల్‌గా షేర్ చేస్తున్నారు. ఆయన చేయబోయే డ్యాన్స్ నంబర్స్ ఎలా ఉండబోతాయో అన్న ఉత్సుకత అప్పుడే మొదలైంది. గబ్బర్ సింగ్ తరహాలోనే మరింత పవర్‌ఫుల్ మాస్




యాక్షన్, ఎంటర్టైన్మెంట్‌తో ఈ సినిమా వస్తుందని అనుకుంటున్నారు. డైరెక్టర్ హరీష్ శంకర్ స్టైల్ డైలాగ్స్‌తో పాటు పవన్ ఎనర్జీ కలిస్తే పెద్ద ఎత్తున సెలబ్రేషన్ అవుతుందని ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. ఈ సినిమాలో హీరోయిన్లుగా శ్రీలీల, రాశి ఖన్నా నటిస్తున్నారు. ఇద్దరు బ్యూటీస్ పవన్‌తో స్క్రీన్ షేర్ చేయడం స్పెషల్ అట్రాక్షన్ అవుతుంది. ఇక రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తుండటం మరింత ఎక్స్‌పెక్టేషన్‌ను పెంచుతోంది. పవర్ స్టార్ స్టైలిష్ డ్యాన్స్ మువ్స్, మాస్ డైలాగ్స్, మాస్ ఫీలింగ్ కలగలిపిన ఈ సినిమా పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యేలా మేకర్స్ ప్రయత్నం చేస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మొత్తానికి, పవన్ బర్త్‌డే పోస్టర్ అభిమానులకు నిజమైన గిఫ్ట్ అయింది. ఈ విజువల్‌ను చూసి ఫ్యాన్స్ పాజిటివ్ గానే స్పందిస్తున్నారు. మరి మేకర్స్ రాబోయే రోజుల్లో ఇంకెలాంటి అప్డేట్స్ ఇస్తారో చూడాలి.

## జాన్వీ కపూర్ స్థానం గూగుల్-ఏఐ కూడా దొరకలేదా?

బాలీవుడ్ లో జాన్వీ కపూర్ స్థానం ఎక్కడ? ర్యాకింగ్ లో అమ్మడు ఎన్నవ స్థానంలో ఉంది? అంటే గూగుల్ -ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లో కూడా వెతుక్కోవాల్సిన పనిలేదు. జాన్వీ బాలీ వుడ్ కి ఎంట్రీ ఇచ్చి ఏడేళ్లు అవుతుంది. ఈ ఏడేళ్లలో జాన్వీ ఏం సాధించిందంటే? ఏం చెబుతాము? అన్నట్లే కనిపిస్తోంది సన్నివేశం. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ధర్మ ప్రొడక్షన్స్ లో దడక్ తో లాంచ్ అయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ చేసిన సినిమాలు 13. వాటిలో రెండు సినిమాలు గెస్ట్ అపీరియన్స్ లు తీసేస్తే 11.

**కలిసి రాని కాలం:** మరి వీటిలో ఎన్ని సినిమాలు విజయం సాధించాయంటే? చెప్పడం కష్టమే. ధడక్ యావరేజ్ గా ఆడింది. గుంజన్ సక్సేనా బయోగ్రఫీలో నటించినా వర్కౌట్ అవ్వలేదు. ఓ మంచి ప్రయత్నం చేసిందనే ప్రశంస తప్ప ఆ సినిమా ద్వారా జాన్వీ సాధించింది ఏం లేదు. మిగతా సినిమాల గురించి చెప్పాల్సిన పనిలేదు. అన్ని ఒకదానికొకటి పోటీ పడి మరీ ఫ్లాప్ రికార్డులు అందించిన చిత్రాలే. టాలీవుడ్ లో దేవరతో లాంచ్ అయింది. ఇక్కడైనా గ్రాండ్ విక్టరీ కొట్టిందంటే? అదీ లేదు. దేవర డివైడ్ టాక్ తోనే నడించింది.

**జాన్వీ బ్రాండ్ ఎక్కడ?** ఎన్టీఆర్ ఇమేజ్ తో సోసోగా ఆడిన చిత్రం.



మరి తంగ పాత్ర పరంగానైనా మార్క్ వేసిందా? అంటే అదీ లేదు. అమ్మడి పాత్రకు అందులో పెద్దగా స్కోప్ లేదు. పరిమితంగానే తెరపై కనిపించింది. ఓవరాల్ గా మొత్తం సినిమాలన్నింటి లో ఉత్తమ నటి అనే ప్రశంస ఏ సినిమాకైనా దక్కిందా? అంటే అదీ లేదు. కొంత మంది నటీమణులు నటించిన సినిమాలు పెయిలైనా పాత్రల పరంగా తమ ముద్ర వేస్తారు. జాన్వీ ఆవి షయంలో కూడా వెనుకబడే ఉంది.

**పెద్దిపైనే ఆశలన్నీ:** ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మామ్ ఇమేజ్ తో- డాడ్ ప్రోత్భబ లంతో అవకాశాలు అందుకోవడం తప్ప జాన్వీ సాధించిందేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల రిలీజ్ అయిన పరమ్ సుందరి కూడా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. ఈ సినిమా పై జాన్వీ కూడా చాలా ఆశలే పెట్టుకుంది. కానీ అవన్నీ తప్పాయి. ఇక జాన్వీ చేతిలో ఉన్నది పెద్ది అనే పాన్ ఇండియా చిత్రం ఒక్కటే. ఈ సినిమాతోనైనా కపూర్ బ్యూటీ తన బ్రాండ్ వేస్తుందా? గూగూల్-ఏఐల్లో ర్యాంక్ ను రిజిస్టర్ చేస్తుందా? అన్నది చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536